
శ్రీమద్రామాయణము ఆదికావ్యం.
రసభరితమైన రఘునాథుని చరితము.
వాల్మీకి వాక్సుధ. రసోద్వేగము గల రచన.
అభ్యుదయానికి, ఆదర్శానికి నిదర్శనమైన గ్రంథం.
ఆలోచనామృతమైన సాహిత్యం, ఆపాత మధురమైన కవిత్వం గొప్ప వరదలా ప్రవహించింది ఈ కావ్యంలో.
శ్రీమద్రామాయణము మోక్షప్రదాయిని.
ఆనందదాయిని. రసానంద సాగరాన్ని సదా స్పృశించే సజీవ కావ్య స్రోతస్విని.
ఇది కాలపరీక్షకు తట్టుకొనిన గ్రంథము.
భారతజాతిని ధర్మజాగరణలో నిలిపిన గ్రంథం.
ఈనాటి ప్రపంచానికి అత్యవసరమైన గ్రంథం.
అందుకే, ఈ

**చైతన్య రామాయణము**

వాల్మీకి ముఖ వినిస్సృతమైన శ్రీమద్రామాయణానికి హృదయంగమంగా సాగిన
జ్ఞానబ్రహ్మ వ్యాఖ్యానము.
మహిమను వర్ణించి, మనిషిని తీర్చిదిద్దే మహా కార్యము.
బ్రతుకుకు అద్దంపట్టే కావ్యం. అర్థం చెప్పే కావ్యం.
తమదైన, అరుదైన రసోద్వేగం గల మధుమయ రచనాపాటవంతో,
జ్ఞానబ్రహ్మ
**స్వామి సుందర చైతన్యానందుల వారు**
తమకు దైవనియోగంగా, మనకు ప్రసాద విని యోగంగా భావించి, రచించిన మధురాక్షర కావ్యం.

ఇది చైతన్య రామాయణము
భక్తులకు సారథి. విమర్శలకు వారధి.
సాధకులకు పెన్నిధి. నిజానికి, రామప్రభువు సన్నిధి.
ఇక చదవండి.


# చైతన్య రామాయణము



స్వామి సుందర చైతన్యానం

చైతన్య రామాయణము

2



దక్షిణే లక్ష్మణో యస్య
వామే చ జనకాత్మజా
పురతో మారుతి ర్యస్య
తం వందే రఘునందనమ్ ॥

# చైతన్య రామాయణము (ద్వితీయభాగము)

స్వామి సుందర చైతన్యానంద

ప్రథమ కెరటం:
జనవరి 1995 - 15,000 ప్రతులు



ప్రతులకు:
సుందరచైతన్యఆశ్రమం
ధవళేశ్వరం - 533 125
☎ 77378

ముద్రణ :
శ్రీ లక్ష్మీ గణపతి బైండింగ్ వర్క్స్
కొవ్వూరు - 534 350 ☎ 575



భగవాన్ మురళీకృష్ణ
సుందర చైతన్యాశ్రమం

# చైతన్య రామాయణము

## (ద్వితీయభాగము)



జ్ఞానబ్రహ్మ

స్వామి సుందర చైతన్యానంద


## విషయసూచిక

### కిష్కింధాకాండము




### సుందరకాండము

## యుద్ధకాండము



హనుమత్‌సమేత శ్రీసీతారామలక్ష్మణులు

సుందర చైతన్యాశ్రమం



## ప్రార్థన

శ్రీరాఘవం దశరథాత్మజ మప్రమేయం
సీతాపతిం రఘు కులాన్వయ రత్న దీపమ్
ఆజానుబాహు మరవింద దలాయతాక్షం
రామం నిశాచర వినాశకరం నమామి

**రఘువంశమున జన్మించినవాడు, దశరథుని కుమారుడు, అప్రమేయుడు, జానకీ వల్లభుడు, రఘువంశమునకు రత్నదీపము వంటివాడు, ఆజానుబాహుడు, పద్మపు రేకులవంటి నేత్రములు గలవాడు, రాక్షసులను సంహరించినవాడు అగు శ్రీరామచంద్రునకు నమస్కరించు చున్నాను.**

***I bow to the Glorious scion of Raghu, the Lord of Sita, the inscrutable Being who became the son of Dasaratha the Jewel. Lamp that brightened the races of Raghu, Sri Rama of long arms, and of broad eyes like lotus-petals, the destroyer of the demons.***



## శ్రీరామ ప్రాతః స్మరణము

ప్రాతఃస్మరామి రఘునాథ ముఖారవిందం
మందస్మితం మధురభాషి విశాల ఫాలమ్ ।
కర్ణావలంబి చలకుండల శోభిగండం
కర్ణాంత దీర్ఘనయనం నయనాభిరామమ్ ॥ 1

చిరునవ్వుతో భాసించునది, తియ్యని మాటలు పలుకునది, విశాలమైన నుదురు కలది, కుండలములచే ప్రకాశించు చెవులు గలది, శోభాయమానమైన చెక్కిళ్ళతో కూడినది, కర్ణముల వరకు ఉండెడి విశాలమైన కన్నులు గలది, చూచువారికి కన్నులపండుగ యైనది యైన శ్రీరామచంద్రుని ముఖకమలమును ప్రాతఃకాలమున స్మరించుచున్నాను.

ప్రాతర్భజామి రఘునాథ కరారవిందం
రక్షోగణాయ భయదం వరదం నిజేభ్యః ।
యద్రాజ సంసది విభజ్య మహేశ చాపం
సీతాకరగ్రహణ మంగళమాప సద్యః ॥ 2

రాక్షసులకు భయంకర మైనదియు, నిజభక్తులకు అనుగ్రహప్రద మైనది, రాజసభ యందు శివధనుస్సును విరిచి సీతాపాణిగ్రహణ రూపమైన మంగళకార్యమునకు కారణమైన శ్రీరామచంద్రుని కరకమలములను ప్రాతఃకాలమున భజించుచున్నాను.

ప్రాతర్నమామి రఘునాథ పదారవిందం
పద్మాంకుశాది శుభరేఖ సుఖావహం మే ।
యోగీంద్ర మానస మధువ్రత సేవ్యమానం
శాపాపహం సపది గౌతమ ధర్మపత్న్యాః ॥ 3

పద్మము, అంకుశము మొదలైన మంగళరేఖలతో శోభించునవి, ఆనందము నందించునవి, గొప్ప యోగుల మానసము లనెడి తుమ్మెదలచే ఆస్వాదించబడునవి, గౌతమమహర్షి ధర్మపత్ని యైన అహల్యను తక్షణమే శాపవిముక్తురాలను చేసినవి ఐన శ్రీరామచంద్రుని పాదపద్మములను ప్రాతఃకాలమున నమస్కరించుచున్నాను.

ప్రాతర్వదామి వచసా రఘునాథనామ
వాగ్దోషహారి సకలం శమలంకరోతి ।
యత్పార్వతీ స్వపతినా సహ భోక్తు కామా
ప్రీత్యా సహస్ర హరినామ సమం జజాప ॥ 4

వాక్కు యందలి సకలములైన దోషములను హరించునది, శుభమును కలిగించునది, పార్వతీదేవి చేత, తన భర్త యైన శివునితో కూడి, ప్రీతితో జపింపబడునట్టిది యైన రామనామమును ప్రాతఃకాలమున వాక్కులో పలుకుచున్నాను.

ప్రాతఃశ్రయే శ్రుతినుతాం రఘునాథమూర్తిం
నీలాంబుజోత్పల సితేతర రత్ననీలామ్ ।
ఆముక్త మౌక్తిక విశేష విభూషణాఢ్యాం
ధ్యేయాం సమస్తమునిభి ర్జనముక్తి హేతుమ్ ॥ 5

సర్వశ్రుతులచే స్తుతింపబడునది, నల్లకలువ వలె శోభించునది, నీలిరత్నము వలె ప్రకాశించునది, ముత్యములతో కూడిన ఆభరణములను అలంకరించుకొని భాసించునది, సకల మునిజనులకు ధ్యేయరూప మైనది, సర్వులకు ముక్తిప్రద మైనది అయిన శ్రీరామచంద్రుని స్వరూపమును ప్రాతఃకాలమున ఆశ్రయించుచున్నాను.

యఃశ్లోక పంచక మిదం ప్రయతః పఠేత్తు
నిత్యం ప్రభాతసమయే పురుషః ప్రబుద్ధః ।
శ్రీరామ కింకరజనేషు స ఏవ ముఖ్యో
భూత్వా ప్రయాతి హరిలోక మనన్య లభ్యమ్ ॥


అనునిత్యం ప్రభాత సమయమున యే బుద్ధిమంతుడైన పురుషుడు పైన చెప్పబడిన ఐదు శ్లోకములను ప్రీతితో పఠించునో, అతడు శ్రీరామభక్తులలో ప్రముఖుడై, అన్యులకు దుర్లభమైన విష్ణులోకమును పొందుచున్నాడు.

# కిష్కింధాకాండము





# శ్రీరామ
# జయరామ
# జయ జయ రామ....



## తొలకరి

పొదుగు పిడికెడంత
పిండితే పాలే కుండంతా
దీపము చూస్తే గోరంత
వెలుగును చూస్తే కొండంత
చింతలు తొలగిన నాడు మనసే విందులవాడ
దారులు తెలిసిన నాడు బ్రతుకే ఆశారేఖ.

### ఇది కిష్కింధాకాండము.

రామాయణ జీవనది ఈ కాండములోనే ఒక మలుపు తిరిగింది.
అదొక చక్కని మలుపు.
ఊహకు చిక్కని తలపు.
పట్టాలపై రైలుంటుంది. రైలుబండిలో మనముంటాం.
చీలు దారిలో బండి ఎటో! దారి ఏదో!
పాయింట్లు మారితే,
దారే మారిపోతుంది.
గమ్యమే జారిపోతుంది.
తిరిగే వాళ్ళమే గాని త్రిప్పేది మనం కాదు.
తిరిగి తిరిగి అలసిన వాళ్ళను త్రిప్పేందుకు ఎవరో ఉంటారు.
వారే కబంధులు.
బంధాలను అందాలుగా మార్చే కబంధులు. జీవిత బంధువులు.
సుగ్రీవునితో మైత్రీబంధాన్ని సూచించిన వాడు కబంధుడే.
బాహుబంధాల్లో చిక్కించుకున్నా బ్రతుకు అందాన్ని చేజిక్కించాడు.

సుగ్రీవుని చిరునామా తెలిపి, రామలక్ష్మణులను ఋష్యమూకానికి
కబంధుడు మరలించకుండా ఉన్నట్లయితే ప్రయాణము ఎటు
సాగేదో! ప్రమాదము ఎలా తొలిగేదో!

కాంతికి, శాంతికి కేంద్రస్థానమై శోభించాడు కబంధుడు.
కిష్కింధాకాండ భవనానికి చక్కని పునాది కబంధుడే.

కాలిన పుడమిని చల్లబరుస్తుంది కాలము నెరిగిన కబంధము
కలత చెందిన రాముని ఊరడించాడు బందీయైన కబంధుడు

తియ్యని ఆశాలతను ప్రాకించాడు
తెల్లని విశ్వాస పుష్పాల నందించాడు
చల్లని మైత్రీ మధువును చిలికించాడు

మంచి మాటల తైలంతో చీకట్లు ముసిరిన జీవితాలలో ఆనంద
దీపాన్ని వెలిగించాడు.

వెలిగించుకోవాలి ప్రతి మనిషీ దీపం
సరిచేసుకోవాలి తనలోని లోపం

లోపం జీవికి పాపం కాకూడదు
జీవితంలో అది శాపంగా మారకూడదు

పిలవకుండా మిత్రులు వస్తారు
పిలిచినట్లు శత్రువులు వస్తారు

పరమాత్మ నీకు మిత్రుడైతే అందరూ నీకు మిత్రులే.
పరమాత్మ జాడ తెలియని వాడు విశ్వమంతా శత్రువులే

వెలుగున్న చోట మిగలవు తిమిరాలు
ప్రేమున్న చోట ఉండవు తరగతులు

మనోగతులు మారితే మానవులకు సద్గతులే
అది మారని వాడు ఎదురయ్యేవి దుర్గతులే

[illegible] సంబంధమే రామసుగ్రీవుల మైత్రి
[illegible]తో ప్రసరిస్తుంది శాంతియుత ధాత్రి

ధర్మానికి సారథి దాశరథి
దాటించనున్నాడు జీవన మహోదధి

అధర్మజీవనము ఏనాడైనా ఖాళీ
అని తెలిపేందుకే నేల రాలాడు వాలి

ఆగి సేద తీర్చుకొనేందుకు చలివేంద్రము
యోగి విశ్రమించేందుకు ప్రస్రవణము

వేచి చూడడంలో వేడుకుంది
ఆగి ఆలోచించడంలో అందముంది

తీపి బ్రతుకు కావాలి అందరికీ
తియ్యగా బ్రతకడం తెలిపింది ఎందరికి?

రాజుల్ని జయిస్తే రాజ్యాలు లభిస్తాయి
నిన్ను నీవు జయిస్తే సుఖాలు ప్రాప్తిస్తాయి

ఆకాశంలో తారలెన్నో ఉంటాయి
తారాపథంలో తారలా ఎందరుంటారు?

మణులలో దారం లాగా
ధర్మానికి ఆధారమై
దారి తెలియని వారి వెంట నిలిచిన ధర్మధార. ఆవిడే తార.
తారుమారైన జీవితాలను తాలిమితో తీర్చిదిద్దే తార. జీవికి
తార. జీవన సితారా.

తద్వనంలో శబరిని చూపుతుంది అరణ్యకాండము
మహద్వనంలో స్వయంప్రభను తెలుపుతుంది కిష్కింధాకాండము

మహర్షుల తద్వనాన్ని సంరక్షించింది శబరి
హేమ మహద్వనాన్ని పరిరక్షించింది స్వయంప్రభ.

ఇద్దరూ తపస్వినులే. ఇరువురూ పరిరక్షకులే.
తపోధనులే ఏనాడైనా రక్షకులు. పరిరక్షకులు. వనరక్షకులు.
ఉపనిష ద్వనరక్షకులు.

రామలక్ష్మణులకు శబరి ఆతిథ్యం
అంగద హనుమదాదులకు స్వయంప్రభ ఆతిథ్యం

బాహ్యంలో ప్రకాశిస్తూ ఊర్ధ్వంగా వెళ్తుంది శబరి
అంతర్యంలో శోభిస్తూ అంతర్ముఖ మవుతుంది స్వయంప్రభ.

శబరిలా తరలిపోవాలి
స్వయంప్రభలా తరించాలి
తరించాలనుకుంటే తీరానికి తరలిపోవాలి
సాగర తీరానికి తరలిపోవాలి
భవసాగర తీరానికి తరలిపోవాలి

ఎగురుతూ వెలగాలని, వెలుగుతూ ఎగరాలని వెలుగుల తోరణాలను ఆవిష్కరించిన రామాయణ మహామాలారత్నం హనుమంతుడు, శతయోజన విస్తీర్ణం గల సముద్రాన్ని గోష్పదంలా భావించి, ఒక్కపట్టున పిట్టగోడను దాటినట్లు లంఘించి, "ఇలా దాటాలి భవసాగరాన్ని" అని ప్రదర్శించి చూపడానికి సిద్ధపడ్డాడు.

ఏడిస్తే ఏమీ రాదు
ఎగిరిన వాళ్ళకే ఏదైనా

బాధైనా భరించాలి భారము తీరేదాకా
చేదైనా వహించాలి చిత్తము అణగేదాకా

ధైర్యం ముందు నడవాలి
దైవం వెనుక నిలవాలి. వెలగాలి.

పోదాం పదండి

సాధుజన సంగమంలో
సాగరతీరాన
ప్రభుపాద రేణువు
మీ
స్వామి సుందర చైతన్యానంద

# చైతన్య రామాయణము

## కిష్కింధాకాండము

### హనుమద్దర్శనము

ఉల్లంఘ్య సింధోస్సలిలం సలీలం
యశ్శోకవహ్నిం జానకాత్మజాయాః
ఆదాయ తేనైవ దదాహ లంకాం
నమామి తం ప్రాంజలి రాంజనేయమ్ ॥

సముద్రజలాలను అవలీలగా దాటి, జానకి యొక్క శోకాగ్నిని తీసికొని లంకను దగ్ధం చేసిన ఆంజనేయునకు చేతులు జోడించి నమస్కరిస్తున్నాను.

**I bow down to that Anjaneya, the son of Anjanaa, who, having crossed the waters of the ocean with effortless ease and grace, burnt the city of Lanka by bringing the self-same fire of grief that was tormenting Sita, the daughter of Janaka.**

కలువలతో కప్పబడి, పరచినట్లున్న పద్మములతో నిండిన పంపాసరోవరము వైడూర్యమణి లాగా నిర్మలంగాను, మంగళకరంగాను శోభిస్తోంది. చేపల చలనము వల్ల మెల్లగా కదుల్తున్న జలము ముచ్చటగా కనిపిస్తూ మనసుల్ని చలింప చేస్తోంది.

సుందరమైన పంపాసరోవర ప్రాంతము ఎగురుతున్న లేళ్ళతో, వాలుతున్న పక్షులతో, మెల్లగా తొండములను కదిలిస్తూ నడుస్తున్న ఏనుగులతో రమణీయంగా ఉంది. పచ్చని

పచ్చికపై రాలిన రంగురంగుల పుష్పాలతో ప్రకాశిస్తున్న పచ్చికబీడు అందమైన తివాసీలా తెలుస్తోంది.

సుమపూర్ణమైన వృక్షములను కోమలమైన లతలు గాఢంగా పెనవేసుకొని వియోగుల విరహాగ్నిని ప్రజ్వలింప చేస్తున్నాయి. పుష్పించిన లతలు గాలికి కదులుతూ మనసుల్ని చలింప చేస్తున్నాయి. మన్మథుడు మహావైభవంతో మనోహరంగా వెలిగిపోతున్నాడు.

గాలికి చెట్ల కొమ్మలు కదిలాయి. కొమ్మలకు పూసిన పూలు రాలాయి. పూలపై వాలిన తుమ్మెదలు జారాయి. మళ్ళీ ఝుమ్మంటూ ఆడుతున్నాయి. తుమ్మెదల నాదానికి తోడైన కోకిలలు పన్నాయిని శ్రుతి చేసినట్లు కుహూ-కుహూ అంటుండగా, పర్వతగుహ నుండి మెల్లగా కదిలొచ్చే గాలి గొంతెత్తి పాడుతూ ఉన్నట్లుంది.

గాలికి కదుల్తూ ఊగుతున్న చెట్లు, కొమ్మలనే చేతులుగా చాచి, ఒకదానితో మరొకటి చేరి సామూహికంగా నాట్యం చేస్తున్నట్లుంది. పుష్పసుగంధ భరితమై, చందన శీతలమై వీచే గాలి చల్లగా చర్మాన్ని తాకి, మెల్లగా మనసును కదిలిస్తోంది. ఇలా ఉంది వసంత వేడుక.

"లక్ష్మణా! నన్ను మనోక్షోభకు గురిచేస్తున్న ఈ వసంతశోభను చూస్తున్నావు కదూ! నా మీద ప్రకృతికి ఎందుకు ఇంత పగ! పగలు ఒలకబోస్తూ సెగలు రేపుతోంది. మధురంగా కూస్తున్న పక్షులు, మంజులంగా విచ్చుకున్న పుష్పాలు, ఏటిమాటలు, గాలిపాటలు నాలో మదనావేశాన్ని కావాలనే రెచ్చగొడుతున్నాయి.

"సౌమిత్రీ! నాతో గిల్లికజ్జాలు పెట్టుకొనే ఆ కోకిలమ్మ పాట విను! సంతోషంతో కూస్తున్న ఆ నీటికోడి నన్ను ఎంత సంతాపానికి గురిచేస్తుందో చూడు. ఆడపక్షులన్నీ ఓరకంటితో నన్ను చూస్తూ మగపక్షుల్ని సమీపిస్తున్నాయి. రమ్యమైన దాత్యూహ పక్షుల రతికూతలు నాకు పిచ్చెక్కిస్తున్నాయి. పుంస్కోకిలలు నామీద నిర్దాక్షిణ్యంగా పూలబాణాలు విసురుతున్నాయి. మెల్లగా, మెత్తగా, మధురంగా మాట్లాడే సీతను గుర్తుచేసి బాధిస్తున్నాయి.

"వసంతఋతువు అంటే వైదేహి పడి ఆనందించేది. లక్ష్మణా! అటు చూడు. అందమైన ఆ ఆడునెమలి మత్తెక్కిన మగనెమలితో కలిసి ఎంత చక్కగా ఆడుతుందో! ఆ మయూరము ప్రియురాలిని వనములో రాక్షసుడు అపహరించలేదు. అందుచేత అవి ఆనందంగా క్రీడిస్తున్నాయి.

"ఈ వసంత శోభ జానకి ఉండేచోట కూడా ఉంటుందా? అయితే కామోన్మాదం ఆమెను కూడా వదిలిపెట్టదు కదా! బహుశ అక్కడ ఉండదేమోలే! ఒకవేళ ఉంటే,- భరించలేక సీత ప్రాణత్యాగము చేస్తుందేమో!

**మయి భావోహి వైదేహ్యా స్తత్త్వతో వినివేశితః**
**మమాపి భావః సీతాయాం సర్వథా వినివేశితః**

"సీత మనసు నామీదే ఉంది. నా మనసు సీత మీదనే ఉంది.

"ఆహా! ఏమి ఈ మదముని ప్రతాపం! మంచును పరుస్తూ, మల్లెలను మోస్తూ, హాయిగా వీస్తున్న మలయమారుతం నాలో మదనోద్రేకాన్ని రెచ్చగొడుతోంది. విరహాగ్నితో కుమిలిపోతున్న నన్ను ఈ మందమారుతం మండింపచేస్తోంది.



"సీత తోడుగా ఉన్నప్పుడు నాకు ఎంతో హాయిని కూర్చిన వసంతము, సీత లేదని తెలిసి నేడు నన్ను ఇంతగా బాధిస్తుందా? లక్ష్మణా! పద్మాలంటే సీతకు ఎంతో ప్రీతి! నీకు తెలుసుకదూ! చూడు. పంపాసరస్సులో సుగంధ భరితమైన పద్మాలు లేత సూర్యుల వలె ప్రకాశిస్తున్నాయి. వాటి దర్శనము నా హృదయాన్ని దహించి వేస్తోంది.

"ప్రతిచోటా నా సతినే గుర్తుచేస్తూ బాధించే మదనుడు ఎంత మోసగాడు? వసంతుడు ఇంత వంచకుడా? పంపాతీరమంతా మల్లె పొదలతో, మొగలి డొంకలతో, మాలతీ లతలతో మనోహరంగా ఉంది. నాకు మోహాన్ని కల్పించి మాయ చేసేందుకే అవన్నీ అక్కడ విడిది చేసున్నాయని నాకు తెలుసు.

"చూడు! అందమైన వృక్షాలను కోమలమైన ఆ లతలు ఎందుకు అలా అల్లుకున్నాయో నాకు తెలియదనా? పూల చెట్లలో తేనె వాసనలు ఎందుకొస్తున్నాయో నేను తెలుసుకోలేనా? రాలిన పూలు నేలపై పక్క ఎందుకు పరచాలి?

"లక్ష్మణా! నాకు సీత లభించి, మనమంతా ఈ రమణీయ ప్రదేశములో వసించ గలిగితే నాకు ఇంద్రపదవి కూడా అవసరం లేదు. అయోధ్యకు వెళ్దామని పొరపాటున కూడా అనను.

"నేను నిర్భాగ్యుణ్ణి. రాజ్యభ్రష్టుణ్ణి. తండ్రిచేత అడవులకు తరిమివేయబడ్డ వాణ్ణి. అట్టి నన్ను సీత అనుసరించి వచ్చింది. అయ్యో! ఇప్పు డెక్కడుందో? అందమైన సీతను నేను వీక్షించే దెప్పుడు? ఆమె అనురాగపు మాటలు నా వీనులకు అందే దెప్పుడు?" అని దుఃఖించడం ప్రారంభించాడు.

"అన్నా! రామా! నీకు శుభం కలుగుతుంది. అధైర్యపడకు. మంచివారి బుద్ధి మందగించ కూడదు. నువ్వు నిర్మలంగా ఉండు. ముందుగా పాపాత్ముడైన రావణుని జాడను మనం తెలుసుకోవాలి. ఆ తరువాత వాడు సీతనైనా వదలాలి. లేదా ప్రాణాన్నైనా వదలాలి.

"పోయిన దానిని ఉత్సాహవంతులే తిరిగి పొందగలరు. దైన్యాన్ని వదులు. ధైర్యాన్ని పట్టుకో. దుఃఖాన్ని నెట్టేయి. ధీశక్తిని పెంచేయి. ఉత్పాతాలు వచ్చాయని ఉత్సాహాన్ని పోగొట్టుకో కూడదు.

**ఉత్సాహో బలవా నార్య నాస్త్యుత్సాహా త్పరం బలమ్**
**సోత్సాహస్య హి లోకేషు న కించిదపి దుర్లభమ్ ।**

"ఉత్సాహము చాలా బలమైనది. ఉత్సాహాన్ని మించిన బలము లేదు. ఉత్సాహవంతునకు ఈ ప్రపంచములో అలభ్యమైనది లేదు. అసాధ్యమనేది ఉండదు.

"అన్నా! ఉత్సాహపరులకు ఓటమి లేదు. నా మాట విను. ఉత్సాహాన్ని పెంచుకో. సీతను ఎలాగైనా అన్వేషించి తెలుసుకుందాం. నీ గొప్పతనం నీకు తెలియడం లేదు;" అన్నాడు లక్ష్మణుడు.

లక్ష్మణుని మాటలు రామునికి ధైర్యాన్నిచ్చాయి. ఉత్సాహాన్నిచ్చాయి. శోకాన్ని, మోహాన్ని తరిమేశాయి. దిగులు విడిచిన రాముడు దివ్యంగా శోభించాడు.

రామలక్ష్మణులు పంపను దాటారు. వనశోభను, సెలయేళ్ళను, పర్వతగుహలను చూస్తూ రామలక్ష్మణులు బయలుదేరారు.

ఋష్యమూక పర్వతమును సమీపించారు. పర్వతప్రాంతమున సంచరిస్తున్న రామలక్ష్మణులను మహాత్ముడైన సుగ్రీవుడు చూశాడు అంటున్నాడు వాల్మీకిమహర్షి.

మహాత్ములే రాముని దర్శించగలరు. సుగ్రీవుడు దివ్యాత్ముడు. ధర్మాత్ముడు. మహాత్ముడు. అందుకే రాముడు సుగ్రీవుని సఖ్యాన్ని వాంఛించి సమీపిస్తున్నాడు.

తేజోవంతులైన రామలక్ష్మణులను చూచి వానరులు భీతి చెందారు. అరణ్యము లోనికి పరుగులు తీశారు. ఆయుధములు ధరించి, వీరుల వలె సమీపిస్తున్న రామలక్ష్మణులను చూచి సుగ్రీవుడు కూడా భయంతో క్రుంగిపోయాడు. ఒకచోట నిలువలేక పోయాడు. ధైర్యాన్ని కోల్పోయాడు.

నారబట్టలు ధరించి, ధనుర్బాణాలతో సంచరిస్తున్న రామలక్ష్మణులను, వాలి ప్రేరణతో తనను వధించడానికి వచ్చిన వారుగా సుగ్రీవుడు అభిప్రాయ పడ్డాడు. అంతటితో ఆగకుండా ఈ విషయాన్ని వానరుల చెవుల్లో పడేశాడు.

సుగ్రీవుని మాటలు చెవిని పడ్డాయో లేవో వానరులు భయంతో చెట్లమీద పడ్డారు. పర్వతాలపై దుమికారు. పుష్పించిన చెట్లను విరిచేశారు. లేళ్ళకు, పెద్దపులులకు, పిల్లులకు ఆందోళన కల్పించారు.

సుగ్రీవుని మంత్రు లందరూ పర్వతముపై రాజు చుట్టూ చేతులు జోడించి భయపడుతూ నిలబడ్డారు. వారిలో నిర్భయుడై యున్న ఒకే ఒక వ్యక్తి హనుమంతుడు. వాలి కారణంగా భయపడుతున్న సుగ్రీవుని ఉద్దేశించి ఇలా పలికాడు. ప్రథమంగా నోరువిప్పిన ఈ సందర్భమున హనుమంతుడు అందంగా ఐదు శ్లోకాలు పలికాడు.

**సంభ్రమ స్త్యజ్యతా మేష సర్వై ర్వాలికృతో మహాన్**
**మలయోఽయం గిరివరో భయం నేహాస్తి వాలినః**

"భయపడకండి. ఈ పర్వతముపై ఉన్నంతకాలము మీకు వాలి వలన ఏ ఆపద రాదు. ఆ విషయంలో మీకు భయం అవసరం లేదు.

"వానరశ్రేష్ఠుడా! సుగ్రీవా! ఏ వాలిని తలచుకొని నీవు భయపడుచున్నావో క్రూరుడైన అట్టి వాలి ఇక్కడ లేడు కదా! నీ భయానికి కారణం నాకు తెలియుట లేదు.

"సౌమ్యుడా! నీవు ఏ వాలికి భయపడి పరుగుదీయుచున్నావో అట్టి దుష్టుడైన వాలి ఇక్కడెక్కడా కనిపించుట లేదు కదా!

"సుగ్రీవా! ధైర్యము లోపించుట చేత నీ బుద్ధి స్థిరత్వాన్ని కోల్పోయింది. నీ వానరత్వం తేటతెల్లమైంది. ఆశ్చర్యంగా ఉంది.

"స్థిరబుద్ధి లేని రాజు ప్రజలను ఎలా పాలిస్తాడు? అన్యుల అభిప్రాయాలను గ్రహిస్తూ, ఇంగితజ్ఞానముతో నిశ్చయబుద్ధి కలిగి ఉండు" అని హనుమంతుడు తన అభిప్రాయాన్ని రాజైన సుగ్రీవునకు ఐదు శ్లోకాల్లో వెల్లడించాడు.

**సంభ్రమః త్యజ్యతాం** ....... భయమును విడిచిపెట్టండి. ఈ వాక్యంతో వాయుసుతుని దివ్యవాణి ప్రారంభమైంది. అభయప్రదానంతో కదిలింది ఆంజనేయుని భాషణము.



భయము సర్వారిష్టములకు మూలము. సర్వోపద్రవములకు కారణము. భయాందోళనల మధ్య చెదిరిపోయే వ్యక్తులు ఆధ్యాత్మిక మార్గమున ప్రగతిని సాధించలేరు. ఆత్మానందమును పొంది తరించలేరు.

**కశ్చిద్ధీరః ప్రత్యగాత్మాన మైక్షత్ ఆవృత్త చక్షుః అమృతత్వ మిచ్ఛన్**

"ధీరుడైన వాడే అమృతత్వాన్ని అభిలషిస్తున్నాడు. అట్టివాడు ఇంద్రియాలను అంతర్ముఖం చేసి ప్రత్యగాత్మను దర్శించుచున్నాడు" అని కఠోపనిషత్తు.

భయమనేది కాల్పనికము. ప్రతి మనిషిలో అదొక సహజాతం లాగా కన్పిస్తూ ఉంటుంది. ఎప్పుడూ ఏదో ఒక భయం. ఉన్నది పోతుందనే భయం కొందరికి. ఆశించింది రాదేమో ననే భయం మరికొందరికి.

భయాన్ని జయించినవాడే ప్రగతిమార్గంలో చరించగలడు. భయకారణాలను తొలగించుకొని నపుడే భయం అదృశ్య మవుతుంది. భయపడదగిన వస్తువు ఈ ప్రపంచంలో ఏమీ లేదు. కనుకనే "భయపడకండి" అని ఆంజనేయుడు అభయప్రదానం చేసి ఆశీర్వదిస్తున్నాడు.

భయ మెరుగని హనుమంతుడు సముద్రాన్ని లంఘిస్తాడు. నిర్భయులే భవసాగరాన్ని దాటి తరించగలరు. భయము లేని వానిని చూచి చావు కూడా భయపడుతుంది. రామసేవాకార్యమును హనుమంతుడు అంత గొప్పగా నిర్వహించుటకు నిర్భయత్వమే కారణము.

**As on the one hand Hanuman represents the ideal of service, so on the other he represents leonine courage, striking the whole world with awe.**

"ఒకవైపు ఆంజనేయుడు సేవాధర్మమున ఆదర్శమూర్తిగా శోభిస్తాడు. మరియొక వైపు యావత్ప్రపంచాన్ని విస్మయ మొందించే ధైర్యసాహసాలు, సింహ పరాక్రమములు గల వ్యక్తిగా ప్రకాశిస్తాడు" అంటారు స్వామి వివేకానంద.

భయాన్ని కలిగించే కారణాలను హనుమంతుడు సుగ్రీవునికి చక్కగా వివరించి, కారణము లేని భయమును మనసులో తుడిపేసుకోమని సలహా ఇచ్చాడు.

1. తెలియనితనం 2. తెలిసిన దానిని నమ్మనితనం 3. లేని దానిని చూచేతనం 4. లేని దానిని నివారించే యత్నం 5. అధైర్యం - ఈ అయిదు భయకారణములు. ఈ అయిదింటిని నిరాకరిస్తూ ఐదు శ్లోకాలు చెప్పాడు.

మంత్రి మహిమాన్వితు డైతే రాజు, ప్రజలు సుఖిస్తారు. విజ్ఞానవంతుడే గాక వాక్చతురత కలిగినవాడై ఉండాలి. అందుచేతనే ఆంజనేయుని ఇక్కడ వాక్యకోవిదుడుగా వర్ణిస్తాడు వాల్మీకి.

సుగ్రీవుని భయనృత్యానికి తాళం వేస్తూ మంత్రులందరూ చేతులు ముడుచుకొని కూర్చున్నారు. హనుమంతుడు ఒక్కడే ధైర్యంగా సమాధాన మిచ్చి సుగ్రీవునిలో భయాన్ని పారద్రోలడమే గాకుండా ధైర్యాన్ని నూరిపోసాడు.

ఉన్నవాడే పెట్టగలడు. ధైర్యశాలియే ధైర్యాన్ని ప్రసాదించగలడు. నిష్కారణ భయంతో సుగ్రీవుడు తన వానరత్వాన్ని ప్రదర్శించుకున్నాడని సుగ్రీవునితోనే చెప్పే ధైర్యం ఆంజనేయునికే ఉంది. కనుకనే ఆయన ధీశాలి, ధైర్యశాలి.

హనుమంతుడు తాను వానరుడై ఉండి సుగ్రీవుని వానరత్వం వెల్లడైందని సుగ్రీవునితోనే చెప్పడం చాలా విచిత్రంగా ఉందికదూ!

తత్త్వము లేదా స్వభావము మనసుకు సంబంధించిందే గాని దేహానికి సంబంధించింది కాదు. మానవరూపంలో ఉన్నవారి కంతా మానవత్వం ఉన్నట్లేనా? అలాగే వానరరూపం ఉన్నంత మాత్రాన వానరత్వం ఉందని చెప్పలేము.

బుద్ధిశాలి, పవిత్రుడు, నిర్మలుడు అయిన పవనసుతుడు తనకు వానరరూప మున్నా తాను వానరుడని భావించడం లేదు. వానరస్వభావం తనలో లేకపోవడమే అలా భావించుటకు కారణము.

దుష్టుడైన వాణ్ణి దేవుడని పరులు స్తుతించినా తాను దేవుడే నని దుష్టుడు ఆంతర్యంలో ఎలా నమ్మడో, అలాగే అన్యులెలా భావించినా, భాషించినా, తన జ్ఞానమునకు సంబంధించిన నిశ్చితాభిప్రాయమును జ్ఞాని కలిగియే ఉంటాడు. ఎదుటివారి నిర్ణయాలకన్నా ఎదసౌందర్యమే జ్ఞానిలో ప్రధాన విషయంగా ఉంటుంది.

"ఆలోచన లేని రాజు ప్రజలను ఎలా పాలించగలడు?" అని సుగ్రీవుని నిలదీసి, తన మాటల్లో ప్రజాక్షేమం, సామాజిక స్ఫూర్తియే గాని, రాజు పట్ల అవిధేయత లేదని నిరూపించాడు.

హనుమంతుని మాటలను ఆలకించి సుగ్రీవుడు ఇలా పలికాడు. "హనుమంతా! బాగుంది నీవు చెప్పిందంతా! దీర్ఘబాహువులు, ధనుర్బాణాలతో దేవతలవలె గోచరిస్తున్న వీరిని చూచి భయం కలగకుండా ఉండగలదా?

"వీరిని వాలియే పంపి ఉంటాడని నా అనుమానం. వాలికి అనేకమంది రాజులతో స్నేహం ఉంది. శత్రువు లున్నవారు నిర్భయంగా ఉండకూడదు. మన నిర్భయత్వాన్ని ఆధారంగా చేసికొని శత్రువులు మనల్ని వెన్నుపోటు పొడుస్తారు. అందులోను వాలిని తక్కువగా అంచనా వేయకూడదు.

"హనుమంతా! నీవు మానవాకారమును ధరించి వారివద్దకు వెళ్ళు. వారిని కుశలప్రశ్నలు వేసి వారి మనసును గ్రహించు. ఎందుకు వచ్చారో తెలుసుకో. మాటలను బట్టి మంచివారో చెడ్డవారో గ్రహించు;" అన్నాడు. సుగ్రీవుని ఆజ్ఞానుసారము రామలక్ష్మణులను కలుసుకోవడానికి హనుమంతుడు బయలుదేరాడు.

సుగ్రీవుని వద్ద వున్న మంత్రులలో ఆంజనేయుడు ఒకడు. కానీ గూఢచారిగా విషయాన్ని సేకరించుటకు సుగ్రీవుడు ఆంజనేయునే నియమించాడు. రాయబారికి ఉండవలసిన లక్షణాలన్నీ హనుమంతునికి ఉన్నాయన్న విశ్వాసమే అలా ఎన్నుకోవడానికి ముఖ్యకారణంగా తెలుస్తోంది. గొప్ప సలహాదారుడుగా మాత్రమే కాక ఆదర్శమైన, విశ్వసింపదగిన ఉద్యోగిగా, మంత్రిగా కూడా తెలుస్తున్నాడు హనుమంతుడు.



సుగ్రీవుడు ధర్మాత్ముడు. ధర్మశాస్త్ర రీత్యా ప్రభుకార్యాన్ని నిర్వహించడానికి దూతకు ఉండవలసిన లక్షణాలన్నీ హనుమంతునిలో ఉండబట్టే ఆంజనేయుని దూతగా నియమించుకున్నాడు. మనుధర్మ శాస్త్రము దూతయొక్క లక్షణాల్ని ఈవిధంగా వర్ణించింది.

**దూతం చైవ ప్రకుర్వీత సర్వశాస్త్ర విశారదమ్**
**ఇంగితాకార చేష్టజ్ఞం శుచిం దక్షం కులోద్గతమ్**
**అనురక్త శ్శుచిః దక్షః స్మృతిమాన్ దేశకాలవిత్**
**వపుష్మాన్ వీతభీ ర్వాగ్మీ దూతో రాజ్ఞః ప్రశస్యతే.**

"దూత 1. సర్వశాస్త్ర విశారదుడై ఉండాలి. 2. ఇతరుల అభిప్రాయాలను గ్రహింపగలిగే వాడై ఉండాలి. 3. పరిశుభ్రత కలిగి ఉండాలి. 4. సమర్థుడై ఉండాలి. 5. పరిస్థితులను గమనించి ప్రవర్తించేవాడై ఉండాలి. 6. ఉత్సాహవంతుడై ఉండాలి. 7. నిర్మలుడై ఉండాలి. 8. విస్మృతి లేనివాడై ఉండాలి. 9. అవసరాన్ని బట్టి మారువేషము ధరించగలగాలి. 10. వాక్చతురుడై ఉండాలి.11. ప్రలోభాలకు లొంగనివాడై ఉండాలి". మనుధర్మశాస్త్రము తెలిపిన ఈ లక్షణాలన్నీ హనుమంతునిలో పుష్కలంగా ఉన్నాయి. అందుకే ఆయన రామదూతగా రాణించాడు.

## ప్రభు భృత్య సమాగమము

సుగ్రీవుడు చెప్పిన విషయాలను మనసులో అవధరించి రామలక్ష్మణులను సమీపించాడు ఆంజనేయుడు. రామలక్ష్మణులు కొత్తవారు. వెంటనే విశ్వసనీయులు కారు. పరీక్షార్హులు - అని భావించి, తన వానరరూపమును విడిచి, సన్యాసి రూపమును ధరించి, రామలక్ష్మణులను సమీపించాడు హనుమంతుడు.

సన్యాసి రూపంలో ఉన్న హనుమంతుడు రామలక్ష్మణులకు నమస్కరించాడు. మృదువచనాలతో, మనోహరంగా మాట్లాడాడు.

"అయ్యా! మీరెవరు? రాజర్షులు లాగా, దేవతలు లాగా కనిపిస్తున్నారు. వ్రత నియమాలు పాటించు మహర్షుల్లాగా ఉన్నారు. గొప్ప దేహకాంతితో మెరిసిపోతున్నారు. మీరెవరు?

"ఈ అడవిలో మృగాలు, ప్రాణులు మిమ్మల్ని చూసి భయపడి పోతున్నాయి. మీరు ఈ పంపాతీర పరిసర శోభను చూస్తున్నట్లున్నారు. నారచీరలు ధరించి మునుల్లాగా శోభిస్తున్నారు. ధనుర్బాణాలు ధరించి రాజుల్లాగా వెలిగిపోతున్నారు. మీరెవరు?

"మీరు గొప్ప వీరుల్లాగా కనిపిస్తున్నారు. గొప్ప పరాక్రమములు గల వారిలా కన్పట్టే మీ చూపులు సింహపు చూపుల్లా ఉన్నాయి. మీ భుజాలు ఏనుగు తొండాల్లా ఉన్నాయి. మీ ధనుస్సులు ఇంద్రధనుస్సుల వలె శోభిస్తున్నాయి. మీరెవరు? ఇక్కడికి ఎందుకొచ్చారు?

"మీరు అసమాన సౌందర్యవంతులు. ఒకరికొకరు తీసిపోని అందగాళ్ళు. భువి కేతెంచిన శశి సూర్యులవలె భాసిస్తున్నారు. మానవరూపంలో గోచరించే దేవతలా? అన్నట్లున్నారు. ఎవరు మీరు?

"నేను ఇంత మాట్లాడినా మీరు నోరు విప్పరేమి? ఒక్క మాట కూడా మాట్లాడ రెందుకని?

"సుగ్రీవుడనే వానరశ్రేష్ఠుడు ఈ పర్వతంపై ఉన్నాడు. ఆయన గొప్ప వీరుడు. ధర్మాత్ముడు. అతని అన్న వాలి. తమ్ముని అవమానపరచి రాజ్యము నుండి తరిమివేసినాడు.

"నా పేరు హనుమంతుడు. నేను వానరుణ్ణి. మహాత్ముడు అయిన సుగ్రీవుని దూతగా వచ్చాను. రాజు కోర్కెను తీర్చుటకు నేను ఇలా సన్యాసి రూపంలో వచ్చాను. నేను కోరిన రూపమును ధరించగలను.

"నేను సుగ్రీవుని మంత్రులలో ఒకణ్ణి. వాయుపుత్రుణ్ణి. మా రాజైన సుగ్రీవుడు మీ సఖ్యాన్ని వాంఛిస్తున్నాడు;" అని పలికాడు హనుమంతుడు.

రామలక్ష్మణులు ఎవరో తెలుసుకోవాలని సుగ్రీవుని ఆజ్ఞ మేరకు సన్యాసి వేషాన్ని ధరించి వచ్చాడు హనుమంతుడు. రామలక్ష్మణులను చూచి, వారితో మాట్లాడుతూ తాను ప్రచ్ఛన్న వేషంలో వచ్చినట్లు కూడా చెప్పేశాడు. వారెవరో తెలుసుకోకుండానే సుగ్రీవుని ఉనికి, వివరాలను విపులీకరించాడు. ఇదొక విచిత్ర సన్నివేశం.

సత్యం ముందు రహస్యాలు నిలవవు. దాగవు. సత్యమూర్తి యైన రాముని చూడగానే ఆంజనేయుడు ఉన్నదున్నట్లు దాచుకోకుండా చెప్పేశాడు.

అసలు ఎందుకు దాచిపెట్టాలి? నూతన వ్యక్తిని శంకించే సమయాల్లోనే దాపరికాలు ఉంటాయి. రామలక్ష్మణులను సమీపించగనే వారి దివ్యత్వము హనుమంతునికి ప్రస్ఫుట మైంది. సంశయాలు విచ్ఛిన్నమైనాయి. అందుకని నిజం చెప్పేశాడు.

హనుమంతుని మాటలు రామునికి ఎంతో సంతోషాన్ని కల్గించాయి. ఆనందముతో రాముని ముఖం వికసించింది. రాముడు లక్ష్మణునితో ఇలా పలికాడు.

"లక్ష్మణా! మనం సుగ్రీవుని అన్వేషిస్తూ వచ్చాము. సుగ్రీవుని మంత్రి యైన ఇతడు మన వద్దకు వచ్చాడు. నాకు చాలా ఆశ్చర్యంగానూ, సంతోషంగానూ ఉంది.

"తమ్ముడూ! ఇతడు వాక్యజ్ఞుడు. మధురంగా మాట్లాడుతున్నాడు. ఇతను మాట్లాడిన తీరును బట్టి గొప్ప పండితుడుగా తెలుస్తున్నాడు. వ్యాకరణము బాగా చదివినవాడు అనిపిస్తోంది. అందుచేతనే మాటల్లో ఎక్కడా అపశబ్దం లేదు. ఉచ్చారణా దోషము లేదు.

"అతని మాటలు సంశయాలకు అవకాశం లేకుండా ఉన్నాయి. అనవసర విషయ విస్తారణ లేదు. మాటలను నోట్లో నానబెట్టడం లేదు. వినే వారికి బేజారెత్తడం లేదు. కంఠధ్వని మధురంగా ఉంది. వినే వారికి మాత్రమే వినపడేలా మాట్లాడుతున్నాడు. మాటలు హెచ్చుతగ్గులు లేకుండా క్రమాంతరాలలో సాగుతున్నాయి. నీవు ఇతనితో మాట్లాడు.

"లక్ష్మణా! శుభకరము, మనోహరము అయిన ఇతని పలుకులు ఎవరికైనా సంతోషాన్ని కల్పిస్తాయి. కత్తి ఎత్తిన శత్రువు కూడా ఇతని మాటలకు మెత్తబడి పోతాడు. ఇలాంటి దూతలు ప్రభువుకు ఏ కార్యాన్నైనా సాధిస్తారు;" అన్నాడు రాముడు.

భవిష్యత్తులో రామదూతగా అమోఘమైన కార్యాలను సాధించి, శాశ్వతమైన వైభవంతో చిరంజీవిగా వెలిగిపోయే హనుమంతునిలో గోచరించే దూత యొక్క విశిష్ట లక్షణాలను



రాముడు ప్రథమ సమాగమము లోనే పసిగట్టాడు. రాముని మాటలు వినిన లక్ష్మణుడు హనుమంతునితో మాట్లాడాడు.

లక్ష్మణుని మాట్లాడమని రాముడు ఎందుకు చెప్పాడు? తానే ఎందుకు మాట్లాడలేదు? సాధారణంగా రాజులు స్థాయిని బట్టి మాట్లాడుతూ ఉండేవారు ఆరోజుల్లో. ఈరోజుల్లో కూడా అంతే.

వచ్చినవాడు దూత కనుక రాముడు మాట్లాడకుండా లక్ష్మణుని మాట్లాడించాడు అని చాలామంది వ్యాఖ్యానిస్తుంటారు. ఇది రాజధర్మమును దృష్టిలో ఉంచుకొని చేసిన ఊహ.

ఆధ్యాత్మికంగా చూసినపుడు ప్రచ్ఛన్నరూపులతో, ద్వంద్వ ప్రవృత్తులు కలవారితో భగవంతుడు భాషించడు. హనుమంతుడు ఇంకా మారువేషంలోనే ఉన్నాడు. స్వభావాన్ని, స్వరూపాన్ని మరుగుచేసుకొని మెలిగే వారితో భగవంతుడు భాషించడు.

రాముడు ఆంజనేయునితో భాషించక లక్ష్మణుని మాట్లాడమని చెప్పిన ఈ సన్నివేశాన్ని దృష్టిలో పెట్టుకొని అత్యంత రమణీయమైన కీర్తనను రచించారు త్యాగరాజస్వామి

**ఆడమోడి గలదే రామయ్య మాట ॥లాడ॥**
**తోడు నీడ నీవే యనుచు భక్తితో**
**గూడి పాదముల, బట్టిన మాట ॥లాడ॥**
**చదువులన్ని దెలిసి శంకరాంశుడై**
**సదయు డాశుగ సంభవుండు మ్రొక్క**
**కదలు తమ్ముని బల్కఁ జేసితివి**
**గాకను త్యాగరాజేపాటి మాట ॥లాడ॥**

"రామా! భక్తులతో మాట్లాడుటకు నీకు బింక మెందుకు? సర్వమూ నీవే యని భావించి, భక్తితో నీ చరణములను గొలిచే భక్తులతో మాట్లాడుటకు నీకు బింకమేల రామా!

"ఆంజనేయుడు విద్యావంతుడు. ఈశ్వరాంశుడు. అలాంటి భక్తునితో నీవు మాట్లాడకుండా నీ తమ్ముడైన లక్ష్మణుని మాట్లాడమని చెప్పినావు. భక్తులతో భాషించుటకు అంత మోడి ఏల రామా!" అంటూ త్యాగరాజస్వామి రామునిపై అతిశయించిన ప్రేమాభియోగాన్ని మోపాడు.

ఈ కీర్తనను "చారుకేశి" రాగంలో రచించారు త్యాగరాజస్వామి. సంగీత సాహిత్య మేళాను నిర్వహించి శ్రోతలకు తన్మయత్వం కలిగించుటకే ముఖ్యంగా ఈ కీర్తనను 'చారుకేశి' రాగంలో రచించారు.

'చారుకేశి' రాగము మిశ్రమరాగము. ఇది తోడి-శంకరాభరణ రాగముల సమ్మేళనము. తోడిరాగము ఉత్తరదేశమున ప్రశస్తమైనది. శంకరాభరణము దక్షిణదేశములోని రాగము. ఈ రెండిటి కలయికే చారుకేశి.

రాముడు ఉత్తరదేశము వాడు. ఆంజనేయుడు దక్షిణదేశమునకు సంబంధించిన వాడు. రామాంజనేయుల కలయికను వర్ణించే కీర్తన కనుక ఉత్తర దక్షిణ దేశ రాగముల సమ్మేళనమైన 'చారుకేశి'లో రచించారు త్యాగరాజస్వామి. అంతేకాదు; మరొక అద్భుత ప్రయోగం కూడా

సాహిత్యపరంగా చేశారు. 'చారుకేశి' రాగంలో మిళితమై ఉన్న 'తోడి', 'శంకరాభరణము'ల పేర్లను కీర్తనలో పదములుగ చొప్పించడం గొప్ప విశేషము.

"తోడునీడ నీవె"- అనేది రాముని పరంగా చెప్పినది. కనుక ఉత్తరదేశమునకు సంబంధించిన 'తోడి' ని సూచిస్తూ 'తోడు' అన్నాడు.

"శంకరాంశుడై"-అనేది హనుమంతుని పరంగా చెప్పినది. కనుక దక్షిణదేశమునకు సంబంధించిన 'శంకరాభరణము'ను సూచిస్తూ "శంకరాంశుడై" అని కీర్తించాడు. ఇది త్యాగరాజస్వామి కల్పనా మేధాశక్తికి తార్కాణము.

"పండితోత్తమా! మహాత్ముడైన సుగ్రీవుని గూర్చి మేము వినియున్నాము. సుగ్రీవుని వెతుక్కుంటూ వచ్చాము. నీవు చెప్పినట్లే చేస్తాము" అన్నాడు లక్ష్మణుడు.

లక్ష్మణుని మాటలు హనుమంతునికి సంతోషాన్ని కల్పించాయి. సుగ్రీవునితో పని ఉండే రాముడు వచ్చాడని ఆంజనేయుడు గ్రహించాడు. సుగ్రీవునికి కూడా కార్యసిద్ధి లభిస్తుందని ఆనందించాడు.

"అయ్యా! పంపాతీరము లోని ఈ అరణ్యం చాలా భయంకరమైంది. ప్రవేశించుటకు వీలు కానిది. మృగాలతో, పర్వాలతో నిండియున్న ఈ ప్రాంతానికి మీరెందుకు వచ్చారు?" అని ప్రశ్నించాడు హనుమంతుడు.

రాముని ప్రోత్సాహముతో లక్ష్మణుడు ఇలా పలికాడు; "హనుమంతుడా! దశరథుడు అనే రాజు అయోధ్యను పాలిస్తుండేవాడు. ఆయన ధర్మాత్ముడు. తేజోవంతుడు. అజాత శత్రువు.

"ఇతను దశరథుని పెద్ద కుమారుడు. పేరు రాముడు. అభయప్రదాత. పితృ వాక్పరిపాలకుడు. సుగుణవంతుడు.

"దశరథుని నలుగురు పుత్రులలో ఇతడు అధికగుణ సంపన్నుడు. రాజలక్షణ శోభితుడు. కానీ తండ్రి ఆజ్ఞను పాటించి రాజ్యభ్రష్టుడై అరణ్యాలకి వచ్చాడు. నేను అతని తమ్ముణ్ణి. నన్ను లక్ష్మణుడు అంటారు. అన్నను అనుసరించి అరణ్యాలకి వచ్చాను. రాముని గుణాలచే ఆకర్షింపబడ్డవాణ్ణి," అన్నాడు.

లక్ష్మణుడు వివేకమునకు సంకేతము. హనుమంతుడు భక్తికి సంకేతము. రాముడు పరమాత్మకు సంకేతము. వివేకము ద్వారానే భక్తుడు భగవంతుని స్వరూపాన్ని తెలుసుకోగలుగుతాడు. వివేకము లేని భక్తి గ్రుడ్డిదై ఉంటుంది. వివేకం తోడైనపుడు భక్తి జ్ఞానంగా పరిణమిస్తుంది. పరమాత్మకు సంబంధించిన జ్ఞానము రానిదే భక్తికి పూర్ణత్వము సిద్ధించదు.

**తస్యాః జ్ఞానమేవ సాధన మిత్యేకే**

"పూర్ణభక్తికి జ్ఞానమే ఏకైక సాధనమై ఉన్నది", అని నారదమహర్షి భక్తిసూత్రాలలో తెలియచేస్తారు.

"హనుమంతా! రాముడు జితేంద్రియుడు. నియమవంతుడు. ఇతని భార్య సీత. సాయంత్రము అస్తమించే సూర్యునితో పాటు కాంతి కూడా పోవునట్లు సీత కూడా రాముని అనుసరించి అడవులకు వచ్చింది.



"మేము ముగ్గురము దండకారణ్యంలో వసిస్తూ ఉండినాము. కామరూపి యైన రాక్షసుడు రాముని అర్ధాంగి సీతను అపహరించాడు. ఆ రాక్షసు డెక్కడుంటాడో తెలియడం లేదు.

"శాపవశాత్తు రాక్షసుడైన కబంధు డనేవాడు సుగ్రీవుని గూర్చి మాకు చెప్పాడు. అతని శక్తిసామర్థ్యములను గూర్చి వివరించాడు. సీతను అపహరించిన వానిని గూర్చి తెలుసుకో గలడని చెప్పి, దివ్యదేహమును ధరించి స్వర్గానికి వెళ్ళాడు. హనుమంతా! ఇదే జరిగిందంతా.

**అహం చైవ చ రామశ్చ సుగ్రీవం శరణం గతౌ ।**

"నేను, రాముడు కూడా సుగ్రీవుణ్ణి శరణు కోరుతున్నాము" అని పలుకుచూ లక్ష్మణుడు కన్నీళ్ళు కార్చాడు.

"మీరు బుద్ధిమంతులు. జితక్రోధులు. జితేంద్రియులు. అదృష్టవంతులే మిమ్మల్ని దర్శించగలరు. మీ దర్శనము సుగ్రీవునకు చాలా అవసరమై ఉంది.

"సుగ్రీవుని అన్న యైన వాలి సుగ్రీవుని భార్యను అపహరించాడు. సుగ్రీవుని అవమానించాడు. రాజ్యభ్రష్టుణ్ణి చేశాడు. సుగ్రీవుడు దుర్భరమైన భయంతో జీవితాన్ని సాగిస్తున్నాడు.

"సుగ్రీవుడు సూర్యుని కుమారుడు. సీతను అన్వేషించుటలో మీకు సహాయము చేయగలడు. మరి సుగ్రీవుని వద్దకు వెళ్దామా?" అన్నాడు ఆంజనేయుడు.

తమతో సుగ్రీవునికి కూడా పని ఉందని గ్రహించిన లక్ష్మణుడు తమ పని కూడా సఫలం కావచ్చుని భావించాడు. సుగ్రీవుని చూచుటకు రామలక్ష్మణులు సిద్ధపడ్డారు.

హనుమంతుడు సన్యాసి రూపాన్ని త్యజించాడు. వానరరూపాన్ని గ్రహించాడు. రామలక్ష్మణులను తన భుజాలపై ఎక్కించుకొని సుగ్రీవుని వద్దకు చేరాడు. హనుమంతుడు సన్యాసి రూపాన్ని త్యజించక పోయి ఉన్నట్లయితే రాముడు హనుమంతుని భుజాలపై ఎక్కి ఉండేవాడు కాడు.

మన బరువుల్ని, బాధ్యతల్ని భగవంతుని భుజాల మీదికి, తలమీదికి ఎత్తేవాడు కాకుండా, తన భుజాలపై పరమాత్మను ఎక్కించుకొనేవాడే నిజభక్తుడు. భక్తుని మనసు సదా



భగవంతుని మోసేదై ఉండాలి. రామ లక్ష్మణుల్ని భుజాలపై ఎక్కించుకొని పయనిస్తూ హనుమంతుడు దివ్యానందాన్ని పొందినట్లు తులసీ రామాయణ వ్యాఖ్యాత లలో ఒకరంటారు.

"రామా! నీవు నా హృదయంలో ఉన్నావు. ఇప్పుడు వీపుమీద కూడా ఉన్నావు. కౌసల్యాదశరథులు నిన్ను ఒడిలో కూర్చో బెట్టుకున్నారు. వారెంతో భాగ్యవంతులని

పూర్వము భావించాను. ఇప్పుడు ఆ భాగ్యము నన్ను కూడా వరించినందుకు నాకెంతో సంతోషంగా ఉంది.

"రామభద్రా! నిన్ను ఒడిలో ఉంచుకొనిన కౌసల్య దశరథాదులు నీవు క్రింద పడకుండా జాగ్రత్త వహించి ఉంటారు. అనుక్షణము జాగరూకులై ఉండుంటారు.

"కానీ నాకాభయం లేదు. నీవు నా వీపుమీద ఉన్నావు. కనుక నేను కూడా పడకుండా నీవే జాగర్తతో ఉంటావు. నేను నిన్ను మోస్తున్నాను. నేను పడితే నా మీదున్న నీవు కూడా పడతావు కదా!" అని, భగవంతుని మోసే మనసులు పతనం కావని, పరమాత్మను నమ్మిన బ్రతుకులు వమ్ము కావని తెలుపుతాడు.

## రామ సుగ్రీవ మైత్రి

హనుమంతుడు సుగ్రీవుని సమీపించాడు. "సుగ్రీవా! సత్యపరాక్రముడైన రాముడు తమ్ముడైన లక్ష్మణునితో కలిసి వచ్చినాడు. ఇతడే రాముడు. ఇక్ష్వాకు వంశీయుడైన దశరథుని కుమారుడు. ధర్మాత్ముడు. పితృవాక్పరిపాలకుడు.

"సుగ్రీవా! దశరథుడు సామాన్యుడు కాడు. అనేక అశ్వమేధయాగాలు చేశాడు. వేలాది గోవులను దానం చేశాడు. గొప్ప తపశ్శాలి. సత్యవాది. ఒక స్త్రీ కారణంగా (కైకేయి) రాముడు వనాలకు వచ్చాడు.

"నియమవంతుడు, మహాత్ముడు అయిన రాముని భార్యను అరణ్యంలో రావణుడు హరించాడు. సుగ్రీవా! రాముడు నిన్ను శరణు జొచ్చాడు. పూజార్హులైన రామలక్ష్మణులు నీ స్నేహాన్ని వాంఛిస్తున్నారు. స్వీకరించు;" అన్నాడు హనుమంతుడు.

రామసుగ్రీవుల మైత్రికి హనుమంతుడు ప్రయత్నించినట్లు, పరమాత్మ జీవాత్మల సమాగమానికి సద్గురువు ప్రయత్నిస్తాడు. ఈ సందర్భమున వాల్మీకి చక్కని శ్లోకాన్ని అందించాడు.

**శ్రుత్వా హనుమతో వాక్యం సుగ్రీవో వానరాధిపః**
**దర్శనీయ తమో భూత్వా ప్రీత్యోవాచ చ రాఘవమ్**

వానరరాజైన సుగ్రీవుడు హనుమంతుని మాటలను ఆలకించి **(శ్రుత్వా)** చూచుటకు చాలా ప్రసన్నుడై **(దర్శనీయతమః)** రామునితో ఇలా భాషించాడు.

మొదట గురుదేవుని నుండి శాస్త్రాన్ని ఆలకించాలి. అట్టి శాస్త్రములు శ్రుతులనే వేదాలే. పరమాత్మను గూర్చి గురువు వివరించిన విషయాన్ని శ్రవణం చేయగానే శిష్యుడు ప్రసన్నుడై పరమాత్మను దర్శిస్తాడు. పరమాత్మ సంబంధాన్ని పొందుతాడు.

"రామా! నీవు ధర్మ వినీతుడవు. గొప్ప తపశ్శాలివి. సర్వవత్సలుడవు. వాయుపుత్రుని ద్వారా నీ సుగుణాలను ఆలకించాను. నేను వానరుణ్ణి. నీవు నా స్నేహాన్ని వాంఛించడము నాకు గొప్ప సత్కారము. లాభము.



"రామా! నా స్నేహము నీకు అంగీకారమేనా! అయితే, ఇదిగో. చేయి చాపాను. నీ చేత్తో నా చేతిని పట్టుకో" అని పలికాడు సుగ్రీవుడు.

రాముడు సంతోషించాడు. సుగ్రీవుని చేతిని తన చేత్తో పట్టుకున్నాడు. సుగ్రీవుని గాఢంగా కౌగిలించుకున్నాడు. రామసుగ్రీవులు ఏకమయ్యారు.

రామసుగ్రీవులు అగ్నికి ప్రదక్షిణం చేశారు. స్నేహితులయ్యారు. ఎంతగానో ఆనందించారు.

**అన్యోన్య మభి వీక్షన్తౌ న తృప్తి మభి జగ్మతుః**

"రామసుగ్రీవులు ఒకరినొకరు ఎంతగానో చూచుకుంటున్నా, వారు తృప్తి చెందడం లేదు" అంటాడు వాల్మీకి.

స్నేహము తనివి తీరనిదై ఉండాలి. ఒకరినొకరు తృప్తి చెందకుండా చూసుకొనేదే స్నేహము. ఈనాడు స్నేహానికి కూడా కాలదోషం పట్టింది. పనిబడితేనే ఈనాడు మిత్రుణ్ణి చూస్తున్నారు.

రాముని స్నేహాన్ని వాంఛించి సుగ్రీవుడు చేయి చాపాడు. రాముడు ఆ చేయిని పట్టుకున్నాడు. ఇద్దరి చేతులూ ఒకటయ్యాయి. ఈనాటి నుండి చేతులు కలిసినట్లే వారి చేతలు కూడా కలిసే ఉంటాయని అర్థము. చేతములు కూడా కలిసే ఉంటాయని భావము.

మనసులు కలవని స్నేహాలు ప్రాణరహితమైన దేహాల వంటివి. హృదయాలు ఏకమైనపుడే స్నేహానికి పరమార్థం లభిస్తుంది.

అగ్ని పవిత్రమైనది. స్నేహము అగ్ని లాగా పవిత్రమైనది అని భావించి పూర్వము అగ్నిసాక్షిగా స్నేహం కట్టుకునేవారు. అగ్ని ఉన్నంత వరకు దేహము నశించదు. పవిత్రులతో ఏర్పరచుకొనే సఖ్యము నశించదు.

**'సన్ధిః సద్భిర్న జీర్యతే'** సజ్జనులతో సఖ్యము ఎన్నటికీ చెడేది కాదు అని మహాభారతము భాషించింది.

రామాయణము పవిత్రమైనది. పాపఘ్నమైనది. అందుచేత యజ్ఞరూపమైన రామాయణము అగ్నిస్వరూపమే. రామాయణంలో అగ్ని ప్రధానంగా తెలుస్తూ ఉంది.

అగ్నిహోత్రుని ప్రసాదఫలంగా రాముడు ఆవిర్భవించాడు. అగ్నిసాక్షిగా సీతారాముల వివాహం జరిగింది. శబరి, శరభంగులు అగ్నిలో ప్రవేశించి ముక్తులయ్యారు. అగ్నిసాక్షిగా రామ సుగ్రీవుల సఖ్యం ఏర్పడింది. హనుమంతుడు లంకనంతా అగ్నితో దహించివేశాడు.చివరగా సీతమ్మ అగ్నిప్రవేశం చేసి రాముని సమీపించింది. రామాయణమంతా అగ్నిమయం. జ్ఞానాగ్ని మయం. యోగాగ్నిమయం. విరహాగ్నిమయం. అంతా అగ్నే. పవిత్రాగ్నే.

కట్టెలు లేనిదే అగ్ని పుట్టదు. అగ్ని లేనిదే కట్టెలు మండవు. పుట్టిన అగ్ని ప్రజ్వరిల్లాలంటే వాయువు అవసరము. కానీ వాయువు లాభాన్ని ఆశించదు.

కట్టెల వల్ల అగ్ని పుడుతుంది. అగ్ని వల్ల కట్టెలు మండుతాయి. ఇవి పరస్పరము లాభమును పొందుతున్నాయి. అగ్నిని ప్రజ్వలించే వాయువు ఏ లాభాన్నీ ఆశించదు.

సుగ్రీవునితో స్నేహం చేయడం రామునికి లాభదాయకము. రాముని స్నేహం సుగ్రీవునికి లాభదాయకము. వీరిద్దరికి స్నేహాన్ని కూర్చిన వాయుపుత్రుడైన హనుమంతునికి ఇక్కడ ఏవిధమైన స్వప్రయోజనమూ లేదు.

అగ్ని విషయంలో వాయువు ఫలితాన్ని ఆశించనట్లు, రామసుగ్రీవుల మైత్రిలో నిస్వార్థపరుడు వాయుపుత్రుడే.

స్వార్థ మెరుగని స్నేహపాత్రులే స్నేహాన్ని వృద్ధి పొందిస్తారు. రామసుగ్రీవుల మధ్య అగ్నిని ఉంచి వారి సఖ్యాన్ని వాయుపుత్రుడైన ఆంజనేయుడు వృద్ధి చేశాడు.

ఆంజనేయుని ద్వారానే రాముని మైత్రి లభిస్తుంది. గురుదేవుని ద్వారానే బ్రహ్మ సంబంధం ఏర్పడుతుంది.

**రామ దుఆరే తుమ రఖవారే**
**హోతన ఆజ్ఞా బిను పైఠారే**
**సబ్ సుఖ లహై తుమ్హారీ శరనా**
**తుమ రక్షక కాహూకో డరనా।**

"హనుమంతా! రామద్వారము వద్ద నీవు సదా కాపలా ఉంటావు. నీ అనుమతి లేకుండా రామసదనానికి ప్రవేశము ఉండదు.

"నిన్ను శరణుజొచ్చిన వారికి సర్వసుఖాలూ ప్రాప్తిస్తాయి. నీ రక్షణలో భయానికి తావు లేదు" అని హనుమాన్ చాలీసా.

సుగ్రీవుడు ధన్యాత్ముడు. హనుమంతుని సఖ్యాన్ని పొందాడు. ఆ మహాత్ముని ద్వారా రామునికి మిత్రుడయ్యాడు. జీవబ్రహ్మల సమాగమమే సుగ్రీవ రాముల మైత్రి.

"రామా! నీవు నా మిత్రుడవు ఇకనుంచి. మన ఇరువురి సుఖదుఃఖాలు ఇకమీదట ఒకటే;" అన్నాడు సుగ్రీవుడు. అంతటితో ఆగలేదు. మద్దిచెట్టును సమీపించాడు. ఆకులతో, పూలతో నిండియున్న కొమ్మను విరిచాడు. దానిని నేలపై పరచాడు. రామునితో కలిసి దానిపై కూర్చున్నాడు.

సునిశితమైన సుగ్రీవుని బుద్ధి ఇక్కడ సుస్పష్ట మవుతూ ఉంది. తనకూ, రామునకు ఆసనంగా ఒకే కొమ్మ పరచాడు. స్నేహంలో ఇది సమదృష్టి. భేదరహిత దృష్టి. సమానత్వాన్ని ఆవిష్కరించే దృష్టి.

తాము పరచిన మద్దికొమ్మ పచ్చని ఆకులతో, పూలతో నిండి ఉంది. తమ స్నేహము సదా పచ్చగా ఉండాలని, వాడిపోకూడదని సుగ్రీవుడు భావిస్తున్నాడు.

అది చూచి హనుమంతుడు సంతోషించాడు. పూవులతో నిండిన చందనపు చెట్టు కొమ్మను విరిచి లక్ష్మణున కిచ్చాడు. మంచిగంధపు కొమ్మ లాగా స్నేహ పరిమళము నిత్య నూతనంగా ఉండాలని హనుమంతుడూ భావించాడు.

ఆపద్బాంధవులు మిత్రులే కదూ! కనుకనే మిత్రులు కలిసినపుడు ఒకరి కష్టాలు మరొకరితో చెప్పుకుంటూ ఉంటారు. ఊరట పొందుతూ ఉంటారు. ప్రయోజనాన్ని అందుకుంటూ ఉంటారు.



**Friendship improves happiness and abates misery, by doubling our joy and dividing our grief.**

"ఆనందాన్ని ద్విగుణీకృతం చేసి సుఖాన్ని వృద్ధి చేసేది, దుఃఖాన్ని వేరు చేసి కడగండ్లను కరిగించేది స్నేహమే" అంటాడు ఎడిసన్.

అగ్నిసాక్షిగా మిత్రుడైన రామునితో తన బాధల్ని చెప్పుకోవడానికి సుగ్రీవుడు ప్రారంభించాడు.

"రామా! నీ స్నేహము నాకెంతో ఆనందాన్ని ప్రసాదించింది. రామా! నాకు అన్నొకడున్నాడు. పేరు వాలి. అతడు నన్ను అవమానించాడు. మోసం చేశాడు. నా భార్యను అపహరించాడు. *

"వాలికి భయపడి నేను ఈ వనంలో తిరుగుతున్నాను. రామా! నాకు అభయాన్ని ప్రసాదించు. వాలి వల్ల నాకు ప్రమాదం రాకుండా చూడు" అన్నాడు సుగ్రీవుడు. సుగ్రీవుని మాటలు ఆలకించి రాముడు ఇలా మాట్లాడాడు.

**ఉపకారం ఫలం మిత్రం విదితం మే మహాకపే**
**వాలినం తం వధిష్యామి తవ భార్యాపహారిణమ్**

"సుగ్రీవా! స్నేహానికి ఫలం ఉపకారమే. ఈ విషయం నాకు తెలుసు. నీ భార్యను హరించిన వాలి ప్రాణాల్ని నేను హరిస్తాను.

"భయంకరమైన నా బాణాలు త్వరలోనే వాలి మీద వాలుతాయి. పర్వతం లాగా వాలి కూలిపోతాడు. నీవు చూస్తావులే;" అన్నాడు రాముడు.

"రామా! నాకు అదే కావాలి. నీ అనుగ్రహం వల్ల నేను రాజ్యాన్ని, నా రాణిని పొందుతాను. వాలి వల్ల ఇక ఎన్నడూ నాకు భయం వాటిల్లకుండా చెయ్యి. చాలు;" అన్నాడు సుగ్రీవుడు.

ఈ సందర్భమున ఒక విషయమును మనం మరువకూడదు. దృఢంగా జ్ఞాపకం పెట్టుకోవాలి. అప్పుడే వాలి వధను అర్థం చేసుకోగలము.

వాలి వల్ల తనకు ప్రమాదం రాకుండా చూడమని సుగ్రీవుడు రాముని అర్థించాడే గాని వాలిని చంపమని చెప్పాడా? సుగ్రీవుడు అడగకముందే వాలిని చంపుతానని రాముడు అభయప్రదానం చేశాడు.

**'శరైః వినిహితం'** "బాణములచే చంపబడిన వాలిని నీవు చూస్తావు" అన్నాడు రాముడు. బాణములు అనే మాటను ప్రయోగించడం వలన వాలిని వెనుక నుండి చంపాలనే భావము రామునికి లేదని స్పష్టమవుతూ ఉంది. వెనుకనుండి అయితే ఒక్క బాణము చాలు.

---

*యుద్ధకాండలో విభీషణుడు కూడా రామునితో ఇలాగే చెబుతాడు.

**అనుజో రావణ స్యాహం తేన చాప్యవమానితః**

"నేను రావణుని తమ్ముణ్ణి. నా అన్నచే అవమానింప బడ్డవాణ్ణి."

కిష్కింధ, లంకా రాజ్యాల్లో తమ్ముళ్ళు అన్నల చేత అవమానింప బడ్డవారే. ఒక్క అయోధ్య లోనే సోదరుల మధ్య కలహం లేదు. జ్యేష్ఠభ్రాతయైన శ్రీరాముడు ధర్మమూర్తి కావడమే దీనికి కారణం.

బాణములు అనే బహువచనమును ప్రయోగింపవలసిన పనిలేదు. ఎదురెదురుగా నిలబడి పోరాడినపుడే బాణముల అవసరం. చెట్టు వెనుక నుండి చంపడానికి ఒక్క బాణం చాలు.

## సీతమ్మ ఆభరణాలు

"రామా! నీవు అరణ్యాలకు ఎందుకు వచ్చావో హనుమంతుడు చెప్పాడు. అంతేగాదు. మీ అన్నదమ్ము లిద్దరూ లేని సమయంలో నీ భార్య సీతను రాక్షసుడు అపహరించిన విషయం కూడా చెప్పాడు. జటాయువును వాడు చంపిన విషయం కూడా చెప్పాడు.

**భార్యా వియోగజం దుఃఖం న చిరాత్త్వం విమోక్ష్యసే**
**అహం తా మానయిష్యామి నష్టాం వేదశ్రుతీ మివ॥**

"రామా! భార్యావియోగం వల్ల నీకు కలిగిన దుఃఖం త్వరలోనే అంతరిస్తుంది. వేదాన్ని వెలికి తెచ్చినట్లు సీతమ్మను నేను తీసుకొని వస్తాను" అన్నాడు సుగ్రీవుడు.

సుగ్రీవుడు అడగకముందే వాలిని వధిస్తా నన్నాడు రాముడు. రాముడు అడగకముందే సీతమ్మను తెచ్చి అప్పగిస్తా నంటున్నాడు సుగ్రీవుడు. మాటలు అవసరం లేకుండా మనసును గుర్తించి వర్తించడమే నిజమిత్రులలో గోచరించు సౌజన్యము.

నష్టపోయిన వేదాన్ని తిరిగి పొందినట్లు సీతమ్మను తెచ్చి అప్పగిస్తా నంటున్నాడు సుగ్రీవుడు. వేదము నశించదు. నష్టపోయేది కాదు. కాలంలో మరుగవడమే గాని కాలగర్భంలో కలిసిపోవడం కాదు.

సీత కూడా వేదము వంటిదే. వేదవతియే. ప్రపంచానికి వేదము ఎలా దూరం కాదో, సీతమ్మ రామునికి దూరం కాదనే విషయం ఇక్కడ స్పష్టమవుతూ వుంది.

"రామా! పాతాళంలో వున్నా, ఆకాశంలో వున్నా, ఎక్కడైనా ఉండనీ. నేను గాలించి మరీ తీసుకొని వస్తాను నీ భార్యను. నా మాట నమ్ము. దుఃఖించడం మానేయి.

"రామా! ఇప్పుడు అనిపిస్తూ వుంది. ఆవిడ సీతే. సందేహం లేదు. ఒకనాడు రాక్షసుడైన రావణుడు ఆమెను చంకన ఎత్తుకొని పోతుండగా, ఆమె వాని ఒడిలో ఆడసర్పము వలె తిరిగిపోతూ "రామా! రామా! లక్ష్మణా! లక్ష్మణా!" అని ఏడ్చేస్తోంది.

"నాతోపాటు మరో నలుగురు వానరులు కూడా ఉన్నారు. మేము ఈ పర్వతముపై కూర్చుని ఉన్నాం. ఆమె మమ్మల్ని చూసింది. వెంటనే ఆభరణాలను మూటగట్టి మాకు దగ్గరగా పడేసింది.


"మేము అవి జాగర్త చేశాము. రామా! నువ్వు గుర్తు పడతావా! అవి తెచ్చేనా!" అన్నాడు సుగ్రీవుడు.

"సుగ్రీవా! మిత్రమా! ఇంకా ఆలస్య మెందుకు? తొందరగా తీసికొనిరా!" అన్నాడు రాముడు.

సుగ్రీవుడు గుహలో ప్రవేశించి ఉత్తరీయమును, ఆభరణాలను తీసుకుని వచ్చి "ఇవేవేమో చూడు" అని ఆ మూటను రాముని ముందుంచాడు.



వాటిని చూడగానే పొగమంచు కప్పిన చంద్రుని లాగా నేత్రాలు కన్నీళ్ళతో నిండిపోయాయి. "సీతా!" అని ఏడుస్తూ రాముడు నేలమీద పడిపోయాడు. అలంకారాలను మాటిమాటికి గుండెకు హత్తుకుంటూ కలుగులో ఉన్న పగపట్టిన పాము లాగా బుసకొట్టాడు. "లక్ష్మణా! ఇవిగో సీత ఆభరణాలు;" అంటూ విలపించాడు రాముడు.



"సుగ్రీవా! సీత నాకు ప్రాణంతో సమానము. చెప్పు. వాడు సీతను ఏవైపు తీసికొని పోతూవుంటే నీవు చూశావో నాకు చెప్పు. నన్ను ఇలా దుఃఖంపాలు చేసిన ఆ రాక్షసుడు ఎక్కడ ఉంటాడు?

"సీతను అపహరించుట ద్వారా ఆ రాక్షసుడు మృత్యుద్వారాన్ని సమీపించాడు. సుగ్రీవా! వాడి వివరాలు చెప్పు. వాణ్ణి ఇప్పుడే యముని ఇంటికి పంపుతాను;" అని రోదించాడు రాముడు.

రాముని దుఃఖాన్ని చూసి సుగ్రీవుడు విచలిత మనస్కుడయ్యాడు. కన్నీళ్ళు కార్చుతూ, చేతులు జోడించి నమస్కరిస్తూ ఇలా పలికాడు.

"రామా! పాపాత్ముడైన ఆ రాక్షసుని నివాసము గాని, సామర్థ్యం గాని, పరాక్రమం గాని, కులం గాని నాకు తెలియవు.

"రామా! నువ్వు దుఃఖించడం మానేయి. సీత కొరకు నేను అన్నివిధాల కృషి చేస్తాను. నామాట నమ్ము. నీకు ప్రతిజ్ఞ చేసి చెప్తున్నాను. దైన్యాన్ని విడిచిపెట్టు. ధైర్యాన్ని తెచ్చుకో. నీలాంటివారు దైన్యాన్ని పొందకూడదు.

"రామా! నీలాగా నేనూ భార్యావియోగంలో ఉన్నవాణ్ణే. అయినా ధైర్యంగా ఉన్నాను. నీలా దైన్యాన్ని పొందలేదు. నేను వానరుణ్ణి. అయినా దుఃఖించడం లేదు.

"నీవు మహాత్ముడవు. వినీతుడవు. ధైర్యవంతుడవు. నీవు ఇలా దుఃఖించడం మంచిది కాదు. మనోధైర్యము లేనివారివలె నీవు ప్రవర్తించకూడదు.

**వ్యసనే వార్థకృచ్ఛ్రే వా భయే వా జీవితాన్తగే**
**విమృశంశ్చ స్వయా బుద్ధ్యా ధృతిమా న్నావసీదతి॥**

"ఆపద లొచ్చినపుడు గాని, దారిద్ర్యం సంభవించినపుడు గాని, ప్రాణభయము వాటిల్లినపుడు గాని ధైర్యశాలి ఏది ఆచరించాలో ఆలోచిస్తాడు గాని దుఃఖిస్తూ కూర్చోడు.

"బుద్ధిమంతుడు దీనుడు కాకూడదు. భారము ఎక్కువైనపుడు నావ నీటిలో మునిగిపోవునట్లు దీనుడు శోకంలో మునిగిపోతాడు. రామా! నేను నిన్ను నమస్కరిస్తూ

ప్రార్థిస్తున్నాను. దుఃఖాన్ని తరిమేయి. పౌరుషంతో నిలబడు.

"రామా! నీవు నా స్నేహితుడివి. అందుచేత దాచుకోకుండా హితవు చెప్పాను. అంతేగాని నీకు నేను బోధచేయడం లేదు. నా స్నేహాన్ని గౌరవించి అయినా నీవు దుఃఖాన్ని మానేయాలి;" అంటూ ఓదార్చాడు సుగ్రీవుడు.

రావణుణ్ణి గూర్చి తనకేమీ తెలియదని సుగ్రీవుడు పలికిన మాట ఉత్తరకాండము ప్రక్షిప్తము అని వాదించే వారికి బలాన్నిచ్చేలా ఉంది. ఉత్తరకాండము ప్రక్షిప్తము కాదు. అది వాల్మీకిప్రోక్తమే అని విశ్వసించువారికి సుగ్రీవుడు అబద్ధము చెప్పినాడనే భావన ఏర్పడుతుంది.

వాలిసుగ్రీవులు కలిసి ఉండేటప్పుడు ఒక మాసం రోజులు రావణుడు వాలి ఇంట్లో ఉన్నట్లు ఉత్తరకాండములో చెప్పబడింది. అలాంటప్పుడు సుగ్రీవునికి రావణుడు తెలియకపోవడమేమిటి?

విశ్వంలో ఏది ఎక్కడున్నదో తెలుసుకొనే శక్తి సూర్యపుత్రుడైన సుగ్రీవునికి ఉందని కబంధుడు చెప్పిన మాటలకు అర్థ మేమిటి? కనుక సుగ్రీవుడు రామునితో అబద్ధం చెప్పినట్లు కొందరు భావిస్తూ వుంటారు.

సుగ్రీవుడు స్నేహపాత్రుడు. అబద్ధం చెప్పాల్సిన అవసరము కూడా లేదు సుగ్రీవునికి. రాముని శోక ఉద్వేగాన్ని చూచి సుగ్రీవుడు అలా చెప్పేశాడు. అంతే.

రావణుని జాడ తెలిస్తే ఇప్పుడే వెళ్ళి చంపాలి అన్నట్లు మాట్లాడుతున్నాడు రాముడు. ఆవేశంలో కార్యాలు సఫలం కావు. ఆలోచించి కార్యాన్ని సాధించాలని సుగ్రీవుడు ఆలోచించి ఉంటాడు.

ఎలాగైనా సీతమ్మను తీసికొని వచ్చి రామునికి అప్పగించాలని సుగ్రీవుడు దృఢ నిశ్చయంతో ఉన్నాడు. కనుకనే రామునికి శపథం చేసి మరీ చెప్పాడు.

అదియును గాక రాముని దుఃఖం సుగ్రీవుని కూడా బాగా కదిలించింది. సుగ్రీవుని శుభకర నేత్రాలనుండి అశ్రువులు రాలినట్లు వాల్మీకి చెప్పినాడు. రాముని దుఃఖాన్ని తక్షణం ఆపాలని భావించడం వల్ల రావణుని గూర్చి తనకు తెలియదని సుగ్రీవుడు చెప్పి ఉంటాడు.

అనవసరమైన దుఃఖాన్ని కొనసాగించడం ఇష్టంలేని రాముడు,దశరథుని మాటలు వినిపించలేదని సుమంత్రుని దశరథునితో చెప్పమని చెప్పడం ఎలా అబద్ధంకాదని మనం నిర్ణయించామో, రావణుడు తనకు తెలియదని సుగ్రీవుడు పలకడం కూడా అంతే నని నేను భావిస్తున్నాను.

సుగ్రీవుని మాటలు రామునికి ఎంతో ఓదార్పు నిచ్చాయి. ఓర్పును పెంచాయి. కర్తవ్యాన్ని ఆలోచించమని తీర్పు చెప్పాయి. రాముడు సుగ్రీవుని కౌగలించుకొని ఇలా పలికాడు.

"సుగ్రీవా! నీ మాటలు నా దైన్యాన్ని, దుఃఖాన్ని చాలావరకు తగ్గించాయి. మిత్రుడు చేయదగిన దంతా నువ్వు చేశావు. కానీ నీవు మాత్రం దుష్టుడు, పాపి అయిన రావణుని కనిపెట్టే ప్రయత్నం చెయ్యి.



"నీ విషయంలో నేనేమి చేయాలో చెప్పు. వర్షాకాలములో పొలంలో పెట్టిన పంట ఫలించునట్లు, నీ కార్యాన్ని నేను సఫలం చేస్తాను. నీవు నా మాటల్ని సందేహించకు.

"సుగ్రీవా! నాకు అసత్యము పట్టదు. గిట్టదు. పూర్వము నేనెన్నడూ అబద్ధము చెప్పలేదు. ఇకముందు చెప్పనుకూడా. సత్యముపై శపథం చేసి మరీ చెప్తున్నాను;" అన్నాడు రాముడు.

సుగ్రీవుడు, అతని మంత్రిమండలి రాముని మాటలను ఆలకించి సంతోషించారు. రామసుగ్రీవులు ఏకాంతంలో కూర్చుని సుఖదుఃఖాల్ని గూర్చి పరస్పరము మనసులు విప్పి మాట్లాడుకున్నారు.

## మిత్ర భాషణములు

"రామా! నీవు ఏ దోషమూ తెలియనివాడవు. సకల సుగుణ సంపూర్ణుడవు. నీవు నాకు మిత్రుడ వగుటవల్ల నాకు దేవతల ఆశీస్సు లున్నాయని భావిస్తున్నాను.

"నీవు సహాయం చేస్తే దేవలోకాన్ని పొందడం కూడా నాకు కష్టమేమీ కాదు. ఇక ఈ వానరరాజ్యం లభిస్తుందని ప్రత్యేకంగా చెప్పాలా? అగ్నిసాక్షిగా నీవు నాకు మిత్రుడ వగుట వలన నా బంధువులలో కూడా నాకు గౌరవం పెరుగుతుంది.

"రామా! ఈ ప్రపంచంలో ప్రేమలు స్థిరమైనవి కావు. నీలాంటి ధర్మాత్ముల ప్రేమలు ఎప్పుడూ అస్థిరములు కావు. సత్పురుషులు తమవి యైన వెండి, బంగారము, ఆభరణాలు, ఉత్తమమైన వస్త్రాలు తమ స్నేహితుల కందరికీ సంబంధించినవని భావిస్తుంటారు.

"మిత్రుడు ధనికుడు కావచ్చు లేదా దరిద్రుడే కావచ్చు. సుఖాల్లో ఉండొచ్చు లేదా దుఃఖాల్లో ఉండొచ్చు. దోషి గావచ్చు లేదా నిర్దోషి కావచ్చు. ఏది ఏమైనా, ఎలా ఉన్నా స్నేహితుడే కదా పరమగతి!

"రామా! స్నేహమంటే ఏమిటో తెలిసినవాళ్ళు స్నేహితుని కొరకు సుఖాన్ని గాని, దేశాన్ని గాని, ధనాన్ని గాని విడిచిపెట్టడానికి వెనుకాడరు" అన్నాడు సుగ్రీవుడు. "అవును. నీవు చెప్పింది ముమ్మాటికీ సత్యము" అన్నాడు రాముడు.

"రామా! నాకు స్నేహితుడవైన నీకు దాపరికం లేకుండా అంతా చెప్పేస్తున్నాను. నా హృదయం దుఃఖాగ్నితో నిండి ఉంది. అది నిలువెల్లా నన్ను దహించివేస్తోంది.

"బలశాలియైన వాలి నన్ను అవమానించాడు. ప్రాణంకన్నా మిన్నయైన నా భార్యను అపహరించాడు. నా మిత్రుల్నందరినీ కారాగృహంలో బంధించాడు. నన్ను చంపాలనే ప్రయత్నాన్ని విరమించలేదు.

"అనేకసార్లు నాపైకి వానరుల్ని ఉసికొల్పాడు. నేను వాళ్ళను చంపి బ్రతికి వున్నాను. రామా! ప్రథమదర్శనంలో నీవు కూడా వాలి ప్రేరణతో నన్ను చంపుటకు వచ్చావని భ్రమించాను.

**భయే సర్వే హి బిభ్యతి**

"భయహేతువు తెలిసేటప్పుడు ఎవరైనా భయపడక తప్పరుగదా!"

"ఈ హనుమదాదులు నన్ను కంటికి రెప్పలాగా కాపాడుతూ ఉన్నారు. వీరు నాకు తోడుగా ఉండడం వల్ల ఎన్ని కష్టాలు దగ్గరైనా ప్రాణాలు దూరం కావడం లేదు.

"రామా! ముక్తసరిగ ఇది నా కథ. నీకు పెంచి చెప్పాల్సిన అవసరం లేదు. వాలి నా అన్న కావచ్చు. కానీ అతడే నా శత్రువు. అతడు నశిస్తే చాలు. అతనితోపాటు నా దుఃఖం కూడా నశించిపోతుంది. రామా! నా దుఃఖము ఎలా పోతుందో చెప్పాను.

**దుఃఖితః సుఖితో వాపి సఖ్యుర్నిత్యం సఖా గతిః**

"దుఃఖాల్లో ఉన్నా, సుఖాల్లో ఉన్నా స్నేహితునికి గతి స్నేహితుడే కదూ?" అన్నాడు సుగ్రీవుడు.

"సుగ్రీవా! ఇంతకీ మీ అన్నదమ్ములకు వైరమెలా ఏర్పడింది? మీ కలహానికి కారణ మేమిటో చెప్పు. శత్రువు శక్తిని బేరీజువేసుకొని కార్యాన్ని సునాయాసంగా సాధిస్తాను. నీవు విశ్వాసంతో ఉండు. నీ శత్రువుని నేను వధిస్తాను" అన్నాడు రాముడు.

రాముని మాటలు విని సుగ్రీవుడు, నలుగురు వానరులు సంతోషించారు. తన కార్యము నెరవేరుతుందనే నమ్మకం సుగ్రీవునికి ఏర్పడింది. సుగ్రీవుని ముఖం విరబూసిన తామరపువ్వులా శోభించింది. కలహము ఎలా ఏర్పడిందో చెప్పుటకు ఉపక్రమించాడు సుగ్రీవుడు.

## వాలిసుగ్రీవుల కలహ కారణము

"రామా! వాలి నాకు అన్న. అతడు గొప్ప పరాక్రమవంతుడు. వీరుడు. మా తండ్రికి వాలి అంటే చాలా ప్రేమ. నాకూ ప్రేమే. మా తండ్రి గతించిన తరువాత జ్యేష్ఠపుత్రుడైన వాలి రాజయ్యాడు. నేను వాలిని సేవిస్తూ జీవిస్తుండేవాణ్ణి.

"మయుడనే అసురునికి మాయావి, దుందుభి అనే ఇద్దరు కొడుకు లుండేవారు. పెద్దవాడైన మాయావితో ఒక స్త్రీ కారణంగా మా అన్నకు కలహం ఏర్పడింది.

"ఒకనాటి రాత్రి అందరూ నిద్రపోతున్నారు. మాయావి వచ్చి పెద్దగా అరచాడు. వాలిని పోరుకు పిలిచాడు. వాలి క్రుద్ధుడయ్యాడు. అంతఃపురస్త్రీలు, నేను ఎంత వారించినా వాలి వినలేదు.

"మాయావిని వధించుటకు వాలి బయలుదేరాడు. నేనూ వాలిని అనుసరించాను. మమ్మల్నిద్దరినీ చూడగనే మాయావి భయపడి పరుగుతీశాడు. వాలి అతణ్ణి తరుముతూ పరుగెత్తాడు. నేనూ అనుసరించి వెళ్ళాను.

"మాయావి ఒక భూబిలంలో ప్రవేశించాడు. చంద్రుని వెన్నెలలో ఆ ప్రదేశమంతా స్పష్టంగా గోచరిస్తూ ఉంది. మాయావిని సంహరించుటకు ఆ బిలంలో ప్రవేశించాలని వాలి నిర్ణయించుకున్నాడు. తాను తిరిగి వచ్చువరకు నన్ను అక్కడే నిరీక్షిస్తూ ఉండమని చెప్పి వెళ్ళాడు.

"రామా! నేనుకూడా వస్తానని చెప్పాను. వద్దని వాలి నన్ను వారించాడు. ఒట్టుపెట్టి మరీ వెళ్ళాడు.



"వాలి ఎంతకూ రాలేదు. నేను ఆ బిలం వద్ద సంవత్సరం కాలం నిరీక్షించాను. * వాలి ఇంకా రాలేదని చాలా దుఃఖించాను. వాలి మీద వున్న ప్రేమతో నేను అక్కడే నిరీక్షిస్తూ ఉండిపోయాను.

"రామా! ఇంతలో ఏం జరిగిందో తెలుసా! ఒకనాడు ఆ బిలం నుండి నురుగుతో కూడిన నెత్తురు ప్రవహించసాగింది. అది చూసి నేను చాలా బాధపడ్డాను. పెద్దగా ఏడ్చాను.

"ఈలోగా లోనుండి అసురులు పెద్దగా అరుస్తున్న ధ్వని వినిపించింది. మా అన్నగారి శబ్దము వినిపించలేదు. వాలి మరణించాడని భావించాన్నేను. పెద్దగా రోదించాను. కొండంత బండతో ఆ బిలాన్ని వెంటనే మూసేశాను. వాలికి తర్పణాలుకూడా చేశాను. బరువైన హృదయంతో కిష్కింధకు చేరాను.

"వాలి మరణాన్ని నేను ఎవ్వరికీ చెప్పలేదు. చాలా రహస్యంగా ఉంచాను. మంత్రులు పసిగట్టారు. ప్రయత్నించి తెలుసుకున్నారు. నేను నిరాకరించినా వినకుండా నాకు రాజ్యాభిషేకం చేశారు. నేను ధర్మబద్ధంగా పాలిస్తూ ఉండేవాణ్ణి.

"రామా! ఇంతకీ ఏం జరిగిందో తెలుసా! చచ్చింది వాలి కాదు. మాయావి. మాయావిని చంపిపడేసి, అతని బంధువుల్ని కూడా చంపేసి వాలి వెనుదిరిగాడు.

"మరి ఇంతకాలం వాలి బిలంలో ఏం చేశాడు అంటావా? మాయావిని వెతుకుతూ ఉండిపోయాడు. అది బిలం కదా! వాడెక్కడో దాగిపోయుంటాడు. వాణ్ణి అన్వేషించి పట్టుకోవడానికి అంతకాలమైంది వాలికి.

"మాయావి, అతని బంధువులైన అసురులందరూ వాలి చేతిలో మరణించారు. నేను మొదటే నీకు చెప్పానుగదా! వాలి గొప్ప వీరుడని. వాళ్ళందర్నీ చితగ్గొట్టి చంపేశాడు. వాళ్ళ రక్తం కాలవలాగా ప్రవహించిందట.

"ఆ రక్తపుమడుగులో ఎలాగో కష్టపడి వాలి బిలంయొక్క ద్వారము వద్దకు చేరాడు. నేను బిలాన్ని బండతో కప్పేశాను గదా! ఇక బయటికి ఎలా వస్తాడు? "సుగ్రీవా-సుగ్రీవా!" అని అరిచాడట. నేనక్కడలేను గదా! నాకెట్లా వినపడద్దీ?

"వాలికి దుఃఖమూ, కోపమూ రెండూ వచ్చాయి. కాలితో అమాంతం తన్నాడు ఆ బండను. అంతే. అది ఎగిరిపడింది. వాలి కిష్కంధ కొచ్చాడు. రాజసింహాసనము మీద నేను కన్పించాను.

"వాలిని చూడగనే నేను కూర్చున్నానా! లేదు. చివుక్కున లేచి దణ్ణం పెట్టాను.

"రేయ్! నాకు నామం పెట్టి వచ్చావు. ఇప్పుడు నేను తిరిగి వచ్చాక దణ్ణం పెడతావు. నిన్ను పెడ్తానా ఇప్పుడు గుంటలో" అంటూ కళ్ళెర్రజేసి నాపైకి వచ్చాడు వాలి.

"రామా! నేను మా అన్నకు నమస్కరించి చెప్పాను. నా కిరీటంతో ఆయన పాదాలు తాకి మరీ చెప్పాను. జరిగిందంతా చెప్పాను.

"అన్నా! నా మాట విను. నీపై నాకున్న ప్రేమతో సంవత్సరం రోజులు ఆ బిలం దగ్గరే పడివున్నా. రక్తాన్ని చూసినపుడు నీవు మాయావి చేతిలో మరణించావని భావించా.

* అధ్యాత్మరామాయణం లోను, తులసీరామాయణం లోను సుగ్రీవుడు నెలరోజులు మాత్రమే నిరీక్షించినట్లు ఉంది.

"ఈ రాజ్యము నాకు వద్దే వద్దన్నా. కావాలంటే వీళ్ళనందర్నీ అడుగు. వీళ్ళే పట్టుబట్టి నాకు పట్టం గట్టారు. ఈ రాజ్యం ఎప్పుడూ నీదే. అప్పుడున్నట్టే నీ సేవ చేసుకుంటూ ఉంటాను ఇప్పుడుకూడా. ఎంతెంతో చెప్పి చూశా. కాళ్ళు పట్టుకున్నా. వాలి మనసు కరగలేదు.

"నేనేదో దురాశతో కావాలనే బిలాన్ని మూసేశా ననేది వాలి మనసులో ఉండిపోయింది. నేను మూసిన బండను వాలి తొలగించుకో గలిగాడు కాని, నా విషయంలో మూసుకుపోయిన వాలి చెవుల్ని నేను తెరిపించలేక పోయాను.

"రామా! అంతే. వాలి నన్నెంత అవమానించాడో చెప్పలేను. నన్ను ఒక దెబ్బకూడా చేత్తో కొట్టలేదు. మొత్తం కాలితోనే.

"తమ్ముణ్ణనే సంకోచం కూడా లేకుండా ఒకే చెడ్డీతో **(వస్త్రేణైకేన)** నన్ను దేశం నుండి తరిమేశాడు

"మిత్రమా! రామా! ఈవిధంగా నేను రాజ్యము నుండి బహిష్కరించ బడ్డాను. నన్ను దూరంగా తరిమికొట్టి, నా భార్య రుమను దగ్గర చేసుకున్నాడు. వాలికి భయపడి నేను అరణ్యాలేనా, సముద్రాలేనా, భూప్రపంచ మంతా తిరిగాను.

"ఇక్కడెందుకున్నానో తెలుసా! ఈ పర్వతము మీదికి వాలి రాలేడు. అదీ విషయం. దానికి కారణముంది.

"రామా! మా కలహాన్ని, కలహకారణా న్నంతా ఉన్నదున్నట్లు నీకు చెప్పాను. ఏ తప్పూ తెలియని నాకు ఎంత ముప్పొచ్చిందో చూశావా! రామా! సర్వులకు నీవు అభయప్రదాతవు. విజానిజాలు గ్రహించు. వాలిని నిగ్రహించు. నన్ను అనుగ్రహించు," అన్నాడు సుగ్రీవుడు.

"సుగ్రీవా! నా బాణాలు సూర్యునిలాగా తీక్షణ మైనవి. అమోఘ మైనవి. వాటిని వాలిపై ప్రయోగిస్తాను. నీ భార్యను అపహరించిన ఆ అధర్మపరుణ్ణి, చరిత్రహీనుణ్ణి సహించను. నేను శరప్రయోగము చేయనంతవరకే వాలి బ్రతికి ఉంటాడు.

"సుగ్రీవా! గాయం తగిలినవారికే మరొకరి గాయం పెట్టే బాధ అర్థమవుతుంది. నీ బాధను నాకన్నా ఎవరు బాగా అర్థం చేసుకోగలరు? ఈ దుఃఖసాగరాన్ని నీవు దాటుతావు. నీ రాజ్యాన్ని తిరిగి నీవు పొందుతావు;" అన్నాడు రాముడు. సుగ్రీవుడు సంతోషించాడు.

జీవితం ఒక నది లాంటిది. ఎక్కడ ఎప్పుడు ఏవిధంగా మలుపు తిరుగుతుందో ఊహించలేము. ఒకొక్కసారి నిష్కారణంగా బాధలు చుట్టుముట్టి చిత్రవధ చేస్తుంటాయి. నిందలొచ్చి పడి కృంగదీస్తుంటాయి.

వాలిసుగ్రీవుల కలహం చూడండి. ఎంత విచిత్రంగా ఉందో! మాయావి రానంతవరకు వాలిసుగ్రీవుల అనుబంధం ఎంతో ఆదర్శంగా ఉండింది. ఒక్క సన్నివేశంతో జీవితాల రూపురేఖలే మారిపోయాయి.

వాలిసుగ్రీవుల కలహ ఉదంతంలో తప్పెవరిది? వాలి కోపం కూడా సహజమైనదే అనిపిస్తుంది. వాలి స్థానంలో ఎవరున్నా అలా కోపగించుకోవలసిందే!

సుగ్రీవుడు చేసిన తప్పేమిటి? బిలాన్ని మూసివేసి కిష్కింధకు చేరడమే. అలా చేయడం వెనుక ఆంతర్య మేమిటి? రాజ్యాన్ని అపహరించాలనే ఆలోచన సుగ్రీవున కుందా! లేక వాలి మీద సుగ్రీవునికి ప్రేమ లేదా!



అన్న మీద ప్రేమ లేకపోతే వాలితో కూడా బిలంలోకి ప్రవేశించేందుకు ఎందుకు ప్రయత్నిస్తాడు సుగ్రీవుడు? సంవత్సరం కాలం ఆ బిలంవద్దే ఎందుకు పడిగాపులు కాస్తూ పడి ఉంటాడు?

అదిసరే. అన్న బిలంలో ప్రవేశించి యుండగా బండతో బిలాన్ని మూయవచ్చా? ఇది మొదటి తప్పు. ఇకపోతే, రాజ్యాధికారాన్ని చేపట్టవచ్చా? ఇది రెండవ తప్పు. అంగదుడు కూడా మున్ముందు సుగ్రీవునిపై ఈ అభియోగాల్ని మోపుతూ హనుమంతునితో వాదిస్తాడు.

బిలాన్ని మూసేసి, రాజ్యాన్ని కబళించా లనేదే సుగ్రీవుని అభీష్ట మయితే ఆ పని ఎప్పుడో చేసి ఉండొచ్చు. సంవత్సరం రోజులు నిరీక్షించాల్సిన పనిలేదు.

బిలం నుండి రక్తం స్రవించినపుడే సుగ్రీవుడు ఆలోచనలో పడ్డాడు. ఆందోళనలో చిక్కిపోయాడు. ఎవరో చచ్చిపోయారు. ఆ విషయంలో సంశయం లేదు. పారే రక్తమే అందుకు సాక్షి.

కానీ ఆ చచ్చిపోయిన వ్యక్తి ఎవరు? వాలియా! లేక మాయావియా? ఇది సమస్య. ఇది సుగ్రీవునికి సమస్యగా గోచరించలేదు. చనిపోయింది వాలే గాని మాయావి కాదని సుగ్రీవుని నిశ్చితాభిప్రాయం.

అలాంటి అభిప్రాయాన్ని ఏర్పరచుకోవడానికి సుగ్రీవునికి ఆధార మేమిటి? దేనిని బట్టి వాలి మరణించినట్లు సుగ్రీవుడు నిర్ణయించాడు? దీనికి ఆధార మేమిటో సుగ్రీవుడూ చెప్పలేదు. వాల్మీకీ చెప్పలేదు అంటారు వి.ఎస్. శ్రీనివాసశాస్త్రిగారు.

రక్తమైతే బిలం నుండి బహిర్గతమౌతూ ఉంది. వాలియే చనిపోయి ఉంటాడు అనడానికి సుగ్రీవునికి ఆధార మేమిటో తెలియనపుడు బిలాన్ని మూయాల్సిన అవసర మేమొచ్చింది? అని పూర్వపక్షం.

**If he was not sure, why not make sure by walking in? Why did he not take his monkeys?**

ఎవరు చనిపోయింది నిశ్చితంగా తెలియనపుడు లోపలికి ప్రవేశించి ఖరారు చేసుకోవచ్చు గదా! పోనీ వానరులను వెంటబెట్టుకొని వెళ్ళి ఉండవచ్చు గదా! అనేది శాస్త్రిగారు ఊహించిన జనాభిప్రాయం.

సుగ్రీవుడు చేసిన దాంట్లో నాకు తప్పేమీ గోచరించడం లేదు. సుగ్రీవుడు ధర్మాత్ముడు. ఏ దోషమూ ఎరుగనివాడు. సంవత్సరం కాలం అన్నకోసం నిరీక్షిస్తూ పడి ఉన్నవాడు.

బిలం నుండి నెత్తురు వచ్చినపుడు వాలి మరణించినట్లు సుగ్రీవుడు అభిప్రాయపడ్డాడు. ఇలా అభిప్రాయపడడానికి సుగ్రీవునికి ఆధారం ఉంది. ఈ విషయం శాస్త్రిగారి సునిశిత దృష్టినుండి ఎలా తప్పించుకో గలిగిందో?

**నర్దతా మసురాణాం చ ధ్వనిర్మే శ్రోతమాగతః**
**న రతస్య చ సంగ్రామే క్రోశతోఽపి స్వనో గురోః**

"పెద్దగా అరుస్తున్న అసురుల శబ్దము కూడా నా చెవిని పడింది. నా అన్న వాలి యుద్ధము చేస్తున్నట్లు గాని, అరుస్తున్నట్లు గాని నాకు వినిపించలేదు" అంటాడు రామునితో సుగ్రీవుడు.

బిలం నుండి రక్తం స్రవించిన తరువాత అసురుల శబ్దాలు వినిపించాయి. వాలి అరుపు వినిపించలేదు. అసురుల అరుపులు వినిపిస్తున్నాయే గాని యుద్ధం జరుగుతున్నట్లు శబ్దం లేదు.

ఇంతకన్నా ఆధారం ఇంకేమి కావాలి? వాలి అజేయుడు. శత్రుంజయుడు. అట్టివాడు సంవత్సరం కాలం తిరిగి రాలేదు అంటే లోపల జరిగిన సమరం సామాన్యమైంది కాదని ఎవరైనా ఊహించగలరు.

సంవత్సరం కాలం వాలి లోపలున్నాడు. ఇప్పుడు రక్తం నురుగులు గ్రక్కుతూ బయటకి వస్తూవుంది. పైగా యుద్ధం జరుగుతున్నట్లు శబ్దాలు లేవు. అసురుల అరుపులు వినిపిస్తున్నాయి. పోనీ, ఇంకా యుద్ధం జరుగుతున్నట్లు భావించాలంటే, వాలి అరుపులు వినిపించడం లేదు. ఈ ఆధారాలతో మరణించినవాడు వాలేనని ఊహించవచ్చు.

మహావీరుడైన వాలియే మరణించినట్లు నిర్ణయం జరిగినపుడు అంతకన్నా తక్కువ బలశాలియైన సుగ్రీవుడు ఏ ధైర్యంతో లోపలికి వెళ్ళగలడు? వానరులు వచ్చి మాత్రం ఏం చేస్తారు? ఇదీ ధర్మాత్ముడైన సుగ్రీవుని ఆలోచన.

సరే బావుంది. అలాంటప్పుడు సుగ్రీవుడు కిష్కింధకు వచ్చి జరిగిన విషయం చెప్పవచ్చు గదా! బిలానికి మూత పెట్టాల్సిన అవసర మేమిటి?

అదలా ఉంచండి. వాలి బిలంలోకి వెళ్ళేటప్పుడు సుగ్రీవుడు కూడా తోడుగా వస్తానన్నాడు కదా! వాలి ఎందుకని తీసికొని వెళ్ళలేదు?

మాయావిని తాను ఒక్కడే సంహరించ గలడనే నమ్మకముంది వాలికి. అంతేగాదు. తన ప్రియసోదరుడైన సుగ్రీవుడు కష్టపడడం ఇష్టంలేక పోవడము కూడా ఒక కారణము. ఆనాటికి వారిమధ్య ప్రేమలు అలా ఉండేవి.

సుగ్రీవుని మీదున్న ఏ ప్రేమ కారణంగా వాలి సుగ్రీవుని బయటే ఉంచి బిలంలోకి వెళ్ళాడో, వాలి మరణించాడని తెలిసిన తరువాత, కిష్కింధలోని ప్రజల మీదున్న ప్రేమ కారణంగానే సుగ్రీవుడు బిలానికి మూత పెట్టాడు. వాలి వధానంతరము మాయావి సారథ్యంలో అసురులు విజృంభించి కిష్కింధను ధ్వంసం చేస్తారనే భయం కూడా అలా చేయడానికి మరొక కారణం. అన్నయైన వాలి రాజ్యాన్ని కాపాడాలనే ధర్మప్రవృత్తియే గాని రాజ్యాన్ని కబళించాలనే దురుద్దేశ్యం మాత్రంకాదు. అలాంటి ఉద్దేశ్యమే ఉంటే, ఎవరికీ తెలియకుండా, ఒంటరిగా, అన్నకు తర్పణా లెందుకు ఇస్తాడు సుగ్రీవుడు? ఇలా చూడనపుడు సుగ్రీవునిలో దోషమున్నట్లే కన్పిస్తుంది. సుగ్రీవునిది అధర్మమైతే రాముడు సహకరిస్తాడా?

**I want to tell you that at this stage of his career he was a little weak, and undeveloped yet.**

బిలాన్ని మూయడంలో, అప్పటికి పరిణతి చెందని బుద్ధిశాలిగా, కొద్ది బలహీనతలతో సాగుతున్న దశలో ఉన్నవానినిగా సుగ్రీవుని చిత్రీకరించారు వి.యస్.

సాధారణంగా అంత్యక్రియలు జరిగిన పిదపే జలతర్పణా లిస్తారు. సుగ్రీవుడు బండను మూతపెట్టిన తరువాత తర్పణాలు ఇచ్చాడు. రక్తపు మడుగులో అసురుల మధ్య పడి ఉన్న అన్నకు బిలాన్ని మూయడమే అంత్యక్రియలు చేయడము. బిలమైనా, గుంటైనా అదేకదూ?



బిలాన్ని మూయడంతో సరిపెట్టుకోలేదు గదా! రాజ్యాభిషేకం కూడా చేయించుకున్నాడు కదా! అనేది సుగ్రీవునిపై మరొక అభియోగం.

సుగ్రీవుడు రాజ్యాభిషేకాన్ని అంగీకరించలేదు. ప్రజలు, మంత్రులు పట్టుపట్టి సుగ్రీవునికి పట్టం గట్టారు. ఈ విషయంలో సుగ్రీవుని తప్పుపట్టడం అర్థరహితమైన విషయం.

మరి అయోధ్యలో భరతుణ్ణి కూడా రాజు కమ్మని పట్టుపట్టలేదా? భరతుడు అంగీకరించాడా? అందుకనే భరతుడు మహాత్ముడుగా కీర్తించబడ్డాడు. తనపై ఎన్ని అభియోగాలొచ్చినా నీటిమీద రాతల్లాగా మాయ మయ్యాయి.

సుగ్రీవుని విషయంలో అలా జరగలేదు. అతనిపై ఇంకా కొద్దో, గొప్పో పూర్వపక్షం నడుస్తూనే ఉంది.

కానీ, ఇంక కాస్త లోతుకు వెళ్తే, భరతుని పరిస్థితి వేరు. సుగ్రీవుని పరిస్థితి వేరు. రాముడు పద్నాలుగు సంవత్సరాలే అయోధ్యకు దూరంగా ఉంటాడు. కానీ వాలి కిష్కింధకు శాశ్వతంగా దూరమయ్యాడని కదా అభిప్రాయం. అందువల్లకూడా సుగ్రీవుడు రాజ్యభారాన్ని స్వీకరించాడు. జ్యేష్ఠుల స్థానాన్ని భర్తీ చేయాల్సింది కనిష్ఠులే కదూ!

జీవితంలో క్లిష్ట సమస్యలు తలఎత్తినపుడు తప్పు చేయకపోవడం ఒక్కటే చాలదు. బుద్ధినుపయోగించి చాకచక్యంతో జీవించడం కూడా అలవరచుకోవాలి.

పాపం! బిలాన్ని మూయకుండా ఉంటే, రాజ్యాభిషిక్తుడైనా, సుగ్రీవునికి ఈ బాధలు ప్రాప్తించేవి కావేమో!

తన దోషం లేదని సుగ్రీవుడు ప్రాధేయపడుతున్నా వాలి వినిపించుకోలేదు. క్రోధం సత్యాన్ని చూడనివ్వదు.

**క్రోధా ద్భవతి సమ్మోహః** క్రోధము వల్ల సమ్మోహము ఏర్పడి అయోమయ దృష్టి కల్గుతుందని భగవద్గీత బోధించింది. క్రోధాన్ని జయించినవారు లోకాన్ని జయిస్తారు.

ముందు వెనుక లాలోచించి ప్రవర్తించాలని సుగ్రీవుని పాత్ర ద్వారా, క్రోధము ప్రాణహరమని వాలి పాత్ర ద్వారా మనం గ్రహించాలి.

## సుగ్రీవుని సందేహం

రాముని అభయదానము సుగ్రీవునికి ఎంతో ఆనందాన్ని ప్రసాదించింది. కానీ సుగ్రీవుని మనసులో ఏదో ఓ మూల సందేహ మొకటి ఉండిపోయింది. ఆ సందేహాన్ని నివారించుకొని తృప్తిపడాలని భావించాడు సుగ్రీవుడు.

వాలి పరాక్రమము సుగ్రీవునికి తెలుసు. వాలి శక్తిని సుగ్రీవుడు ప్రత్యక్షంగా చూసి ఉన్నాడు. రాముని పరాక్రమమును గూర్చి విన్నాడే గాని చూడలేదు. కనుక రాముడు వాలిని సంహరించగలడా? అనే సందేహం మనసులో ఉండిపోయింది. సుగ్రీవుడు రామునితో ఇలా పలికాడు.

"రామా! వాలియొక్క పౌరుషాన్ని, ధైర్యాన్ని, పరాక్రమాన్ని గూర్చి చెబుతాను. అవధానంతో విను. ఆ తరువాత చేయవలసిన కార్యాన్ని ఊహించుకొందువు గాని.

"వాలి బ్రహ్మముహూర్తములో నిద్ర లేస్తాడు. నాలుగు సముద్రాల వద్ద కెళ్ళి సంధ్యా వందనం చేస్తాడు. పర్వత శిఖరాలను బంతులవలె ఎగరవేస్తూ క్రీడిస్తుంటాడు. బలప్రదర్శనము చేస్తూ అరణ్యములో పెద్దపెద్ద వృక్షాలను విరిచేస్తూ ఉంటాడు.

"రామా! పూర్వము దుందుభి అనే అసురుడు ఉండేవాడు. మహిషరూపుడైన ఆ రాక్షసుడు పర్వతము వలె గోచరించేవాడు. వాడికి సమరోన్మాదము పట్టుకుంది.

"సముద్రుని మీదికి వెళ్ళాడు. యుద్ధమునకు రమ్మని సాగరుని ఆహ్వానించాడు. సాగరుడు భయపడ్డాడు. తనకు అంతటి శక్తి లేదని, హిమవంతుని వద్దకు వెళ్ళమని చెప్పాడు.

"దుందుభి హిమవంతుని చేరాడు. పర్వత శిఖరాల్ని విరగగొట్టాడు. యుద్ధానికి రమ్మని హిమవంతుని పిలిచాడు. భీతి చెందిన హిమవంతుడు తాను యుద్ధము చేయలేనని చెబుతూ, ఇంద్రపుత్రుడైన వాలియే దుందుభికి సమఉజ్జీ అని తెలిపాడు.

"దుందుభి వాలితో యుద్ధం చేయాలని కిష్కింధకు వచ్చాడు. వాలి దుందుభులకు భయంకరంగా పోరాటం సాగింది. దుందుభి మరణించాడు. ఆ దుందుభి మృతకళేబరాన్ని వాలి యోజనము దూరము విసిరి పడేశాడు.

"దుందుభి శరీరము మతంగాశ్రమము సమీపంలో పడింది. దుందుభి శరీరం నుండి చిమ్మిన రుధిర బిందువులు ఆశ్రమ ప్రాంతాన్ని కలుషితం చేశాయి. అది చూసి మతంగముని కలత పడ్డాడు.

"యోగదృష్టితో జరిగిందంతా తెలుసుకున్నాడు. మృతకళేబరాన్ని ఆవిధంగా విసిరి, తాను ప్రాణసమానంగా పెంచుకుంటున్న మతంగవనాన్ని పాడుచేసిన వాడు ఆ వన ప్రదేశములో కాలుపెడితే జీవించడు అని శాపం పెట్టాడు.

"ఈ విషయం తెలిసి వాలి మతంగమునిని ఎంతగానో ప్రాధేయపడ్డాడు. క్షమించమని ప్రార్థించాడు. అయినా మతంగమహర్షి వినలేదు. ఈ కారణంగా వాలి ఈ వనప్రదేశంలోకి రాలేడు. ఋష్యమూకాన్ని సమీపించలేడు" అన్నాడు సుగ్రీవుడు.

చూసేందుకు భగవంతుడు కళ్ళిచ్చాడు. అందుచేత చూసి నడవడం నేర్చుకోవాలి. ఆలోచించేందుకు మనసిచ్చాడు. కనుక ఆలోచించి చేయడం అలవరచుకోవాలి. అనాలోచిత కార్యాలు బ్రతుకులో అగచాట్లను, ఆవేదనలను ఆవిష్కరిస్తాయి.

వాలి దుందుభిని చంపడం తప్పు కాదు. ఆలోచన లేకుండా మృతదేహాన్ని ఎటుపడితే అటు విసరడం చాలా తప్పు. చూశారా! అది ఋష్యాశ్రమాన్ని పాడుచేసింది. మతంగముని శాపానికి వాలి గురికావలసి వచ్చింది.

మన ఇంటిలోని చెత్తను పారేయడం మంచిదే. పై వాటాలో ఉన్నందుకు, చిమ్మి ఎత్తిన చెత్తను క్రింది వాటాలో ఉంటున్న ఇంటి యజమానిపై పోయడం మంచిది కాదు. 'చూడలేదు' అనేది క్షమాపణ క్రిందికి రాదు. ఒకవేళ అద్దె ఇవ్వమని తొందరపెట్టినా కూడా అలా చేయకూడదు. ఇష్టం లేకపోతే ఇల్లు ఖాళీ చేయాలి. ధర్మం అదే.

వాలికి ప్రాప్తించిన శాపాన్ని మనసులో ధరించి, అవసరం లేని వాటిని పడేసే టప్పుడు అనవసరమైన పేచీలు తలెత్తకుండా చూసుకోవాలి. అరటిపండు తిన్నా, ఆవులించినా, ఏ వస్తువును పడేసినా, ఏది దూరమైనా పేచీలు మాత్రం దగ్గర కాకుండా చూసుకోవాలి.



"రామా! వాలి విసిరి పడేసిన ఆ దుందుభి అస్థిపంజరము అదిగో. అదే. చూశావా! పర్వతంలాగా పడివుంది. అటుచూడు రామా! ఆ ఏడు సాలవృక్షాలను వాలి పట్టి ఊపగానే వాటి ఆకులన్నీ ఊడి రాలిపోయేవి.

"రామా! వాలియొక్క అసమాన పరాక్రమాన్ని నీకు తెలుపాలని భావించి ఇదంతా చెప్పాను. నీవు ఇప్పుడు చెప్పు. వాలిని సంహరించగలవా?" అని అమాయకంగా సందేహిస్తూ ప్రశ్నించాడు సుగ్రీవుడు.

రాముడు అభయమిచ్చినా నమ్మకుండా సందేహముతో ప్రశ్నిస్తున్నాడు సుగ్రీవుడు. భగవంతుడు అభయసందేశాన్ని అందిస్తున్నా విశ్వసించక ప్రమాణాన్ని కోరేవాడే జీవుడు.

**క్షిప్రం భవతి ధర్మాత్మా శశ్వచ్ఛాంతిం నిగచ్ఛతి**
**కౌంతేయ ప్రతిజానీహి న మే భక్తః ప్రణశ్యతి ।**

"భక్తుడైనవాడు శీఘ్రంగా ధర్మాత్ము డగుచున్నాడు. శాశ్వతశాంతిని పొందుచున్నాడు. అర్జునా! నా భక్తుడు నశించడు అని ప్రతిజ్ఞ చేసి చెప్పు" అంటాడు గీతలో శ్రీకృష్ణపరమాత్మ.

భగవద్వచనా లెన్నో ఉన్నాయి. విశ్వాసం లేనివానిని, సంశయగ్రస్తుని ఏం చేయగలం? మనపై కరుణామృతాన్ని కురిపించాలని, మనలో దివ్యత్వాన్ని చొప్పించాలని, తనలో మనల్ని ఐక్యం చేసుకోవాలని పరమాత్మ సదా మనకు చేరువవుతూనే ఉంటాడు. సంకుచితమైన భావాలతో మనమే ఆ పరంధాముని ప్రవేశించకుండా తలుపు వేసేస్తున్నాము.

**Hast thou not heard His silent steps?**
**He comes, comes, ever comes**

"ఆ దివ్యాత్ముని నిశ్శబ్ద పదసవ్వడి నీవు వినలేదా! అతడు వస్తున్నాడు. వస్తాడు. సదా వస్తూనే ఉంటాడు" అని రవీంద్రనాథ్ఠాకూరు.

సుగ్రీవుని ప్రశ్న లక్ష్మణునికి నవ్వు పుట్టించింది. "సుగ్రీవా! రాముడు ఏమి చేస్తే అతని బలపరాక్రమాల్ని నీవు విశ్వసిస్తావు?" అని నవ్వుతూ ప్రశ్నించాడు లక్ష్మణుడు. దానికి తడుముకోకుండా సమాధానం చెప్పాడు సుగ్రీవుడు.

"లక్ష్మణా! ఆ దుందుభి అస్థిపంజరాన్ని రాముడు ఒక్కకాలితో ఎత్తి నాలుగువందల గజాల దూరంలో పడేలా విసిరేయాలి. అప్పుడు నమ్ముతాను;" అన్నాడు సుగ్రీవుడు.

సుగ్రీవునికి విశ్వాసాన్ని దృఢం చేయాలని రాముడు భావించాడు. దుందుభి అస్థిపంజరాన్ని కాలి బొటనవ్రేలితో ఎత్తి పది యోజనముల దూరాన పడునట్లు రాముడు విసిరివేసాడు.

ఈ సన్నివేశాన్ని స్మృతికి తెచ్చుకొంటూ దుందుభిని తన్నిన శ్రీరాముని పాదవైభవమును స్మరిస్తూ,అట్టి దివ్య పాదారవిందములనే తాను కూడా నమ్మియున్నట్లు కీర్తిస్తాడు త్యాగరాజస్వామి.

**నీ పద పంకజములను నేనెఱ నమ్మినాను**
**వనరుహ తులిత నయన సక్రందన**
**తనయుని బాధ సహింపని విరో**
**చన సుతు మతి గలిగిన భయమెగయగ**
**ఘన తమ దుందుభి పెనుతల దన్నిన** ॥నీ పద॥

వాలి వలన భీతి చెందియున్న సుగ్రీవుని సందేహమును తొలగించుటకు దుందుభి దేహమును తన్నిన రాముని పదపంకజములను కీర్తించాడు త్యాగరాజస్వామి.

"రామా! ఆనాడు వాలి విసిరింది పచ్చిమాంసముతో కూడిన రక్తమయ దేహము. ఈనాడు నీవు విసిరింది మాంసహీనమై గడ్డిపరకవలె తేలికైన శరీరము.

"పచ్చి దేహానికి, ఎండిపోయిన దేహానికి భేదముంది కదా! దీనిని బట్టి నీవు బలవంతుడివా! లేక వాలియే బలవంతుడా! అని నేను నిర్ణయించుకోలేక పోతున్నాను. నా సందేహము పచ్చిగానే ఉంది. ఇంకా ఎండిపోలేదు.

"చూడు రామా! ఇంకొక విషయం చెబుతాను. విను. ఆ ఏడు సాలవృక్షాలను వాలి ఊపేసేవాడని చెప్పాను కదా! వాటిలో ఒక్క దానిని నీవు బాణంతో కొట్టి చీల్చగలిగితే, నీవు వాలిని ఎదుర్కోగలవని నేను నమ్ముతాను" అన్నాడు సుగ్రీవుడు.

సుగ్రీవుని సంతోషపరచాలని భావించిన ఆ రాముడు ధనుస్సును చేత పట్టుకున్నాడు. నారిని లాగి దిక్కులు పిక్కటిల్లేలా భయంకరమైన శబ్దము చేశాడు. ఒక బాణాన్ని సాలవృక్షముపై ప్రయోగించాడు.

రాముడు ప్రయోగించిన బాణము ఏడు సాలవృక్షములను కూల్చివేయుటయే గాక, ఎదురుగా ఉన్న పర్వతము చరియను ఛేదించి, భూమిని బ్రద్దలు కొట్టింది. తిరిగివచ్చి అంబులపొదిలో ప్రవేశించింది.

సుగ్రీవుడు ఆశ్చర్యపోయాడు. మరో ఆలోచన లేకుండా తానుకూడా తెగిన సాలవృక్షములాగా రాముని పాదాలపై పడ్డాడు.

"రామా! నీవు వాలినే కాదు వాడి అబ్బ ఇంద్రుణ్ణి కూడా జయించగలవు. నీవు అసమాన పరాక్రమవంతుడవు. నీ ముందు రణంలో నిలబడడం ఎవరికి సాధ్యం?

"రామా! నీకు చేతులెత్తి నమస్కరిస్తున్నాను. నా శత్రువైన వాలిని వెంటనే చంపేయి. నా మనసుకు హాయిని కూర్చేయి;" అని ఆనందంతో ఊగిపోతూ మాట్లాడాడు సుగ్రీవుడు.

సంశయముల మధ్య ఊగిసలాడేవాడే జీవుడు. అతడే సుగ్రీవుడు. రాముని నుండి కదలిన అనుగ్రహ బాణము సంశయాలను ఛేదించి, జ్ఞానమును ప్రసాదిస్తుంది.

రామబాణము మొదట సప్త సాలవృక్షాలను ఖండిస్తుంది. తరువాత కొండచరియను ఛేదిస్తుంది. ఆ తరువాత భూమిని బ్రద్దలు చేసి లోనికెళ్తుంది.

ఐదు జ్ఞానేంద్రియములు, మనసు, బుద్ధి కలిసి మొత్తం ఏడు. అవియే సప్త సాలవృక్షములు. ఈ ఏడింటిని రామబాణము నిరోధిస్తుంది అని అర్థము.

రామబాణము కొండచరియను ఖండించింది. మనలో పేరుకపోయి వున్న సంచితకర్మ సమూహమే కొండచరియ. రామానుగ్రహం వల్ల సంచితకర్మలు కూడా దగ్ధమై పోతాయి. వాసనాక్షయము జరుగుతుంది.

సప్త సాలవృక్షములను ఛేదించి, పర్వతచరియను కూల్చిన రామబాణము భూమిని ఛేదించుకొని పాతాళమును చేరింది. రామానుగ్రహము హృదయ గుహను ఛేదించి, అందులో



నిక్షిప్తమై ఉన్న అజ్ఞానాన్ని ధ్వంసం చేస్తుంది. ఈవిధంగా రామానుగ్రహము అనే బాణము జీవులను బంధవిముక్తులను గావిస్తుంది.

ఋష్యమూక పర్వతమునందు సుగ్రీవుడు వాలికి భయపడి నివసించే ఈ వృత్తాంతము వెనుక కూడా ఒక తాత్త్విక రహస్యముంది. అది కూడా చెప్పుకుంటాము.

సుగ్రీవుడు జీవుడు. వాలి ప్రారబ్ధము. జీవుడు ప్రారబ్ధాన్ని తప్పించుకోలేడు. ప్రారబ్ధము జీవుని వదలిపెట్టదు. ప్రారబ్ధాధీనుడైన వానికి శాంతి మిగలదు.

వాలి సుగ్రీవుని వెంబడించి దుఃఖముపాలు చేయునట్లు ప్రారబ్ధము జీవులను అనుసరించి బాధిస్తుంది. వాలి నుండి తప్పించుకొనుటకు సుగ్రీవుడు ఋష్యమూక పర్వతాన్ని ఆశ్రయించాడు. ప్రారబ్ధము నుండి విడిపడి తరించాలని భావించే జీవులు కూడా ఋష్య మూక పర్వతాన్నే ఆశ్రయించాలి.

ఋష్యమూకము అనగా ఋషుల ముఖము అని అర్థము. ఋషుల ముఖము నుండి వెలువడేది శాస్త్రమే కదా! అదియే సత్సంగము లేదా సత్పురుష సమాగమము.

సత్సంగమే జీవులను కర్మబంధము నుండి విడిపడేలా చేస్తుంది. నిస్సంగత్వము, నిర్మోహత్వము, నిశ్చలతత్త్వము సత్సంగము వల్లనే ప్రాప్తిస్తుంది.

పవిత్రాత్ములైన మహాత్ముల సన్నిధిలో ఎండకు మంచు కరిగినట్లు ప్రారబ్ధము కరిగిపోతుంది. కనుక కర్మబంధము నుండి విడుదల కోరేవారు ముందుగా సాధువులను ఆశ్రయించాలి. ఆ తరువాత రామదర్శన మవుతుంది. రామదర్శనంతో ప్రారబ్ధం నశిస్తుంది. ఇది వాలివధ. ఋష్యమూక గాథ.

సప్త సాలవృక్షాలను రాముడు కూల్చివేయగానే సుగ్రీవుడు అమితానంద భరితు డయ్యాడు. రాముడు సుగ్రీవుని కౌగలించుకున్నాడు.

"సుగ్రీవా! పద. ఇప్పుడే కిష్కింధకు వెళ్తాము. ముందుగా నీవు నడువు. వాలిని యుద్ధానికి పిలువు. నీవు పేరుకు మాత్రమే. తరువాత నేను చూసుకుంటాను" అంటూ మిత్రుడైన సుగ్రీవునికి రాముడు సంతోషాన్ని కల్పించాడు.

ఈ సందర్భమున మిత్రప్రయోజనాన్ని గూర్చి తులసీదాసు రామచరిత మానసంలో రాముని చేత చాలా గొప్పగా మాట్లాడిస్తాడు.

**జో న మిత్ర దుఖ హోహిఁ దుఖారీ తిన్హహి బిలోకత పాతక భారీ!**

**నిజ దుఖ గిరి సమ రజకరి జానా! మిత్ర క దుఖ రజ మేరు సమానా!**

"మిత్రుని దుఃఖమును చూచి వ్యథ చెందని వాని ముఖం చూడడం దారుణమైన పాపము. తమ కష్టాలు కొండంత అయినా వాటిని గోరంతలుగా భావించాలి. మిత్రుని కష్టాలు గోరంతలైనా వాటిని కొండంతలుగా దర్శించాలి.

"సుగ్రీవా! స్నేహితుని బాధల్ని చూసి తటస్థముగా ఉండువాడు మిత్రుడు కాడు. ద్రోహి. స్నేహితుడు ఎలా ఉండాలో వేదము చెప్పిన మాటలు చెబుతాను. విను.

"స్నేహితుడైనవాడు 1. తన స్నేహితుని చెడుమార్గము నుండి మళ్ళించాలి. 2. మంచి మార్గములో ప్రవేశపెట్టాలి. 3. మిత్రుని సుగుణాలను బహిర్గతం చేయాలి లేదా వెల్లడి

చేయాలి. 4. దుర్గుణాలను దాచిపెట్టాలి. 5. ఇచ్చిపుచ్చుకోవడాలలో అవిశ్వాసము చోటుచేసుకోకుండా చూసుకోవాలి. 6. తన శక్తిని అనుసరించి సహాయము చేయుటకు సదా సిద్ధంగా ఉండాలి. 7. ఆపద కాలములో నూరురెట్లు అధికముగా ఆదుకునే ప్రయత్నం చేయాలి."

"స్నేహధర్మాన్ని వేదము ఈవిధంగా ప్రవచించినట్లు తులసీరామాయణంలో రాముడు సుగ్రీవునితో చెబుతాడు. స్నేహితుల విషయంలో మనం కూడా ఈవిధంగా ఉన్నామో లేదో ఆలోచించుకోవడం మంచిది. అంతరేక్షణ జరుపుకోవడం మంచిది. పై లక్షణాలు ఒకవేళ కొరవడితే వాటిని తయారు చేసుకోవడమే ఉత్తమం. స్నేహంలో జరిగే ద్రోహాలు జీవితాన్ని నిరర్థకంగా మార్చేస్తాయి.

## వాలి సుగ్రీవుల పోరాటము

వారంతా కిష్కింధకు చేరారు. సుగ్రీవుడు వస్త్రాన్ని గట్టిగా బిగించాడు. ఆకాశము ముక్కలయ్యేలా అరుస్తూ వాలిని యుద్ధానికి పిలిచాడు. మిగిలిన వారంతా దట్టమైన అరణ్యంలో చెట్లవెనుక దాగారు.

సుగ్రీవుని భయంకరమైన శబ్దానికి వాలి ఉలిక్కిపడ్డాడు. క్రుద్ధు డయ్యాడు. మేఘ మండలం నుండి సూర్యుడు వచ్చినట్లు బయటకు వచ్చాడు. సుగ్రీవుణ్ణి చూచి, తీవ్రంగా కోపించి యుద్ధానికి దిగాడు.

సోదరు లిద్దరూ చేతులు కలిపారు. కొంచెంసేపు అరచేతులతో చరుచుకున్నారు. ఆపైన పిడికిళ్ళు బిగించి వజ్రాయుధము వంటి దెబ్బలతో గ్రుద్దుకున్నారు. కొట్టుకున్నారు.

రాముడు వారి ద్వంద్వపోరాటాన్ని చూస్తూనే ఉన్నాడు. అన్నదమ్ము లిద్దరూ అశ్వినీ కుమారుల వలె ఒకే పోలికతో తెలుస్తున్నారు రామునికి.

వారిలో వాలి ఎవరో, సుగ్రీవుడు ఎవరో రామునికి అర్థం కాలేదు. వాలిసుగ్రీవుల ఆకారములో భేదం గోచరించడం లేదు. వేషములో కూడా తేడా లేదు. దేహప్రమాణము కూడా ఒకేలా ఉంది.

ఇద్దరూ అరుస్తున్నారే గాని కంఠధ్వని ఒకే విధంగా ఉంది. చూపుల్లో కూడా ఇద్దరికి తేడా తెలియడం లేదు. ప్రాణమును హరించే బాణాన్ని ప్రయోగించడానికి రాముడు వెనుకాడాడు.

వాలి చేతిలో సుగ్రీవుడు ఓడిపోయాడు. సుగ్రీవుడు అటూ ఇటూ చూశాడు. రాముడు కనిపించలేదు. ప్రాణభయంతో సుగ్రీవుడు పరుగుతీశాడు.

పోరాటంలో పరిస్థితి బీభత్స మైనపుడల్లా సుగ్రీవుడు రాముని కొరకు అటూ, ఇటూ చూస్తున్నాడు. జీవితప్రయాణంలో ప్రతికూల వాయువులు వీచినపుడు దైవసహాయం కోసం చూడాలి. దృష్టిని దైవంపై సారించాలి.

సుగ్రీవుడు పారిపోవడం చూసి వాలి వెంటబడి తరిమాడు. సుగ్రీవుడు మతంగవనంలో ప్రవేశించాడు. శాపభయము వలన వనములో ప్రవేశించలేని వాలి, "పో.....తప్పించుకున్నావు ఈరోజు" అని పలికి తిరిగి కిష్కింధకు చేరాడు.



సుగ్రీవుడు బాగా అలసిపోయాడు. శరీరమంతా రక్తంతో తడిసిపోయింది. వాలి కొట్టిన దెబ్బలకు దేహం శిథిలమై పోయింది. హనుమంతునితో కలిసి రామలక్ష్మణులు కూడా వచ్చారు సుగ్రీవుడున్న చోటికి.

రాముణ్ణి చూడగానే సుగ్రీవుడు సిగ్గుతో తలవంచుకున్నాడు. నేలచూపుల్తో దీనుడై ఇలా పలికాడు.

"శత్రువును వధిస్తానన్నావు. వాలిపై కాలుదువ్వ మన్నావు. నీ పరాక్రమము చూపి నాలో నమ్మకాన్ని పెంచావు. తీరా వెళ్ళాక నన్ను వాలిచేత తన్నిచ్చావు. ఇలా ఎందుకు చేశావు?

"రామా! వాలిని నేను వధించను అని అప్పుడే నీవు ఎందుకు చెప్పలేదు? నీవు చెప్పి ఉంటే నేను వాలి వద్దకు పోయేవాడ్నేనా!" అని దీనంగా పలికాడు సుగ్రీవుడు.

"నాయనా! సుగ్రీవా! కోప్పడకు. నేను వాలిని ఎందుకు వధించలేదో కారణం చెబుతాను. విను. మీ రూపాలు ఒకే విధంగా నాకు అనాయి. నేను విడిచే బాణము సామాన్యమైనది కాదు. ప్రాణాంతకమైనది. ఒకవేళ అది నీకే తగిల్తే ఆ తరువాత నేనేం కావాలి?

"నీకు అభయమిచ్చింది నిన్ను చంపుకోడానికా! దానివల్ల నాకు పాతకము సంభవించదా! నేను, సీతాలక్ష్మణులు నీ రక్షణలో ఉన్నా మీనాడు.

"సుగ్రీవా! నన్ను శంకించకు. నీవు వాలితో మళ్ళీ పోరాడు. ఒకే ఒక్క బాణంతో వాలిని నేల కూల్చేస్తాను. అతడు నేలపై బడి చెండులా దొర్లడం నీవు చూస్తావు.

"సుగ్రీవా! మీ ఇద్దరిలో నేను నిన్ను సులభంగా గుర్తించునట్లు ఏదయినా ఆనవాలు ఉంచుకో. లక్ష్మణా! పుష్పించియున్న గజపుష్పలతను తుంచి సుగ్రీవుని కంఠానికి చుట్టు;" అన్నాడు రాముడు.

లక్ష్మణుడు వికసించిన గజపుష్పలతను తెచ్చి సుగ్రీవుని మెడను అలంకరించాడు. కొంగలతో చుట్టబడియున్న సంధ్యామేఘంలా సుగ్రీవుడు ప్రకాశించాడు.

అందరూ మళ్ళీ కిష్కింధకు బయలుదేరారు. రామసుగ్రీవులతో లక్ష్మణుడు, హనుమంతుడు, నలుడు, నీలుడు, తారుడు బయలుదేరారు. కిష్కింధలో ప్రవేశించారు.

"రామా! వాలిని వధిస్తానని నీవు శపథం చేశావు. నాకు మాటిచ్చావు. కాలము తీగను పుష్పింపచేయునట్లు నీవిచ్చిన మాటను సఫలం చేసుకో;" అన్నాడు సుగ్రీవుడు.

"సుగ్రీవా! నీ మెడలో గజపుష్పలత శోభిస్తోంది కదా! అదే నాకు గుర్తు. నీవు భీతి చెందకు. నా ఒక్క బాణము రెండు ఫలితాలను సాధిస్తుంది. భయాన్ని పోగొడుతుంది. శత్రుత్వాన్ని నిర్మూలిస్తుంది.

"సుగ్రీవా! నేను వాలిని చూడడం అతడు చావును చూడడం రెండూ ఒకేసారి జరుగుతాయి. అలా జరగకపోతే నీవు నన్ను దోషిగా పరిగణించు. నీ ఇష్టమొచ్చినట్లు నిందించు.

"నువ్వు చూస్తుండగనే ఏడు సాలవృక్షాలను నేను కూల్చానా! లేదా! చెప్పు. అనవసరంగా సంశయించకు. సుగ్రీవా! నేను ధర్మాసక్తుడను. ఎన్ని ఆపదలు చుట్టుముట్టినా అబద్ధాలాడను.

"చూడు. భూమిపై అంకురించిన వరిపాలాన్ని ఇంద్రుడు వర్షంతో సఫలం చేయునట్లు నేను నా శపథాన్ని సఫలం చేసుకుంటాను. భయాన్ని విడచిపెట్టు. కానీ! చూస్తావేం? పిలువు. ఎలా పిలిస్తే వాలి బయటకు వస్తాడో అలాంటి గర్జన చెయ్యి.

"వాలి ఓటమి నెరుగడు. అందులోను నీచేతిలో. నీవు పిలవగానే వాలి రోషంతో పరుగులెత్తుతూ వస్తాడు. వీరుడైన వాడు పోరాటానికి పిలుపు వచ్చినపుడు నిగ్రహాన్ని కోల్పోతాడు. స్త్రీల ముందైతే ఇక చెప్పనవసరం లేదు;" అన్నాడు రాముడు.

నీవు యుద్ధం చెయ్యి. నేను నీతోనే ఉంటాను అని రాముడు చెప్పినట్లు భగవంతుడు జీవులకు అదే సందేశ మిస్తాడు.

జీవితపోరాటంలో మీరు నిమగ్నులై ఉండండి. నన్ను మనసులో భావిస్తూ ఉండండి. నేను మీ వెంటనే ఉంటాను. సమయాన్ని చూసి సహాయాన్ని అందిస్తాను అంటాడు.

**తస్మాత్ సర్వేషు కాలేషు మా మనుస్మర యుధ్యచ**

"సర్వకాలముల యందును నన్నే అనుస్మరిస్తూ యుద్ధంలో పోరాడు" అని శ్రీకృష్ణపరమాత్మ భగవద్గీతలో అర్జునునికి చెబుతాడు.

## తారాపథము

రాముని మాటలు సుగ్రీవునికి కొండంత శక్తి నిచ్చాయి. నింగి విరిగి నేలపై రాలునట్లు సుగ్రీవుడు భయంకరంగా సింహగర్జన చేశాడు.

ఆ శబ్దానికి మృగాలు భయపడి పారిపోయాయి. పక్షులు పండ్లు చెట్లనుండి రాలినట్లు రాలాయి. సుగ్రీవుడు మళ్ళీ మేఘగర్జనం చేసి కెరటాలు చాచి చలించే సముద్రం లాగా కదలిపోయాడు. ఎగిరి దుమికాడు.

సుగ్రీవుని ధ్వని వాలి చెవిన పడింది. వెంటనే క్రుద్ధుడయ్యాడు వాలి. గ్రహణం పట్టిన సూర్యునిలాగా తేజోహీనుడయ్యాడు. వెంటనే భూమి కంపించేలా అడుగులు వేసుకుంటూ వాలి బయలుదేరాడు.

వాలి ధర్మపత్ని తార వాలిని సమీపించింది. ప్రేమతో వాలిని కౌగలించుకుంది. భర్త హితము కోరి ప్రియమైన వాక్కులు పలికింది.

నిత్యము ఎవరిని ధ్యానించడం వలన సమస్త పాతకములు నశిస్తాయని శాస్త్రము నిర్దేశించిందో అట్టి పంచకన్యలలో తార కూడా ఒకతె. అహల్య, ద్రౌపది, సీత, తార, మండోదరి- ఈ అయిదుమంది సాధ్వీమతల్లులు 'పంచకన్యలు'గా కీర్తించబడ్డారు.

ద్రౌపది మినహా మిగిలిన నలుగురు సాధ్వీమతల్లులు మనకు రామాయణంలో దర్శనమిస్తారు. బాలకాండలో అహల్య వైభవం చూశాము. సీతమ్మ వైభవం సాగుతూ ఉంది. ఇప్పుడు తార పాత్ర ప్రవేశించింది. వివాహితులైన స్త్రీలను శాస్త్రము కన్యలుగా కీర్తించిందంటే వారి ఔన్నత్యము, పవిత్రత ఎలాంటిదో మనం గ్రహించవచ్చు.

మహాపతివ్రత, వాలి ధర్మపత్ని అయిన తార ఇప్పుడే మనకు ప్రథమంగా కన్పించింది. ఇక్కడే ప్రథమంగా నోరు విప్పి మాట్లాడింది.



**సాధు క్రోధమిదం వీర నదీవేగ మివాగతమ్**
**శయనా దుత్థితః కాల్యం త్యజ భుక్తామివ స్రజమ్ ॥**

"ఓ వీరుడా! ఉదయం నిద్రనుండి లేచినవాడు నలిగిపోయిన పూలమాలను విసిరి పారేస్తాడు. నదీవేగంలా నీకు వచ్చిన కోపాన్ని నీవూ అలాగే విడిచిపెట్టు."

ఇది తార పలికిన మొదటి మాట. మంచి రత్నాల మూట. వాలి భవిష్యత్తుకు బంగారు బాట.

రాత్రి పరుండే ముందు ధరించిన పూలదండ ఉదయం నిద్రలేచిన తరువాత నిరుపయోగం. వాడిన పూదండ దేనికీ పనికిరాదు. క్రోధం కూడా వాడిన పూలమాల వంటిది అంటున్నది తార.

క్రోధం బుద్ధిని పాడుచేస్తుంది. విజ్ఞానాన్ని వక్రింపచేస్తుంది. శత్రుత్వాన్ని పెంచుతుంది. సుఖాన్ని కాలరాస్తుంది. అలాంటి క్రోధాన్ని విడిచిపెట్టమని చెప్తూవుంది. క్రోధము దుఃఖ కారణమని, నిరుపయోగమని చెప్తూవుంది.

**మానం హిత్వా ప్రియో భవతి క్రోధం హిత్వా నశోచతి**
**కామం హిత్వాఽర్థవాన్ భవతి లోభం హిత్వా సుఖీ భవేత్ ॥**

"అభిమానం వదిలినవాడు అందరికీ ప్రియుడవుతాడు. క్రోధం విడిచినవాడు శోకరహితు డవుతాడు. కామాన్ని వదలినవాడు సంపన్ను డవుతాడు. లోభాన్ని త్యజించినవాడు సుఖవంతు డవుతాడు;" అని ధర్మరాజు మహాభారతం- వనపర్వములో చెబుతాడు.

తార ప్రథమంగా మాట్లాడిన శ్లోకంలో మొదటి మాట **"సాధు"**. సద్వచనము సంబోధన లోనే స్పష్ట మవుతుంది. "సాధు" అని చాలా బాగుగా సంబోధించింది తార.

సాధుః అంటే మంచివాడు అని అర్థము. వాలిని మంచివాడా అంటూ సంబోధించింది. మంచిమాటను మంచివాళ్ళే వినగలరు. తాను చెప్పే మంచిమాటను మంచిబుద్ధితో స్వీకరించమని "సాధు" అనే పదాన్ని తార ప్రయోగించింది.

ఈ ప్రథమ శ్లోకంలో నలిగిపోయిన పూలదండవలె క్రోధాన్ని విడిచిపెట్టమని చెప్పింది తార. "సాధు" అంటే చక్కగా అని కూడా అర్థము. క్రోధాన్ని బాగుగా విడిచిపెట్టమని కూడా భావము. నిశ్శేషంగా నిర్మూలించమని విన్నపము.

ఈ మాట చెప్పబోయే ముందు తార వాలిని స్నేహపూర్వకంగా కౌగలించుకుంది అన్నాడు వాల్మీకి. తాను వాలికన్నా వేరుగా లేనట్లు, వాలి సమస్యతో తాను ఏకమై ఆలోచిస్తున్నట్లు తెలుపుటయే తార వాలిని కౌగలించుకొనుట లోని గూఢార్థము.

తార వాలితో చెబుతోంది.

"వీరుడా! ఇప్పుడు నీవు యుద్ధానికి వెళ్ళడం నాకు సుతరామూ ఇష్టంలేదు. నేను నిన్ను ఎందుకు వెళ్ళవద్దని చెప్తున్నానో దానికి కారణం విను.

"ఇంతకుముందే సుగ్రీవుడు నీపై కయ్యానికి కాలుదువ్వాడు. నీవు వెళ్ళి అతణ్ణి కొట్టి పరాజితుణ్ణి చేశావు. నీ ధాటికి తట్టుకోలేక పారిపోయాడు.

"నీవు అలా కొట్టి ఓడించి తరిమిన వ్యక్తి మళ్ళీ, గాయాలు మానకముందే నిన్ను పోరాటానికి పిలుస్తున్నాడంటే నాకేదో సందేహంగా ఉంది.

"అంతేకాదు. ఈసారి సుగ్రీవుని గర్జనలో ఏదో దర్పం తెలుస్తోంది. ఇలా పిలవడానికి వెనుకేదో పెద్ద కారణ మున్నట్లు నా మనసు శంకిస్తోంది" అన్నది తార.

వాలి చేతిలో ఘోరంగా పరాజితుడైన సుగ్రీవుడు నిర్భయంగా మళ్ళీ యుద్ధానికి గీరడం వెనుక ఏదో పథకం ఉన్నట్లు తార సందేహించింది. సుగ్రీవుని అరుపులోని దర్పాన్ని కూడా గ్రహించింది. అంతేకాదు. ఆ దర్పం వెనుక అదృశ్యంగా ఉన్న దర్పకుణ్ణి కూడా చక్కగా దర్శించగలిగింది తార.

భర్తను 'సాధు' అని సంబోధించి తన వాక్చాతుర్యాన్ని, సరళత్వాన్ని ప్రదర్శించింది. సుగ్రీవుడు మళ్ళీ వచ్చి కయ్యానికి పిలవడం వెనుక ఏదో పథకం ఉన్నట్లు అనుమానించి తన సూక్ష్మబుద్ధిని నిరూపించుకుంది.

"వీరుడా! సుగ్రీవుడు ఒంటరిగా వచ్చివుంటాడని నేను భావించడం లేదు. అతని వెనుక ఎవరో సహాయం చేసేవారు ఉండి ఉండాలి. వారి అండ చూసుకొనే సుగ్రీవుడు అలా గర్జిస్తున్నాడు.

"సుగ్రీవుడు సహజంగా గొప్ప నేర్పు కలవాడు. బుద్ధిమంతుడు. ఎదుటివ్యక్తిని పరీక్షించకుండా సుగ్రీవుడు స్నేహం చేయడు" అన్నది తార.

సుగ్రీవుని అరుపును విని మహోద్రేకంతో మండిపడి ముందు కురుకుతున్న వాలిని 'సాధూ' అంటూ ఆపి, అతని ఆవేశప్రవాహానికి తన ఆలోచనల్ని ఆనకట్టలుగా పేర్చుకుంటూ, అంచెలంచెలుగా వాలిని అవగాహనా అంచులవైపు నడిపిస్తోంది తార.

మొదట తన అనుమానాన్ని తెలిపింది. అది ఎలా వాస్తవమో సహేతుకంగా వర్ణించింది. సుగ్రీవుని వెనుక ఎవరో ఉన్నట్లు రూఢిపరచింది. ఒకవేళ ఉంటే ఏమైంది? అని వాలి భావించవచ్చు. అలా అంచనా వేసి కష్టాలపాలు కావద్దని పరోక్షంగా హెచ్చరిస్తూ సుగ్రీవుని ప్రస్తావన తెచ్చింది.

నిపుణుడైన సుగ్రీవుడు ఎదుటివ్యక్తి పరాక్రమాన్ని బేరీజు వేయకుండా స్నేహం చేయడు అని బరువైన వాదాన్ని వినిపించింది. వాలి విషయం, వాలి పరాక్రమం సుగ్రీవునికి బాగా తెలుసు. అట్టివాడు ఒకసారి దెబ్బలు తిని వెళ్ళి వెంటనే తిరిగొచ్చి యుద్ధానికి రమ్మని దర్పంతో గర్జిస్తున్నాడంటే, తనకు సహాయం చేయడానికి వచ్చినవాడు వాలికన్నా బలహీనుడైతే సుగ్రీవుడు అలా ప్రవర్తించగలడా? కనుక సుగ్రీవుని శక్తిని ఈ సమయంలో తక్కువగా అంచనా వేయకూడదని సలహా ఇస్తోంది తార. రాబోయే ఆపదను సూచిస్తోంది.

"వీరుడా! దీనికి ముందే మన కుమారుడైన అంగదుడు నాతో ఒకవిషయం చెప్పి ఉన్నాడు. బాగా ఆలోచించవలసిన విషయం. చెబుతాను. విను.

"అంగదుడు కిష్కింధ పరిహద్దులలోకి ఇటీవలే వెళ్ళివచ్చాడు. అక్కడ మన గూఢచారుల ద్వారా ఒక వార్తను విన్నాడు. విన్నది విన్నట్టుగా నాతో చెప్పాడు.



"రామలక్ష్మణులనే ఇద్దరు సోదరులు మన ప్రాంతానికి వచ్చారట. వారు ఇక్ష్వాకు వంశీయులట. దశరథుని కుమారులని చెప్పాడు. రామలక్ష్మణులు అసమాన పరాక్రమవంతులని, వీరులని, శత్రుంజయులని తెలిసింది.

"వారిద్దరూ నీ తమ్మునికి సాయం చేయడానికి వచ్చారట. పైగా రాముడు ప్రళయ కాలాగ్ని లాంటివాడని చెప్పుకుంటున్నారు.

**నివాసవృక్షః సాధూనా మాపన్నానాం పరా గతిః**

**ఆర్తానాం సంశ్రయశ్చైవ యశసశ్చైక భాజనమ్ ॥**

"బాటసారులకు ఛాయనిచ్చు చెట్టు వలె సాధువులకు రాముడు నివాసవృక్షము వంటివాడు. ఆపదలలో ఉన్నవారికి అతడే గతి. దుఃఖితులకు ఆశ్రయ మైనవాడు. కీర్తిభాజనుడట;" అన్నది తార.

సుగ్రీవుని వెనుక నిలిచియున్న శక్తి ఎవరో కూడా మెల్లగా తానే చెప్పేసింది. రాముని పరాక్రమ మెలాంటిదో, స్వభావ మెలాంటిదో కూడా విప్పిచెప్పింది. నిజమే కావచ్చు. రాముడు సుగ్రీవునికి ఎందుకు సహాయం చేస్తాడు? అగ్నిసాక్షిగా రామసుగ్రీవులు స్నేహం కట్టుకున్నట్లు తారకు కూడా తెలియదు కదా!

ఇక్కడే తార వైభవోపేతమైన జ్ఞానంతో భాసిస్తోంది. రాముని గుణవిశేషాలను వర్ణిస్తూ, రాముని సహాయం పొందుటకు సుగ్రీవుడు ఎలా అర్హుడో చెబుతోంది.

1. సుగ్రీవుడు సాధువు. రాముడు సాధువులకు నివాసవృక్షము.
2. సుగ్రీవుడు ఆపన్నుడు. రాముడు ఆపన్న శరణ్యుడు.
3. సుగ్రీవుడు ఆర్తుడు. రాముడు ఆర్తజన సంశ్రయుడు.
4. సుగ్రీవుడు కీర్తిమంతుడు. రాముడు కీర్తిభాజనుడు.

రాముడు సహాయం చేయడానికి కావలసిన లక్షణాలన్నీ సుగ్రీవునిలో ఉన్నాయి. కనుక రాముడు సుగ్రీవునికి అండగా వచ్చి ఉంటాడు అని తేల్చి చెప్పింది. పైగా రాముడు అసమాన పరాక్రమవంతుడు. సరే! అంతా బావుంది. ఇంతకీ ఏమి చేయాలి? అది కూడా తారే చెప్తోంది.

"వీరాధివీరా! యుద్ధంలో రాముని జయించడం తేలిక కాదు. రాముని శక్తి అలాంటిది. నామాట విను. రామునితో శత్రుత్వము పెట్టుకోవడం మనకు శ్రేయోదాయకము కాదు.

"నాకు తోచిన మంచిమాటను నీ మేలు కోరి చెబుతున్నా. కోపగించుకోకుండా విను. సుగ్రీవునితో విరోధము మానేయ్. సుగ్రీవుని యువరాజు చేసేయ్.

"సుగ్రీవుడు నీ తమ్ముడు. నీ లాలనకు అర్హుడు. మంచివాడు. సుగ్రీవుని వంటి బంధువు నీకు ఈ ప్రపంచంలో లభించడు. ఎక్కడున్నా అతడు నీ తమ్ముడు కాకపోడు.

"అతనిని ప్రేమతో చూడు. అతని కివ్వాల్సిన గౌరవాన్ని అతని కివ్వు. ఎల్లప్పుడూ విశ్వసించదగిన సుగ్రీవుని నీ ప్రక్కనే ఉంచుకో. సోదరప్రేమను అతనికి పంచు. నీ తరువాత వానిగా అతనికి గుర్తింపు నివ్వు. నీకు ఈ సమయంలో ఇదొక్కటే చక్కని మార్గము.

**అహం హి తే క్షమం మన్యే తవ రామేణ సౌహృదమ్**

**సుగ్రీవేణ చ సంప్రీతిం వైర ముత్సృజ్య దూరతః**

"విరోధాన్ని విడిచిపెట్టి సుగ్రీవునిపై ప్రేమ చూపడం, రామునితో స్నేహం చెయ్యడం ఈ రెండే నేను కోరుకుంటున్నాను" అని పరిష్కారాన్ని కూడా వాలి ముందు పరచేసింది తార.

చూశారా! తార ఎంత సారగ్రాహియో! బాధ్యతా భారవాహియో!

భయంకరమైన పరిస్థితుల్లో భర్త సమస్యను చక్కని విశ్లేషణతో విమర్శించుకొని, సముచిత రీతిలో స్నేహపూర్వకంగా, హేతుబద్ధంగా భర్తకు వివరించి, చేవ కలిగిన పరిష్కారాన్ని కూడా అందించి, సహధర్మచారిణీ, ధర్మపత్ని అనే పేర్లకు దివ్యశోభను కల్పించింది పరమ సాధ్వీమణి తార.

ఆమె సూచించిన పరిష్కారంలో ధర్మబద్ధమైన విషయాలు ఎలా చోటు చేసుకోనున్నాయో చూడండి.

ఈ వ్యవహారం మొత్తానికి ముగ్గురు వ్యక్తులు ప్రధాన పాత్రలను పోషిస్తున్నారు. 1. సుగ్రీవుడు - కాలుదువ్వేవాడు 2. వాలి - కయ్యానికి సిద్ధపడేవాడు 3. శ్రీరాముడు - కనుమరుగై యున్నవాడు.

1. సుగ్రీవుని ప్రేమించడం, అతనికి యౌవరాజ్య పట్టాభిషేకం చేయడం-ఇదీ సుగ్రీవుని విషయంలో తార సూచించిన విషయం. ఆమె సూచన మేరకు చేస్తే ధర్మబద్ధంగా సుగ్రీవునికి ఇవ్వవలసిన రాజ్యాన్ని ఇచ్చినట్లూ అవుతుంది. వైరుధ్యాన్ని తొలగించుకోవడం జరుగుతుంది. బుద్ధిమంతుడైన సుగ్రీవుడు వాలికి తోడుగానూ ఉంటాడు.

2. తమ్ముణ్ణి గౌరవించి, ప్రేమించాడన్న కీర్తి వాలికి లభిస్తుంది. రాముని వంటి మహావ్యక్తితో సఖ్యం ఏర్పడుతుంది. ఆపదలూ కరిగిపోతాయి. తమ్ముణ్ణి తరిమేశాడనే అపఖ్యాతి కూడా వాలికి మిగలదు.

3. ఇక రాముని విషయం. ధర్మాత్ముడు, దివ్యాత్ముడు అయిన రామునితో స్నేహం చేయడం వల్ల రామునికి సముచితమైన మర్యాద నిచ్చినట్లూ ఉంటుంది. వారి వీరత్వాన్ని గౌరవించినట్లూ ఉంటుంది.

ప్రతాపము, అహంకారము, దంభములతో విర్రవీగి విపత్తులను ఆహ్వానిస్తున్న భర్త యొక్క అనిశ్చిత ఆలోచనలకు తెరవేయాలని, తెర దించాలని ప్రయత్నించింది తార.

**యదితే మత్ప్రియం కార్యం యది చావైషి మాం హితామ్**

**యాచ్యమానః ప్రియత్వేన సాధువాక్యం కురుష్వ మే**

"వీరుడా! నాకు మేలు చేయాలని నీవు భావించేటట్లయితే, నేను నీ మేలు కోరే దానినని నీవు అభిప్రాయపడేటట్లయితే నేను చెప్పినట్లు చక్కగా ఆచరించు. నిన్ను నేను శాసించడం లేదు. శరణు జొచ్చి పలుకుతున్నాను.

"నా మాట విని కోపాన్ని విడిచిపెట్టు. దేవేంద్రునితో సమానుడైన రామునితో నీకు విరోధము మంచిది కాదు;" అన్నది చివరగా తార.

"తారా! నా తమ్ముడు, పైగా నా శత్రువు గర్జిస్తూ నన్ను కయ్యానికి పిలుస్తుంటే నన్ను చేతులు ముడుచుకొని కూర్చోమంటావా! వీరుడైన వానికి అంతకన్నా మరణమే నయం.



"ఇక రాముని విషయ మంటావా! ఆ విషయంలో నీకు దిగులు అవసరం లేదు. రాముడు ధర్మజ్ఞుడు, కృతజ్ఞుడు అని నీవే చెప్తున్నావు కదా! అలాంటివాడు పాపము ఎలా చేస్తాడు? అధర్మంగా ఎలా ప్రవర్తిస్తాడు?" అంటూ ముందుకు నడిచాడు వాలి.

తార వాలిని వెంబడించి అడుగులు వేస్తోంది. వాలి వెనుదిరిగి తారను చూశాడు. "ఇంకా నా వెనుకే వస్తున్నా వెందుకు? నీకు నా మీదున్న ప్రేమను, భక్తిని చూపావు కదా! చాలు. వెనుదిరిగి అంతఃపురం లోకి వెళ్ళు.

"నేను వెళ్ళి సుగ్రీవునితో పోరాడుతాను. వాడికి బుద్ధి చెబుతానే గాని ప్రాణం తీయను. నీవు వెళ్ళు. నా వెంట రాకు" అన్నాడు వాలి.

పోయేవాళ్ళు పోతూ ఉంటారు. ఎవరుమాత్రం ఎంతవరకు వెంట నడుస్తారు? "నావెంట రావద్దు" అంటున్నాడు వాలి తారతో. అంతేమరి! ఇక అతని ప్రయాణము ఒంటరి ప్రయాణమే.

**తంతు తారా పరిష్వజ్య వాలినం ప్రియవాదినీ**

**చకార రుదతీ మన్దం దక్షిణా సా ప్రదక్షిణమ్**

"ప్రియముగా మాట్లాడునది, నేర్పు గలది అయిన తార మెల్లగా ఏడుస్తూ వాలిని కౌగలించుకుంది. అతనికి ప్రదక్షిణం చేసింది."

భర్తకు విజయాన్ని కాంక్షిస్తూ స్వస్త్యయనాది మంత్రాలు పలికింది. చింతాక్రాంతురాలైంది. సఖులతో కలిసి అంతఃపురములోకి వెళ్ళింది.

తాను చేయవలసిన ప్రయత్నాలన్నీ చేసింది తార. భర్త తన మొండిపట్టును విడిచిపెట్టలేదు. ఇక చెప్పి లాభం లేదని భావించింది. తనవి హితవచనాలే అయినా అరణ్యరోదనమే నని భావించి తన భాషణాన్ని సాగించకుండా త్రుంచేసుకుంది.

భర్తకు నచ్చచెప్పాలని అనేక విధాల ప్రయత్నించింది. అదికూడా కటువుగా కాకుండా ప్రియంగా, నేర్పుతో మాట్లాడింది. ఆమెలోని విశిష్టమైన ఈ లక్షణాలను చూచి ప్రియవాదివి, దక్షిణ (నేర్పు గలది) అని వాల్మీకి తారను స్తుతించాడు.

భర్త ఎలాగూ వినడం లేదని గ్రహించిన తార భగవంతుని ప్రార్థించాలని భావించి, తనను తాను కుదుట పరచుకుంది. స్వస్త్యయనము చేసి లోనికెళ్ళింది.

ప్రథమదర్శనం లోనే తార పాత్ర ఎంతో జాజ్వల్యమానంగా ప్రకాశించింది. ఆమె మాటను, మనసును ఎంతగానో శ్లాఘించాడు వాల్మీకిమహర్షి. విషయాన్ని బాగా ఆకళింపు చేసుకోవడమే కాక విషయాన్ని బాగా అందించగలిగింది కూడాను.

"సాధు" అనే పదంతో తన అభిప్రాయాన్ని వినిపించేందుకు ప్రారంభమైన తార "సాధు" అనే పదాన్ని ఉచ్చరిస్తూ తన భాషణాన్ని సమాప్తి చేయడం కూడా గమనించదగిన విషయం.

'సాధు' అంటే బాగుగా అని అర్థము. విషయ విశదీకరణలో, విశ్లేషణములో ఉపక్రమోపసంహారముల యందు తార బాగుగా వర్తించిందని, ప్రవర్తించిందని భావము. కానీ ఏమిలాభం?

**న రోచతే తద్వచనం హి తస్య కాలాభిపన్నస్య వినాశకాలే**

ఉపయుక్తమైన, హితకరమైన మాటలను పలికింది తార. కానీ వినాశకాలము దాపురించడం వల్ల ఆ మాటలు వాలికి రుచించలేదు అంటాడు ఆదికవి.

## వాలివధ

తార లోనికి వెళ్ళింది. పగబట్టిన జాతిసర్పము లాగా బుసలు కొడుతూ వాలి బయటకు వచ్చాడు. శత్రువును అన్వేషిస్తూ నలువైపులా చూశాడు. వస్త్రాన్ని గట్టిగా బిగిస్తూ నిలబడి యున్న సుగ్రీవుని చూశాడు వాలి.

వాలికి క్రోధం తీవ్రమైంది. తానుకూడా బట్టను బిగించి కట్టాడు. పిడికిటిని పైకెత్తి సుగ్రీవుని వైపుకు పరుగెత్తాడు. సుగ్రీవుడు కూడా పిడికిలి ఎత్తిపట్టి వాలి వైపుకు దుమికాడు.

"బాగా చూడు. పెద్దదైన ఈ పిడికిలిని చూడు. ఎలా బిగించి ఉన్నానో చూడు. నా పిడికిలి నీమీద పడగానే నీ ప్రాణాలు నిన్ను విడుస్తాయి" అన్నాడు వాలి.

"నీవు కూడా ఆలోచించుకో. నీ తలపై నా పిడికిలి పడగానే, ఆ పడిన చోటే నీ జీవితానికి నిష్క్రమణ ద్వారము అవుతుంది. జాగర్త" అన్నాడు సుగ్రీవుడు.



ప్రథమంగా వాలి సుగ్రీవుని కొట్టాడు. ఆ దెబ్బతో సుగ్రీవుని దేహం పగిలి, పర్వతం నుండి సెలయేళ్ళు ప్రవహించునట్లు, సుగ్రీవుని దేహం నుండి రక్తం స్రవించసాగింది.

క్రుద్ధుడైన సుగ్రీవుడు దగ్గరే యున్న మద్దివృక్షాన్ని పెకలించి, వజ్రాయుధంతో పర్వతాన్ని కొట్టినట్లు వాలిని కొట్టాడు. ఆ దెబ్బకు వాలి కదలిపోయాడు. వర్తకులు ప్రయాణం చేసే ఓడ వస్తువుల భారంతో కదలిపోవునట్లు చలించిపోయాడు వాలి.

వాలిసుగ్రీవులు పరస్పరము తీవ్రంగా హింసించు కొంటూ పోరాడారు. వాలి ద్విగుణీ కృతమైన పౌరుషముతో యుద్ధము చేస్తున్నాడు. కానీ సుగ్రీవుడు శక్తిహీను డైనట్లు గోచరించాడు.

అయినా సుగ్రీవుడు వెనుకాడలేదు. పౌరుషంతో మళ్ళీ కలియబడ్డాడు. కొమ్మలున్న చెట్లను చేతపట్టుకొని కొట్టుకున్నారు. గోళ్ళతో గీక్కొంటూ, పిడికిళ్ళతో గుద్దుకుంటూ, మోకాళ్ళతో పొడుచుకుంటూ, పాదాలతో తన్నుకుంటూ భయంకరంగా పోరాడారు.

వాలిసుగ్రీవుల దేహాలు రక్తమయ మయ్యాయి. అయినా పోరాటపటిమ తగ్గలేదు. ఇరువురు మేఘగర్జనం చేస్తూ పరస్పరం ఢీకొని పోరాడారు.

సుగ్రీవుడు బాగా అలసిపోయాడు. అటూ ఇటూ దిక్కులు చూడసాగాడు. ఓటమి సుగ్రీవుని వక్షం చేరిందని రాముడు గ్రహించాడు.



కష్టాల ఊబిలో చిక్కుకొని వున్న సుగ్రీవుని రక్షించాలని రాముడు నిర్ణయించుకున్నాడు. వాలిని వధించడానికి సిద్ధపడ్డాడు. క్రూరసర్పం వంటి బాణాన్ని ధనుస్సు మీద సంధించాడు.

వింటినారిని లాగడం వల్ల కలిగిన శబ్దానికి భయపడి మృగాలు, పక్షులు పారిపోయాయి. మరుక్షణమే పిడుగువంటి బాణాన్ని రాముడు విడిచాడు. భయంకరమైన ఆ బాణము వాలి వక్షస్థలంపై వాలింది.

వెంటనే వాలి పడిపోయాడు. ఆశ్వయుజపూర్ణిమ నాడు ఉత్సవం పూర్తయిన పిదప నేలమీద పడగొట్టబడిన ఇంద్రధ్వజం లాగా వాలి నేలమీద పడిపోయాడు. తెగిపడిన మ్రానులా కూలిపోయాడు.

రామబాణము వాలిని భూమిపై కూల్చివేసినా వాలిలో సౌందర్యము తగ్గలేదు. ప్రకాశము క్షీణించలేదు. ప్రాణాలు విడిచి వెళ్ళలేదు. ఇంద్రుడిచ్చిన శ్రేష్ఠమైన సువర్ణమాలయే ఈ శోభ కంతటికీ కారణము.

క్రిందపడిన సూర్యునివలె ఉన్న వాలిని రామలక్ష్మణులు సమీపించారు. వాలి రామలక్ష్మణులను చూచి ఈవిధంగా పలికాడు.

**పరాఙ్ముఖ వధం కృత్వా కోఽత్ర ప్రాప్తస్త్వయా గుణః**
**యదహం యుద్ధ సంరబ్ధస్త్వత్కృతే నిధనం గతః**

"నేను ఇంకొకనితో యుద్ధం చేస్తుండగా నీవు కొట్టిన బాణంతో నేను మరణిస్తున్నాను. నీవైపు గాకుండా, మరొకవైపు చూస్తున్న వానిని కొట్టావే! దీనివల్ల నీవు ఏమి సాధించావు?"

రామబాణము తగిలిన తరువాత ఇది వాలి పలికిన మొదటి మాట. వాలివధ ఒక విచిత్రమైన గాథ. వాలి వధించబడ్డాడు ఆనాడు. కానీ వాలివధ ఇంకా సాగుతూనేవుంది. వివాదాలతో ఇంకా కొనసాగుతూనే వుంది. ఈ వివాదాలకు చైతన్య రామాయణం తెర పడేస్తుంది అని నేను భావించడం లేదు. ఒకవేళ తెరపడితే మాత్రం అది రామానుగ్రహమే.

రామునివైపు కాకుండా తాను మరొకవైపు తిరిగి వుండగా రాముడు బాణంతో కొట్టాడు అంటున్నాడు వాలి. కానీ రాముడు విడిచిన బాణము వక్షస్థలంలో గుచ్చుకున్నది అన్నాడు వాల్మీకి. ఇక్కడ నుండి ప్రతి విషయాన్ని చక్కని అవధానంతో అనుసరిస్తూ అర్థం చేసుకోమని అభ్యర్థిస్తున్నాను.

వాలి రామునితో పలుకుతున్నాడు. "రామా! సత్కులజాతుడవు. బలశాలివి. తేజోవంతుడివి. నియమశీలివి. కరుణామయుడివి. ప్రజాహితాసక్తుడవు. జాలిగుండె కలవాడివి. సమయాసమయాలు తెలిసినవాడివి. - నిన్నుగూర్చి అందరూ ఇలా చెప్పుకోవడం నేను విన్నాను.

"నీవు రాజువేనా! అయితే జితేంద్రియుడవై ఉండాలి. ఓర్పు కలిగి ఉండాలి. ధర్మము, ధైర్యము, బలము, పరాక్రమము, అపకారముచేసిన వానిని శిక్షించుట- ఇవి నీ సొమ్ములై ఉండాలి.*

* అపకారము చేసిన వానిని రాజుగా రాముడు శిక్షించుటను వాలి అంగీకరిస్తున్నట్లేనా?

"రామా! ఈ గుణాలన్నీ నీలో ఉన్నాయని నేను విశ్వసించాను. అందుచేతనే వెళ్ళవద్దని తార అడ్డుపడినా వినకుండా సుగ్రీవునితో పోరాడాలని వచ్చాను.

"నీవు నాకు కనిపించలేదు. మరొకరితో యుద్ధం చేస్తున్న నన్ను నీవు కొట్టవని భావించాను. అంతవరకు నిన్ను ధర్మచింతన గలవానినిగా గుర్తించాను కదా!

"నీ బుద్ధి చెడ్డదని నాకేం తెలుసు? ధర్మధ్వజాన్ని ధరించిన అధర్మపరుడవని నేనెప్పుడు ఊహించాను? పాపాచరణము కలవాడివని, గడ్డి మూసిన బావి లాంటి వాడివని నిన్ను నేను ఊహించలేదే?

"సాధువుల రూపంలో కన్పించే దుష్టుడవు నువ్వు. నివురు కప్పిన నిప్పువి. ధర్మముసుగులో చరించే వంచకుడివి.

"ఇంతకీ, నిన్ను నేను హింసించానా! అవమానించానా! నీ దేశానికి చెడు చేశానా! ఫలమూలాదులు భుజించి జీవించే వానరుణ్ణి. నన్ను ఎందుకు చంపావు? పైగా, మరొకనితో పోరాడుతున్నానే గాని నీతో కాదు.

"రామా! నీ వేషానికి, నీ కార్యానికి పొత్తుందా! దుర్మార్గుడవైనా సన్మార్గుని వలె రాణిస్తున్నావు. కామక్రోధాల పుట్టలా తెలుస్తున్నావు. బుద్ధిమాంద్యంతో ధనుస్సున్నదని ఎదుటివారి బ్రతుకుల్ని దహనం చేస్తున్నావు. దగా చేస్తున్నావు. ధర్మాన్ని దగ్ధం చేస్తున్నావు.

"నీది కామప్రవృత్తి. ధర్మార్థముల యందు నీకు అభిరుచి లేదు. నిరపరాధినైన నన్ను బాణంతో కొట్టి చంపావు. నిందార్హమైన ఈ పనిని రేపు సత్పురుషుల ముందు ఎలా సమర్థించుకుంటావు?

"నా చర్మము ఎవరికీ ఉపయోగపడదు. నా ఎముకలు, వెంట్రుకలు నిషిద్ధములని మహాత్ములు నిర్ణయించారు. నా మాంసాన్ని నీలాంటి ధర్మాత్ములు భుజించరు. మరి నువ్వు నన్ను ఎందుకు చంపినట్లు?*

"నా భార్య తార సత్యం పలికింది. హితం పలికింది. స్థిమితం లేకుండా ప్రవర్తించి నేనే యముని వలలో చిక్కిపోయాను.

"రామా! నువ్వు నీచుడివి. పరాపకారివి. పాపివి. దుష్టుడవైన నీవు దశరథుని పుత్రుడుగా ఎలా జన్మించావు?

"మేము నీకు మిత్రులమూ కాము. శత్రువులమూ కాము. ఏదీ గాకుండా ఉన్న మమ్మల్ని ఇలా ఎందుకు హింసించావు? ఈ పరాక్రమాన్ని నీ శత్రువుల విషయంలో చూపించవచ్చు కదా!

"రామా! నా ఎదుట నిలిచి నువ్వు యుద్ధం చేసి ఉంటే ఈపాటికి యముని ఎదుట ఉండేవాడివి. నాతో ఎదురు నిలిచి పోరాడలేక, మద్యాన్ని పానం చేసి నిద్రించువానిని పాము కరిచినట్లు నన్ను కొట్టి చంపావు.

"సుగ్రీవునికి మేలు చేయాలని ఈ నీచకర్మకు ఒడిగట్టావా! అలా చేస్తే సుగ్రీవుడు నీ భార్యను తెచ్చి నీకిస్తాడనా! ఆ విషయం ముందుగా నాకే చెప్పివుండకూడదా! దుర్మార్గుడైన

* ఒకవేళ అవి ఉపయోగములైతే చంపడం వల్ల దోషం లేదనే వాలి అభిప్రాయమా?



రావణుని వధించకుండా, మెడకు తాడు కట్టి, వాడ్ని ఈడ్చుకొని వచ్చి నీకు అప్పగించి ఉండేవాణ్ణి కదా!

"నా మరణానంతరము సుగ్రీవుడు రాజు కావచ్చు. అది ధర్మం కూడా. రామా! కానీ నువ్వు నన్ను ఇలా చంపడం మాత్రం ధర్మము కానేకాదు. నీవు చేసిన ఈ పనిని సమర్థించు కోగలవేమో ఆలోచించు;" అని పలికి, తీవ్రంగా గాయపడి ఉన్నందున మాట్లాడుటకు శక్తి లేనివాడై మిన్న కున్నాడు వాలి.

కాంతి నశించిన సూర్యుని లాగా, ఉన్న నీటినంతా కార్చేసిన మేఘం లాగా, శాంతించిన అగ్ని లాగా వానరశ్రేష్ఠుడైన వాలి భూమిపై పడి ఉన్నాడు. వాలికి సమాధానంగా రాముడు పలకడం ప్రారంభించాడు.

"వాలీ! ధర్మాధర్మాలు అవలోకించ కుండా, పెద్దలను అడిగి తెలుసుకోకుండా నోరున్నదని నీ ఇష్టమొచ్చినట్లు వాగుతున్నావు. వనాలతో, పర్వతాలతో, నదులతో కూడిన ఈ భూమి అంతా ఇక్ష్వాకు వంశీయులకు చెందింది. నిగ్రహానుగ్రహాలు వారి అధీనంలో ఉన్నాయి.

"ధర్మాత్ముడైన భరతుడు ఇప్పుడు ఈ భూమిని పాలిస్తున్నాడు. భరతుని ఆజ్ఞతో మేము చరిస్తున్నాము. నీవు అధర్మానికి శ్రీకారం చుట్టావు. కాదు. అధర్మపరుడవై మిగిలావు.

"జన్మను ప్రసాదించిన తండ్రి, ముందుపుట్టిన అన్న, విద్య చెప్పిన గురువు-వీరు ముగ్గురూ తండ్రులని ధర్మానుష్ఠానపరులు తెలుసుకోవాలి. అంతేకాదు.

"తరువాత పుట్టిన తమ్ముడు, తనువు నుండి ఉద్భవించిన పుత్రుడు, గుణవంతుడైన శిష్యుడు - వీరు ముగ్గురూ కుమారులే అని భావించాలి. ఇదంతా ధర్మమే.

"గ్రుడ్డివాని నుండి మరొక గ్రుడ్డివాడు ప్రకృతి సౌందర్యాన్ని గూర్చి ఆలకించినట్లు, కోతివైన నీవు కోతుల నుండి ఏమి ధర్మాన్ని గ్రహించి ఉంటావు? కోపంతో నన్ను అనవసరంగా దూషిస్తున్నావు. నిన్ను నేను ఎందుకు చంపానో చెప్తున్నాను. విను.

"ఓ వానరుడా! నువ్వు ధర్మాన్ని ఉల్లంఘించావు. తమ్ముడి భార్యను చేపట్టావు. అందుకే నిన్ను నేను వధించాను. సోదరుని భార్యను పొందిన నేరానికి నిన్ను ఇలా దండించడం జరిగింది. వాలీ! నేను చంపింది నిన్ను కాదు. నీ చెడు గుణాన్ని. రోగిని కాదు. రోగాన్ని.

"తమ్ముడైన సుగ్రీవుడు నీకు కొడుకు వంటివాడు. అతని భార్య రుమ నీకు కోడలు వంటిది. కోడలి వంటిదైన రుమను చేపట్టడం ధర్మాచారమునకు, లోకాచారమునకు విరుద్ధము.

"ధర్మబద్ధంగా రాజ్యపాలనము చేయు భరతుడు అధర్మపరులను సహించడు. మేము భరతుని ఆజ్ఞలను పాటిస్తున్నాము. అది మా ధర్మం. ధర్మానుసారమే నీకు దండన ఇవ్వబడింది. దానిని అంగీకరించు.

"వానరవీరా! నేరాలు చేసేవారిని, శిక్షలు విధించేవారిని దృష్టిలో ఉంచుకొని మనువు రెండు శ్లోకాలు చెప్పినట్లు నేను వినియున్నాను. అవి చెబుతాను. విను.

**రాజభిర్ధృత దణ్డాశ్చ కృత్వా పాపాని మానవాః**
**నిర్మలాః స్వర్గ మాయాన్తి సన్తః సుకృతినో యథా ॥** 1
**శాసనాద్వాపి మోక్షాద్వాస్తేనః పాపాత్ప్రముచ్యతే**
**రాజా త్వశాసన్ పాపస్య తదవాప్నోతి కిల్బిషమ్ ॥** 2

1. "పాపాలు చేసినవారు రాజదండనను అనుభవించగానే వారి పాపాలు ప్రక్షాళన మవుతాయి. ఆ తరువాత పుణ్యాత్ముల్లాగా వారు స్వర్గానికి వెళ్తారు.

2. "దొంగతనం చేసినందువల్ల దొంగకు పాపం కల్గుతుంది. రాజు దండించినా, లేదా విడుదల చేసినా దొంగ పాపవిముక్తుడు అవుతాడు. ఒకవేళ రాజు సరిగ దండన చేయలేకపోతే ఆ పాపము రాజుకు చుట్టుకుంటుంది- ఇలా చెప్పాడు ధర్మాన్ని మనువు.

"వాలీ! కాబట్టి నీవు దుఃఖించవలసిన పనిలేదు. మేము ధర్మానికి, శాస్త్రానికి కట్టుబడి యున్నాము. శ్రుతిని అనుసరించేవాడు నరుడు. మతిని అనుసరించేవాడు వానరుడు.

"వాలీ! నిన్ను చంపడానికి మరొక కారణాన్ని కూడా చెబుతున్నాను. విను. ఇది చాలా ముఖ్యమైంది అని నా భావన. ఇది నీకు బోధపడితే, క్రోధం నిన్ను బాధించదు.

"మానవులు మృగాల్ని వేటాడి చంపడం పరిపాటే కదా! మృగాల్ని ఎలా చంపినా దోషం లేదు. నీవు వానరుడవే కదా! నిన్ను చంపడంలో అధర్మ మేముంది?

"నీకు ధర్మం తెలియదు. నీవద్ద ధర్మం లేదు క్రోధం తప్ప. వంశానుక్రమంగా వస్తున్న ధర్మమార్గాన్ని చిత్తశుద్ధితో ఆచరిస్తున్న నన్ను అనవసరంగా క్రోధంతో దూషిస్తున్నావు;" అన్నాడు రాముడు.

**ఆపలీ నాఠవే అధర్మతా అధర్మ తేవిసీ మాఝె మాథా**
**అధర్మాచీ సంసర్గతా భాసె అశుద్ధతా శుద్ధత్వీ!**

"నీ అధర్మం నీకు తెలిసి రావడం లేదు. పైగా నా తలమీద అధర్మాన్ని రుద్దుతున్నావు. అధర్మ సంసర్గం వల్ల నీకు అజ్ఞానం జ్ఞానంలా కన్పిస్తోంది" అంటాడు రాముడు వాలితో భావార్థరామాయణంలో.

వాలిలో తీవ్రంగా అంతర్మథనం జరిగింది. ధర్మావగాహన ఏర్పడింది. రాముని యందు దోషము లేదని తెలిసింది. వాలి రాముణ్ణి చూశాడు. చేతులెత్తి నమస్కరించాడు.





"రామా! నీవు చెప్పిందంతా నిజమే. సత్యమే. ఇందులో సందేహం లేదు. నీవు ధర్మాత్ముడవు. ధర్మ మనేది చాలా గొప్ప విషయము. నాలాంటి నీచుడు ధర్మాన్ని గూర్చి ఏం చెప్పగలడు?

"నేను ఆవేశంలో ఏదేదో మాట్లాడాను. అనరాని మాటలు అన్నాను. అనవసరంగా దూషించాను. అవి మనసులో పెట్టుకోకు. నన్ను తప్పు పట్టకు.

**మమాప్యవగతం ధర్మాత్ వ్యతిక్రాన్త పురస్కృతమ్**
**ధర్మ సంహితయా వాచా ధర్మజ్ఞ పరిపాలయ**

"రామా! ధర్మాత్మా! నేను ధర్మభ్రష్టుణ్ణి. ధర్మమును అతిక్రమించిన వాడను. అట్టి నాతో ధర్మవచనాన్ని పలుకు. నన్ను క్షమించానని చెప్పు. చాలు.

"రామా! నా బాధంతా నన్ను గూర్చి కాదు. తారను గూర్చి కాదు. అంగదుని గూర్చే. చిన్నప్పటి నుండి చాలా గారాబంగా పెంచాను. నేను కనిపించకపోతే నీళ్ళు లేని చెరువులాగా శుష్కించిపోతాడు.

"అంగదుడు పసివాడు. లోకానుభవం లేనివాడు. నాకు ఏకైక పుత్రుడు. ఎలాగైనా అతడ్ని నీవు రక్షించాలి;" అన్నాడు వాలి.

దురభిమానంతో, కామంతో వాలి తన జీవితాన్ని పాడుచేసుకున్నా, చివరగా ప్రాణం పోయే ముందు చాలా చక్కని ఆలోచనలు సాగించాడు. ఆదర్శాన్ని లోకానికి అందించాడు.

తాను వక్రమార్గంలో జీవించి బ్రతుకును అన్యాయం చేసుకున్నాడు. తన బిడ్డ అంగదుడు అనుకరణ సహజాతంతో తనను అనుకరిస్తాడేమో నని భయపడతాడు. అంగదుడి భారాన్ని, బాధ్యతను రామునికి అప్పగించాడు వాలి.

బిడ్డల్ని భగవంతునికి అప్పగించాలి. బ్యాంకులకు కాదు. సంతానాన్ని ధర్మం చేతిలో ఉంచాలేగాని ధనం చేతిలో కాదు. తాము చెడినా బిడ్డల బ్రతుకుల్ని బాగుచేయాలని ఆలోచించేవారే నిజమైన తల్లిదండ్రులు.

"రామా! భరతలక్ష్మణులను నువ్వు ఎలా చూసుకుంటావో సుగ్రీవాంగదులను కూడా అలాగే చూసుకో.

తార తప్పు ఎరుగని స్త్రీ. ఆమె నిరపరాధి. నిర్దోషి. నా దోషానికి తార కారణమని సుగ్రీవుడు పొరపాటున భావిస్తాడేమో! ఆమెను అవమానిస్తాడేమో! అది జరగకుండా చూడు.

"నన్ను బయటకు వెళ్ళవద్దని తార బ్రతిమాలుకుంది. అయినా నేను వినకుండా వచ్చాను. నీ చేతుల్లో మరణించే భాగ్యానికి నోచుకున్నాను" అని ఇక మాట్లాడుటకు శక్తి లేనివాడై మౌనం వహించాడు వాలి.

వాలి రాముల మధ్య జరిగిన సంవాదమును తులసీ ఏక్‌నాథ్‌లు అత్యంత రమణీయంగా, భావ సౌందర్యముతో రచించారు.

**ప్రభు అజహూఁ మై పాపీ అంత్‌కాల్ గతి తోరి ॥**

"ప్రభూ! అంత్యకాలములో నిన్ను దర్శించే నేను పాపిని ఎలా అవుతాను?" అని వాలి రాముని ప్రశ్నిస్తాడు. రామబాణంతో ప్రాణాలు విడిచేవాడు పాపాత్ము డవుతాడా? అని ఆశ్చర్యాన్ని వ్యక్తం చేస్తాడు వాలి.

"వాలీ! నీవు పావం చేశావు. అందులో సందేహం లేదు. కానీ నీవు చేసిన పుణ్యం కూడా గొప్పదే. అందువలన నా చేతిలో మరణించి పాపవిముక్తిని పొందావు.

"ధర్మాత్ముడైన సుగ్రీవుడి సోదరుడుగా పుట్టడమే నీవు చేసిన పుణ్యము" అంటాడు రాముడు.

ఆ మాట వినగానే వాలికి కనువిప్పు కలుగుతుంది. సుగ్రీవునికి తాను చేసిన కీడు మనసులో స్ఫురిస్తుంది. పశ్చాత్తాపంతో కుమిలిపోతాడు వాలి.

సుగ్రీవుని దగ్గరగా రమ్మని సైగ చేస్తాడు. సుగ్రీవుడు సమీపించగనే, "సుగ్రీవా! నీకు తీరని ద్రోహం చేశాను. అయినా నీవల్లే నాకు సద్గతి లభించింది. నన్ను క్షమించు నాయనా!" అని కన్నీళ్ళు పెట్టుకుంటాడు వాలి.

సుగ్రీవుడు రోదిస్తూ,"అన్నా! నీవు నా విషయంలో ఏ పొరపాటూ చేయలేదు. పైగా ఎవ్వరూ చేయలేని మేలు చేశావు. నీవు నన్ను తరిమి కొట్టకుండా ఉంటే నాకు రామ దర్శన మయ్యేదేనా? భగవద్దర్శనం ఎవరు చేయించగలరు గురువుతప్ప. నీకు జన్మ జన్మలకు నేను ఋణపడి ఉంటాము" అని వాలి పాదాలపై పడతాడు సుగ్రీవుడు. ఇలా ఒకరినొకరు పరస్పరం ప్రేమతో కౌగలించుకొని ఆనందబాష్పాలు విడిచే సందర్భములో వాలి కన్నుమూస్తాడు. ఇవి ప్రమాణాలు కాకపోయినా హృదయానికి ఎంతో ప్రమోదాన్ని కల్గిస్తాయి.

"వాలీ! నిన్ను వధించినందుకు నాకు మనస్తాపము లేదు. నీవు నన్ను దూషించినందుకు నాకు బాధా లేదు. నీవు మహాపాపాలు చేశావని భావించకు. మేము అనవసరంగా నిన్ను వధించామని తలచకు.

"తారాంగదుల విషయంలో నీవు దుఃఖించకు. ఇకపోతే, మేము ధర్మానుసారంగానే నిన్ను వధించాము. దీనివల్ల నీ పాపాలన్నీ హరించాయి.

త్యజ శోకం చ మోహం చ భయం చ హృదయే స్థితమ్
త్వయా విధానం హర్యగ్ర్య న శక్యమతి వర్తితుమ్

"వానరశ్రేష్ఠుడా! నీ హృదయంలో ఉన్న శోకాన్ని, మోహాన్ని, భయాన్ని విడిచిపెట్టు. దైవ నిర్ణయాలను ఎవరూ తప్పించుకోలేరు.

"అంగదుణ్ణి గూర్చి ఆలోచించకు. నీనుండి అంగదుడు ఎలాంటి సుఖాన్ని పొందేవాడో అలాంటి సుఖాన్ని నామండి, సుగ్రీవుని నుండికూడా పొందుతాడు;" అని పలికాడు రాముడు.

"రామా! శరఘాతముచే బాధపడుతూ నిన్ను ఏవో ఏవో మాటలన్నాను. నన్ను క్షమించు. నిన్ను వేడుకుంటున్నాను" అన్నాడు వాలి.



# ధర్మ మీమాంస

రామాయణంలో అనేక యుద్ధాలు జరిగాయి. అనేకమంది మరణించారు కూడా. గొప్ప వీరులు కూడా మరణించారు. కానీ వాలివధ ఒక్కటే వివాదాస్పదమైంది. ఇంకా అవుతూ ఉంది.

"నీవు అధర్మం చేశావు" అని వాలిని రాముడు విమర్శించాడు ఆనాడు ఒక్కసారి. "నీవూ అధర్మం చేశావు. అధర్మాన్ని ఆచరించడం నీకు తగునా?" అని ఆనాటి నుండి నేటివరకు రాముని ఎందరో ప్రశ్నిస్తున్నారు. దీనిపై అనేకములైన వాదాలు వినిపిస్తూ ఉంటాయి.

"రాముడు వాలిని చంపడం ధర్మమా? అధర్మపరుడైన వాలిని చంపడం న్యాయమే. అలాంటప్పుడు వెనుక నుండి ఎందుకు చంపాలి? తన స్నేహితుడైన సుగ్రీవుని సుఖం కొరకు వాలిని అధర్మంగా చంపడమేనా? సుగ్రీవుని సుఖాన్ని మాత్రం రాముడు ఎందుకు వాంఛిస్తున్నాడు? సీతాన్వేషణలో సహకరిస్తాడు సుగ్రీవుడు అనే కదూ? అయితే తన సుఖానికి రాముడు వాలిని చంపాడా? ఇదే వాస్తవమైతే, ధర్మమనే పదానికి అర్థం మిగులుతుందా? స్వార్థమే ధర్మమైతే, రావణాసురుని తప్పు పట్టగలమా?" ఇలాంటి ప్రశ్నలు దొంతరలుగా వచ్చి ముందు నిలుస్తాయి ఈ సమస్యను కదిపితే.

ఇప్పటికే మోయలేని విధంగా వాదాలు వినిపిస్తుంటే, నా వాదంతో మీకు భారాన్ని అధికం చేస్తానేమో అనే భయం నా అంతర్యంలో చలిస్తోంది. ఈ సంశయం తలయెత్తింది కనుక సాధ్యమైనంత వరకు విషయాన్ని జటిలం చేయకుండా సున్నితంగా స్పృశించి నా అవగాహనను మీముందు ఉంచుతాను.

రామసుగ్రీవుల మైత్రి జరిగే నాటికి రాముడు కష్టాల ఊబిలో కూరుకపోయి ఉన్నాడు. కన్నీటి వాగులో మునిగిపోయి ఉన్నాడు. సీతను అన్వేషిస్తూ ఆవేదనతో కుమిలిపోతున్నాడు.

విధి విజృంభించి రాముని కబంధహస్తాలలో బంధించింది. పురుషప్రయత్నంతో బంధాలను ఛేదించుకున్నాడు రాముడు. కానీ సీత లభించినపుడే తన బ్రతుకులో అందాలు చిగురిస్తాయి.

సీతాన్వేషణలో రామునికి సహకరించ గలవాడు సుగ్రీవుడే అని చెప్పి కబంధుడు పుణ్యలోకాలకు వెళ్ళాడు. రాముడు సుగ్రీవుని వెతుక్కుంటూ ఋష్యమూకము వద్దకు వచ్చాడు. హనుమంతుని సహాయంతో రామసుగ్రీవుల మైత్రి జరిగింది.

ఇది చాలా ఆదర్శమైన మైత్రీబంధము. రామసుగ్రీవు లిద్దరూ రాజ్యభ్రష్టులు. భార్యలను పోగొట్టుకున్నవారు. శోకములో మునిగి యున్నవారు. దారి ఏమిటో తెలియని స్థితిలో ఉన్నవారు. స్వరాజ్యానికి దూరులైన వారు. ఇలాంటివారు స్నేహితులు కావడంలో ఆశ్చర్య మేముంది? సమప్రవృత్తి లేదా సమవృత్తి గలవారి మధ్యే కదా స్నేహము?

కబంధుని సలహా ప్రకారం రాముడు సుగ్రీవుని వద్దకు వచ్చాడు. సుగ్రీవుని దీనావస్థను చూశాడు. వాలి అధర్మపరుడని గుర్తించాడు. వాలిని వధించాలనే నిర్ణయానికి వచ్చాడు రాముడు.

ఇక్కడ ఒక్క విషయాన్ని మనం గమనించాలి. వాలిని చంపమని సుగ్రీవుడు అడగలేదు. రాజ్యం కావాలని కూడా సుగ్రీవుని మనసులో లేదు. వాలి అపహరించిన తన భార్య రుమను ఎలాగైనా తిరిగి పొందాలనేదే అతని రంధి.

వాలి తనకు అపకారం చేస్తాడేమో అనే సంశయంతో భయపడుతున్నాడు సుగ్రీవుడు. తనకు అభయాన్ని ప్రసాదించమని రాముని ప్రార్థించాడే గాని వాలిని వధించమని చెప్పలేదు.

రాముడు స్వతంత్రించి "నీ భార్యను అపహరించిన వాలిని బాణాల్తో కూల్చే స్తాను" అన్నాడు. కనుక వాలిని వధించడ మనేది రాముని సంకల్పమే గాని సుగ్రీవుని అభీష్టము కాదు, ఈ దశలో.

దశ అంటే జ్ఞాపక మొస్తోంది. రామాయణగాథ ప్రధానంగా రెండు దశల మధ్య నడిచిన గాథ. ఒకటి దశరథుడు కాగా రెండవది దశకంఠుడు.

ఇద్దరూ గొప్పవారే. ఇద్దరూ విషయపిపాసకు లోనైనవారే. ఇద్దరూ కామాన్ని జయించలేని వారే. అయితే ఒకరు కామాన్ని ధర్మబద్ధంగా అనుభవించారు. మరొకరు అధర్మంగా అనుభవించారు.

రావణుని అంతఃపురంలో అందమైన స్త్రీలు వేలసంఖ్యలో ఉన్నారు. వీరంతా రావణుడు మోహించి తెచ్చుకున్నవారే. రావణుని ఆటబొమ్మలే. కీలుబొమ్మలే.

దశరథుని అంతఃపురంలో కూడా తక్కువేమీ లేరు. ముచ్చటగా, ముఖ్యంగా ముగ్గురు తెలుస్తున్నా, మూడువందలయాభై మంది స్త్రీలు అంతఃపురములో ఉన్నారు. వారంతా దశరథుని భార్యలే.

కాకపోతే, రావణుడు స్త్రీలను అధర్మంగా అపహరించి తెచ్చుకున్నాడు. దశరథుడు ధర్మబద్ధంగా వరించి తెచ్చుకున్నాడు. అంతే తేడా. ధర్మబద్ధమైన కామమును శాస్త్రము సమర్థిస్తుంది. అధర్మంతో కూడిన కామాన్ని నిరసిస్తుంది.

**ధర్మా విరుద్ధో భూతేషు కామోఽస్మి భరతర్షభ**

"జీవులందలి ధర్మవిరుద్ధము కాని కామము నేనే" అని శ్రీకృష్ణపరమాత్మ భగవద్గీతలో చెప్పి, ధర్మయుతమైన కామము నిషిద్ధము కాదు అని తెలిపాడు.

కామము నిషిద్ధము కాకపోవచ్చు. కానీ ప్రసిద్ధము మాత్రము కాదు. యుద్ధము చేసైనా మనసు మండి తరిమిగొట్ట వలసిందే.

ధర్మవిరుద్ధము కాని కామము దశరథునిది. ధర్మవిరుద్ధమైన కామము దశకంఠునిది. ఈ రెండూ కామము యొక్క దశలే. ఒకటి ఆరంభంలో తెలుస్తూ ఉంది. మరొకటి అంత్యంలో కనిపిస్తోంది. ఈ మధ్య నడిచేదే రామాయణ గాథ. రాముని గాథ. ధర్మగాథ. ధర్మబోధ.



రాముడు కామాన్ని జయించాడు. ధర్మాన్ని ఆశ్రయించాడు. కామం పంచే భోగాలను త్యజించాడు. ధర్మం పెట్టే బాధల్నే వరించాడు. కామంతో సుఖించడం కన్నా ధర్మంతో మరణించడం మేలని భావించాడు. అందుకే రాముడు ధర్మావతారంగా కీర్తించబడ్డాడు.

ధర్మమైనా, అధర్మమైనా కామము మోహము వల్లనే పుడుతుంది. రాగము కామము వల్ల ఏర్పడుతుంది. కామరాగాల్ని శ్రీశంకరాచార్యులవారు బహుచక్కగా నిర్వచిస్తారు.

**కామః తృష్ణా అసన్నికృష్టేషు విషయేషు**

"లేని దాని కొరకు కదిలే కోరిక కామము."

**రాగః రంజనా ప్రాప్తేషు విషయేషు**

"ఇదివరకే ఉన్న దానియందు ఆసక్తి రాగము."

దశరథునిది రాగబంధము. రావణునిది కామబంధము. రెండూ మోహబంధాలే. మాయాబంధాలే. దుఃఖరూపాలే.

దశరథుడు రాగకారణంగా మరణిస్తే, రావణుడు కామకారణంగా మరణిస్తాడు. మోహమునకు గమ్యము మరణమే. రామాయణము నందు ఆద్యంతాలలో ఈ రెండే నిలిచి ఉన్నాయి.

ఇవే రెండు దశలు. దశరథుడు, దశకంఠుడు అనే దశలు. ఒక దశ అంతరించగనే అరణ్యవాసము ప్రారంభ మవుతుంది. రెండవ దశ అంతరించగనే అరణ్యవాసము సమాప్త మవుతుంది.

ఈ రెండు దశల మధ్య నడిచేదే సాధకుని సాధనాదశ. అదే అరణ్యవాసము. ధర్మాన్ని ఆధారంగా పట్టుకొని కామాన్ని, మోహాన్ని నిరోధించే నిర్మలదశ. నిత్యదశ.

**తీర్త్వా మోహార్ణవం హత్వా రాగద్వేషాది రాక్షసాన్**
**యోగీ శాంతి సమాయుక్తః ఆత్మా రామో విరాజతే ॥**

"ఆత్మజ్ఞాని మోహసాగరాన్ని దాటి, రాగద్వేషాది రాక్షసుల్ని సంహరించి, ఆ తరువాత శాంతిని పొంది ఆత్మారాముడై శోభిస్తున్నాడు" అని నిత్యమైన రామకథను ఒక్కశ్లోకంలో నింపి చక్కగా ప్రవచించారు"ఆత్మబోధ" ప్రకరణగ్రంథంలో ఆదిశంకరాచార్యులవారు.

దశరథుని రాగముతో కూడిన మరణముతో ప్రారంభమై, దశకంఠుని కామముతో కూడిన మరణముతో సమాప్తమయ్యే ఈ రెండు దశల మధ్య శ్రీరాముని తాపసజీవనము మనకు గోచరిస్తుంది.

రాగానికి దూరమై అరణ్యాలకు చేరిన రాముడు, కామాన్ని వధించి తిరిగి అయోధ్యకు చేరుతాడు. జీవితమంతా ఏ సన్నివేశంలో చూచినా ధర్మమూర్తిగా జాజ్వల్యమాన మవుతాడు.

రాముని జీవితం అడుగడుగునా త్యాగమయం. బ్రతుకంతా ధర్మమయం. ప్రేమమయం. జ్ఞానమయం. ధర్మం కొరకు కష్టాల్ని కొనితెచ్చుకున్న రాముడు సుఖం కోసం అధర్మమార్గాన చరిస్తాడా!

యుద్ధకాండలో ఒక క్లిష్టదశలో రావణుడు రథాన్ని, ధనుర్బాణాల్ని పోగొట్టుకొని నిరాయుధుడై నిలుస్తాడు. ఆ సమయంలో రాముడు ఎదురుగా నిలబడి బాణాన్ని ఎక్కుపెట్టి ఉన్నాడు. వారిని చెవిదాకా లాగితే చాలు. రావణుడు శ్మశానంలో ఉంటాడు. కానీ రాముడు ఆ పని చేయలేదు. రావణుడి పోరాటపటిమను ప్రశంసించాడు. విశ్రాంతి తీసికొని మరునాడు యుద్ధానికి రమ్మని పంపించాడు. అదీ రాముడంటే.

తన భార్యను అపహరించినవాడు నిరాయుధుడై ఎదుట నిలబడినపుడు చంపకుండా వదలిపెట్టిన ధర్మాత్ముడైన రాముడు, సుగ్రీవుని భార్యను అపహరించిన వాలిని అధర్మంగా చంపుతాడా? ఒక్కక్షణం మంచి మనసుతో ఆలోచించమని విమర్శకులను చైతన్య రామాయణం కోరుతోంది.

ఇక వాలివధను విశ్లేషిద్దాం.

రుమను వాలి అపహరించాడని సుగ్రీవుని ద్వారా వినగానే ధర్మాత్ముడైన రాముడు వాలిని వధిస్తానని సుగ్రీవుడు అడగకుండానే చెప్పేశాడు.

తనకు జరిగిన అన్యాయమే సుగ్రీవునికి కూడా జరిగింది. తనకు అన్యాయం చేసిన రావణుని కూల్చేస్తానని శపథం చేసి బయలుదేరిన రామునికి మధ్యలో సుగ్రీవుడు తటస్థపడ్డాడు. తన కథను విప్పి చెప్పాడు. సుగ్రీవునికి న్యాయం చేయకుండా రాముడు తనకు ఎలా న్యాయం చేసుకోగలడు? ఎదురైన అవరోధాన్ని నిరోధించకుండా తాను ఎదురుచూసే అవరోధాన్ని ఎలా తొలగించగలడు? ఒకవేళ అలా చేస్తే రాముడు ధర్మమూర్తి అవుతాడా? స్వార్థమూర్తిగా మిగలడా?

యౌవరాజ్య పట్టాభిషేకాన్ని కాలదన్ని, ధర్మానికి పట్టాభిషేకం చేయాలని కానల్లో ప్రవేశించిన రాముడు సుగ్రీవునికి పట్టాభిషేకం చేయకుండా ఎలా ఉండగలడు?

అయితే, సీతాన్వేషణలో సుగ్రీవుడు తనకు సహకరిస్తాడు అనేకదా రాముడు వాలిని వధించింది?

ఈ ప్రశ్నను లేవనెత్తి రామునిపై అపరాధాన్ని మోపాలనే దానికన్నా మించిన ఘోరాపచారము మరొక టుండదు. సీత ప్రసక్తి రాకముందే అధర్మపరుడైన వాలిని వధిస్తానని రాముడు తనకు తానే చెప్పాడు. వాలిని చంపడమనే కర్మ ద్వారా మోహాన్ని కూర్చోబెట్టి, రావణుని వధించడమనే కర్మ ద్వారా మోహాన్ని శాశ్వతంగా పడుకోబెట్టాలని రాముడు సంకల్పించాడు. ఇది ఫలితాన్ని ఊహించని మహోత్తమ కార్యము.

సీతాన్వేషణలో తనకు సుగ్రీవుడు సహకరిస్తాడనే ఉద్దేశ్యముతో కనుక రాముడు వాలిని వధించి ఉంటే, నిజానికి రాముడు వాలితోనే స్నేహాన్ని కట్టుకొనేవాడు. వాలి కూడా రాముని నిందించే సమయంలో ఇదే సూచించాడు.

"రామా! సుగ్రీవునికి మేలు చేయాలని భావించి దేని కొరకు నన్ను వధించావో, ఆ కార్య సాధనకై ముందుగా నీవు నాకు చెప్పివుంటే, నీ భార్యను అపహరించిన దుర్మార్గుడైన ఆ దశకంఠుని కంఠానికి త్రాడుకట్టి ఈడ్చుకొనివచ్చి చంపకుండా నీ ముందు పడేసి వుండేవాడిని" అంటాడు వాలి రామునితో అర్భకుని లాగా.



రామబాణంతో మైకం కప్పిన వాలికి తాను ఏమి మాట్లాడుతున్నాడో, ఎవరితో మాట్లాడుతున్నాడో తెలిసిరాలేదు. తన భార్యను అపహరించిన రావణుని జయించుట కొరకు సుగ్రీవుని భార్యను అపహరించిన వాలిని రాముడు ఆశ్రయించాలా! ఆహా! ఎంత వ్యర్థమైన మాట! అనర్థమైన మాట! రాముడు సీతనైనా మరచిపోతాడేమో గాని ధర్మాన్ని మాత్రం విడిచిపెట్టడు అని ఆ కపిశ్రేష్ఠునికి తెలియదు పాపం.

కనుక రాముడు వాలిని వధించింది తన కొరకు కాదు. సుగ్రీవుని కొరకూ కాదు. కేవలం ధర్మం కొరకే అనే విషయంలో ముందుగా మీరు నాతో ఏకీభవించాలి.

ధర్మం కొరకు రాముడు వాలిని వధించాలని భావించాడు. అనుకోకుండా దాని ద్వారా సుగ్రీవుని సమస్య కూడా పరిష్కారమైంది. రాముడు ధర్మాశ్రయుడు. అధర్మపరుడైన రావణుడు పరస్త్రీలను అపహరించడమనే కార్యాన్ని చూసి తీవ్రంగా రాముడు కలత చెంది యున్నాడు.

రుమను వాలి అపహరించిన విషయం చెవిని పడగానే, దేనిని ప్రతిఘటిస్తూ తాను బయలుదేరాడో అలాంటి విషయమే ఇక్కడ ఎదురైంది.

కానీ ఈ విషయం రామునికి సంబంధించింది కాదు. దీనిని కష్టపడి పరిష్కరించడం వల్ల రామునికి ఒరిగేది కూడా లేదు. ఐనా, రాముడు వాలిని చంపాడు. ఎందుకని? ధర్మం కోసం. స్వార్థం కోసం కాదు.

వాలిని వధించడం దోషం కాదని తేలిపోయింది కదూ! ఇక మన ముందున్న అతి ముఖ్యమైన ప్రశ్న! రాముడు వాలిని చెట్టు వెనుక నిలబడి ఎందుకు చంపాలి? లేదా దాగియుండి ఎందుకు చంపాలి? ప్రచ్ఛన్నంగా నిలిచి చంపడం ధర్మమా!

ఇంతకీ, రాముడు వాలిని దాగిఉండి చంపినట్లేనా? అదలా ఉంచండి. రాముడు వాలిని ప్రచ్ఛన్నంగా ఉండే వధించాడు అని నిర్ణయించిన సంస్కృత వ్యాఖ్యాతలు అలా చేయడానికి గల కారణాన్ని కూడా వివరించారు.

**తదా విదిత తదీయ ప్రభావతయా వాలీ ప్రహ్వో భవేత్-**
**తదా తద్వధోం న యుక్తః ప్రతిజ్ఞా చ వ్యాహన్యేత్,**
**తదుద్ధారా తన్మిత్రం రావణోఽపి శరణం వ్రజేత్,**
**దేవకార్య చ లుప్యేత్, అతః ప్రచ్ఛన్నో వాలిన మవధీత్ !**

ఇది భక్తశిఖామణి శ్రీ గోవిందరాజులు వ్యాఖ్య.

వాలిని వధిస్తానని రాముడు సుగ్రీవునికి మాట ఇచ్చి ఉన్నందున ఈవిధంగా చంపకూడని రీతిలో వాలిని వధించడం జరిగిందని నిర్ణయించిన గోవిందరాజీయం అటు తరువాత కారణాన్ని విశదపరుస్తూ పై విధంగా వ్యాఖ్యానించడం జరిగింది.

"వాలికి ఎదురుగా నిలబడి వధించేందుకు రాముడు ప్రయత్నించగనే రాముని ప్రభావానికి తలవంచి వాలి శరణాగతుడు కావచ్చు. అప్పుడు తన మిత్రుడైన సుగ్రీవునికి ఇచ్చిన వాగ్దానం విచ్ఛిన్నం కాదా! అంతేకాదు. ఇది ఇలా జరుగగానే, వాలి స్నేహితుడైన రావణుడు కూడా వచ్చి రాముని కాళ్ళమీద పడి "నేను నిన్ను శరణంటున్నాను. నన్ను

క్షమించు" అంటే, అప్పుడు రాముని అవతార వైశిష్ట్యమే పోతుంది కదా! అందుచేత రాముడు ప్రచ్ఛన్నుడై వాలిని వధించాడు" అని తన నిర్మల భక్తిహృదయంతో కొండను త్రవ్వారు గోవిందరాజులు.

ఇది సబబేనా? అసలు రాముని అవతారము ఎందు కొచ్చినట్లు? అవతార వైశిష్ట్యములో దుష్టశిక్షణ ప్రధానాంశము కాదు. సాధు సంరక్షణము, ధర్మ సంస్థాపనము - ఈ రెండే అవతార వైభవములో ఉపక్రమోపసంహారాలు. మధ్యలో దుష్టశిక్షణ జరిగిపోతుంది.

పోనీ, దుష్టుణ్ణి ఎందుకు శిక్షించాలి? శిష్టులైన వారిని వాడు శిక్షిస్తున్నాడు కనుక. హింసిస్తున్నాడు కనుక. ధర్మచ్యుతికి పాల్పడుతున్నాడు కనుక. అంతేనా!

అయితే, దుష్టుడు మారితే ఏమి జరుగుతుంది? సాధుసంరక్షణము, ధర్మసంస్థాపనము జరిగినట్లే కదా! పైగా దుష్టునిలో పరివర్తన జరిగి దుష్టుడు శిష్టు డైనట్లే కదా!

చెడ్డవాడు మారడం మంచిదా! చావడం మంచిదా! మారడు కనుక చావడం మంచిది. సామాన్యంగా చచ్చేలా లేనపుడు పైన చెప్పిన రెండు కారణాలను సాధించే కార్యంలో, భగవంతుడు అవతారము నెత్తి ఈ మూడవది అయిన దుష్టశిక్షణను చేస్తాడు.

ఒకవేళ చెడ్డవాడు మారిపోయే పరిస్థితి వచ్చినపుడు వాణ్ణి ఎందుకు చంపాలి? అవతారము దేనికొరకు వచ్చిందో అది సాధించబడినట్లే గదా! రాముణ్ణి చూసినపుడే గదా వారు మారి శరణాగతు లైంది! అది అవతార వైభవమే గదా! మరి గోవిందరాజులు అలా ఎందుకు భావిస్తారు? రాముడు అవతార మెత్తినాడు కనుక వాలి, రావణాదులు చావాల్సిందే గాని మారేందుకు అవకాశం లేదు. వారిని మారనివ్వం. అవసరమైతే రాముణ్ణి చెట్టుక్రిందకో పుట్ట వెనక్కో పట్టుకపోతాము. లేదా మోసుకుపోతాము అని చెప్పడం ఏమిటో! నాకు మాత్రం మ్రింగుడు పడడం లేదు. ఈ విషయాన్ని పాశ్చాత్యులు ఎలా పరిగణిస్తారో ఆలోచించడం చాలా ప్రధానమైన విషయమని మీకు మనవి చేస్తున్నాను.

ఈ విషయాన్ని అవాల్మీక రామాయణాల్లో ఆయా రచయితలు తీవ్రంగా పరిగణించినట్లు ఉన్నారు. యుద్ధకాండలో విభీషణ శరణాగతి సమయంలో రామునిచేత అందంగా ఒక మాట చెప్పిస్తారు.

"అయ్యా! విభీషణుడు 'శరణు' అనగానే లంకానగరాన్ని ఇస్తానని ప్రతిజ్ఞ చేశావు కదా! ఒకవేళ రావణుడే వచ్చి శరణని పలికితే ఏం చేస్తావు?" అని రాముని ప్రశ్నించినపుడు,

"రావణుడు వచ్చి నన్ను శరణు వేడాలే కాని, అయోధ్యను రావణుని కిచ్చి, నా ముగ్గురు తమ్ములతో కలిపి మళ్ళీ అడవికి వెళ్ళి జీవిస్తాను" అని శరణాగత వత్సలుడైన రామునిచేత పలికిస్తారు.

సరే ఇంతకీ, వాలిని వెనుకనుండి ఎందుకు చంపినట్లు? ఇది అర్థం కావాలంటే, వాలిని రాముడు మొదటసారి ఎందుకు చంపలేదు? అనేది అర్థం కావాలి.

"సుగ్రీవా! కిష్కింధకు పోదాం పద. నువ్వు ముందు నడువు. నీవు నామమాత్రంగా నిలబడి వాలిని యుద్ధానికి పిలువు" అన్నాడు రాముడు.



ఇక్కడ రాముని మనోభిప్రాయ మేమిటి? సుగ్రీవుని నామమాత్రంగా ఉండమన్నాడు. అంతేగాని పోరాడమని చెప్పలేదు. సుగ్రీవుడు కూడా అలాగే భావించి ఉంటాడని నేను ఊహిస్తున్నాను.

"సుగ్రీవా! పద నాయనా! కిష్కింధకు పోదాం పద. నువ్వు వెళ్ళి వాలిని యుద్ధానికి పిలువు. వాలి నిన్ను తుక్కు తుక్కుగా కొడితే చూడాలని ఉంది" అని రాముడు ముందుగా చెప్పి ఉన్నట్లయితే, సుగ్రీవుడు గుడ్డ బిగించి ఉండేవాడేనా? ఈ తుక్కు స్నేహ మెందుకని, నిప్పును ఆర్పేయమని ఆంజనేయునికి చెప్పి, క్షణంలో చెట్టెక్కి కూర్చోని ఉండేవాడు.

సుగ్రీవుడు వాలిని పిలవాలి. అంతే. నామమాత్రంగా నిలబడి ఉండాలి. చాలు. వాలి రాగానే రాముడు కూడా ముందుకొచ్చి వాలికి ఎదురు నిలవాలని భావించి ఉంటాడు.

అదే వాస్తవమైతే, వాలి రాగానే రాము డెందుకు రాలేదు? పైగా సుగ్రీవుని చితక బాదుతున్నా రాముడు వచ్చి ఎందుకు ఆదుకోలేదు?

ఈ విషయాన్నే సుగ్రీవుడు ప్రశ్నించాడు. దానికి రాముడు చెప్పిన సమాధానం: "మీరిద్దరూ ఒకే విధంగా ఉన్నారు. ఎవరు సుగ్రీవుడో, ఎవరు వాలో నేను గుర్తించలేక పోయాను.

"తీరా బాణం వదలిన తరువాత అది నీకు తగిల్తే నా జీవిత మేమవుతుంది?" ఇదీ రాముడు చెప్పిన సమాధానం.

ఈ సమాధానంతో తృప్తి చెందాడు సుగ్రీవుడు ఒకవైపు వాలి కొట్టిన దెబ్బలు బాధిస్తున్నా. రాముడు చెప్పిన సమాధానం మీకు అంగీకారమేనా? ఏమో! నా మటుకు నేను ఆ సమాధానంతో తృప్తి చెందలేను.

సుగ్రీవుని రాముడు గుర్తించలేక పోయాడు అనేది నమ్మశక్యం గాని విషయంలా ఉంది. వాలిసుగ్రీవుల మధ్య తేడా రామునికి అవగతం కాలేదు అనడం, అందువల్లనే బాణప్రయోగం చేయలేక పోయినట్లు చెప్పడం అసంగతంగా తోస్తోంది.

మనమే గుర్తు పట్టగలం. అలాంటప్పుడు రాముడు గుర్తు పట్టలేడు అంటే ఎవరు నమ్ముతారు? ఏముంది అక్కడ గుర్తించడానికి? కొట్టేవాడు వాలి. తినేవాడు సుగ్రీవుడు. అంతే కదూ!

సుగ్రీవుడు మహాయోధుడు. అలాంటి వీరుని అంత చులకనగా మాట్లాడడం బాగలేదు. వాలి వంటి బలశాలి కాకపోవచ్చు. అంతమాత్రాన సుగ్రీవు డేమైనా బలహీనుడా! ఇది తన జీవితసమస్య కనుక ప్రాణాలకి తెగించి పోరాడి ఉండవచ్చు. దెబ్బలు తినేవాడు సుగ్రీవుడు అని నిర్ణయించడం సబబేనా! అందుకనే రాముడు బాణంతో కొట్టలేదు. ఇదేకదూ! మీరు నాపై చేసే పూర్వపక్షం!

అయితే ఇంకొక విషయం చెబుతాను. పోనీ, కొట్టే వాడెవరో, తినే వాడెవరో రాముడికి తెలియక పోవచ్చు. చివరగా పరిగెత్తే టప్పుడైనా తెలియలేదా రాముడికి? పరిగెత్తే పరాక్రమ వంతుడు తన చెలికాడే నని.

ఒకవైపు సుగ్రీవుడు మతంగవనం వైపు దౌడుతీస్తూ ఉంటే, తాను పూర్వము మాయలేడి వెంట పరిగెత్తినట్లు, సుగ్రీవుని వెంట పరుగెత్తేవాడు వాలి అని కూడా రాముడు గ్రహించలేక పోయాడా? మరి అప్పుడెందుకు చంపి ఉండకూడదు?

అదికూడా మరచిపోదాం. రాముడు చెట్టు వెనుక దాగియున్నాడు కదా? ఆయన ప్రక్కనే చెలిమి కలిపిన హనుమంతుడు ఉన్నాడు కదా! ఆంజనేయుణ్ణి అడిగి ఉంటే వాలి ఎవరో సుగ్రీవు డెవరో చెప్పేవాడు కదా! పోనీ ఆ పనైనా చేశాడా రాముడు! సుగ్రీవుని దేహం పచ్చిపుండులా, మాగిన పండులా అయ్యేవరకు చూస్తూనే ఉన్నాడు.

తినగలిగినంత వరకు సుగ్రీవుడు తిని వస్తే, మీలో ఎవరెవరో నేను గుర్తు పట్టలేక పోయావని రాముడు త్రేపడం ఏం బావుంది? మీ విషయం ఏమో గాని, నా వరకు నాకు వచ్చలేదు.

"వాలిని వధిస్తాను" అని రాముడు సుగ్రీవుడు అడగక ముందే చెప్పాడు. అయితే ఎలా చంపాలని భావించాడు? అనే విషయంలో రాముడు భిన్నాభిప్రాయాలను వ్యక్తం చేసి ఉన్నాడు.

**అమోఘాః సూర్యసంకాశా నిశితా మే శరా ఇమే**
**తస్మి న్వాలిని దుర్వృత్తే పతిష్యన్తి రుషాన్వితాః**

"అమోఘము లైనవి, సూర్యునితో సమాన మైనవి, తీక్షణమైనవి అయిన నా బాణములను నేను వాలిపై ప్రయోగిస్తాను;" అని శ్రీమద్రామాయణము నందలి కిష్కింధా కాండము లోని 10వ సర్గ 32వ శ్లోకంలో రాముడు పలికాడు.

కిష్కింధకు వెళ్ళక ముందు, వాలిని చూడక ముందు రాముడు ఈవిధంగా మాట్లాడాడు. వాలిపై బాణములను ప్రయోగిస్తాను అనే వాక్యాన్ని మనం జాగ్రత్తగా పరిశీలించాలి.

'బాణములు' అనే బహువచనాన్ని ఎప్పుడు వాడాడో వాలితో ఎదురెదురుగా నిలబడి యుద్ధం చేయాలనే రాముడు భావించాడు. అప్పుడే బాణములను ప్రయోగించే అవకాశము ఏర్పడుతుంది. ప్రక్కనుండో, వెనుకనుండో ప్రచ్ఛన్నంగా కొట్టేటట్లయితే బాణములు అవసరం లేదు. ఒక్క బాణము సరిపోతుంది.

సుగ్రీవుడు కిష్కింధలో వాలిని యుద్ధానికి పిలిచాడు. వాలి వచ్చాడు. ఇరువురూ కలిసి పోరాడుతున్నారు. అయినా రాముడు బాణాన్ని ప్రయోగించలేదు. అలా చేయడానికి కారణం రాముడు చెప్పినట్లు వాలిసుగ్రీవులు ఒకే విధంగా ఉండడం మాత్రము కాదు.

వాలియొక్క పరాక్రమాన్ని ఇప్పుడే రాముడు ప్రథమంగా చూశాడు. ఎదురు నిలబడితే మాత్రం వాలి రాముల మధ్య యుద్ధము కొన్ని రోజులైనా సాగుతుంది. వాలి అలాంటి బలవంతుడు.

వాలిని వధించలేము అనే సంకోచం రాముని మదిలో ఏ కోశానా లేదు. రాముడు ఆలోచించే విషయం వేరు. వాలికి ఎదురుగా నిలిచి రోజుల తరబడి చంపడమా! లేదా ఒకే బాణంతో కొట్టి చంపడమా!



సుగ్రీవుడు రుమ కోసం తీవ్రంగా బాధపడుతున్నాడు. రోజుల తరబడి యుద్ధం సాగుతూ ఉంటే, సుగ్రీవుని శోకం పొడిగింపబడుతూ ఉండడమే గాక వృద్ధి చెందుతూ కూడా ఉంటుంది. అది రామునికి ఇష్టముండదు.

**"చిరం దుఃఖస్య పాపిష్ఠం "**

" దుఃఖాన్ని ఎక్కువకాలం భరించడం కష్టము" అని సుమంత్రునితో చెప్పి, దశరథుడు రథాన్ని ఎందుకు ఆపలేదని అడిగితే, వినిపించలేదని రాముడు చెప్పమనిన విషయాన్ని మనము అయోధ్యాకాండములో చూసి యున్నాము.*

ఈ రెండు మార్గాలలో వాలిని ఎలా చంపాలి? అని రాముడు ఆలోచిస్తూ ఉండిపోయాడు. ఈ లోగా వాలి తనివితీరా సుగ్రీవుని కొట్టడం, సుగ్రీవుడు పారిపోవడం కూడా జరిగింది.

లక్ష్మణ హనుమంతులతో కలిసి కిష్కింధలో సుగ్రీవుని చూసే లోగా రాముడు ఆలోచించుకున్నాడు. ఆలస్యాన్ని సుగ్రీవుడు భరించలేడు కనుక వాలిని ఒకే బాణంతో కూల్చేయాలని నిర్ణయించుకున్నాడు.

ప్రథమపోరాటములో చంపకపోవడానికి ఏదో ఒక కారణాన్ని చెప్పదలచుకున్నాడు కనుక ఇద్దరూ ఒకేలా ఉన్నారని చెప్పి సుగ్రీవుని నమ్మించాడు. ఈసారి గజపుష్పలతను గుర్తుగా ధరించమన్నాడు.

గెలిచినవాడు మాలను ధరిస్తాడు. గెలవకముందే సుగ్రీవుని ధరించమన్నాడు. అలా చేయడం సుగ్రీవుని గుర్తుపట్టుటకు అని రాముడు చెప్పాడు. కానీ అది కానేకాదు. అది జయమాలే. జయము సుగ్రీవునిదే అనే భావం తోనే రాముడు దానిని ధరింప చేశాడు. అదికూడా ఆంజనేయునికి చెప్పకుండా లక్ష్మణునికి చెప్పాడు.

సుగ్రీవునికి తాను విజయాన్ని సమకూర్చి పెడతాడు. తన ప్రతినిధిగా లక్ష్మణుని పంపి సుగ్రీవుని కంఠాన్ని అలంకరించమన్నాడు రాముడు. అదికూడా గజపుష్పలతతో. వాడిపోయిం దనుకున్న జీవితం వికసించ బోతోంది అని సుగ్రీవునికి తెలుపడానికే రాముడు అలా చేశాడు. అది బైటకు చెప్పేశాడు కూడా.

**అద్య వాలి సముత్థం తే భయం వైరం చ వానర**
**ఏకే నాహం ప్రమోక్ష్యామి బాణమోక్షేణ సంయుగే ॥**

"సుగ్రీవా! ఈరోజు నేను ఒకే ఒక్క బాణాన్ని ప్రయోగించి వాలి వలన నీకు ఏర్పడిన భయాన్ని, వైరాన్ని తొలగిస్తాను" అన్నాడు రాముడు, పద్నాల్గవ సర్గ లోని పదవ శ్లోకంలో.

ఒక్క బాణంతో చంపుతానని పలకడం, అదికూడా ఈరోజే అనడంలో రాముడు ఒక నిర్ణయానికి వచ్చినట్లు మనకు స్పష్టంగా తెలిసిపోయింది.

ఈ నిర్ణయానికి రావడం వెనుక సుగ్రీవుని దుఃఖాన్ని పొడిగించడం ఇష్టం లేకనే గాని, వాలిని ఎదురుగా చంపలేక మాత్రము కాదు. రాముని వద్ద ఉన్న అస్త్రశస్త్రాలు ఎలాంటివో, విశ్వామిత్ర అగస్త్యాదులు ప్రసాదించిన దివ్యాస్త్రాలు ఎలాంటివో మనం చూసియే ఉన్నాము.

---

* చైతన్య రామాయణము - ప్రథమభాగము 222వ పుటను పోల్చుకోగలరు.

**Owing to the protective virtue of Indra's necklace, Rama could not have met Vaali face to face and vanquished him, just as Ravana could not be conquered by Gods. Rama could kill V ali only when himself unseen.**

"వాలికి ఇంద్రుడు ప్రసాదించిన రత్నహారము రక్షణగా మెడలో ఉన్నంత వరకు రాముడు వాలికి ఎదురుగా నిలబడి వాలిని వధించలేడు, రావణుని దేవతలు వధించలేనట్లు. అందుచేతనే రాముడు వాలిని ప్రచ్ఛన్నంగా ఉండే వధించగలిగాడు" అంటాడు రాజగోపాలాచారి తన ఆంగ్ల రామాయణంలో.

రాముణ్ణి మానవుడుగా చిత్రించాలనే ప్రయత్నంలో అనవసరంగా వాలిని దేవుణ్ణి చేశాడు రాజాజీ. ఎంతో రసవత్తరంగా కథ చెప్పిన రాజాజీ ఈ ఒక్కచోట ఎందుకో అలా మాట్లాడేశారు.

వాలికి ఎదురుగా నిలబడి రాముడు వధించలేడు అనడం కంటే వాలి చావడు, చిరంజీవి అంటే బావుండేది. వాలికి వరాలు ఉండొచ్చు. అంతమాత్రాన చావును అధిగమించగలడా? మృత్యుంజయుడు కాగలడా?

వాలికి మృత్యువు అనివార్యం అయినప్పుడు ఆ మృత్యుకారణాన్ని రాముడు చేజిక్కించుకోలేడు అనడం సమంజసమా! పైగా దేవతలు రావణుని జయించలేనట్లు, రాముడు వాలిని జయించలే డనడం ఏం బావుంది? ఈ ఉపమానం చప్పగా ఉండడమే గాక తలనొప్పిని కూడా కల్పిస్తోంది.

రావణుణ్ణి వాలితో పోల్చడం బావుంది. రాముణ్ణి దేవతలతో పోల్చడం ఏమీ బాగులేదు. పోనీ ఆ ఉపమానాన్ని బట్టి చూసినా దేవతలు రావణుణ్ణి సంహరించ లేకపోవచ్చు. రాముడు సంహరించాడు కదా! రావణుణ్ణి సంహరించినట్లే వాలిని కూడా వధిస్తాడు రాముడు. మరి అసాధ్య మేమిటి?

ఇక్కడ ఒక విషయాన్ని రాజాజీ మరచిపోయారు. అరణ్యకాండములో శరభంగ మహాముని ఆశ్రమానికి సీతారామలక్ష్మణులు చేరే సరికి ఇంద్రుడు ఆకాశంలో నిలిచి రాముని వైభవాన్ని చెప్పిన విషయాన్ని మనం చూసియే ఉన్నాము. గొప్ప కార్యాన్ని రాముడు సాధిస్తాడని, ఆ తరువాత తాను రాముని దర్శిస్తానని ఇంద్రుడు చెప్పడం కూడా మనము విన్నాము.

రాముని పరాక్రమాన్ని గూర్చి ఇంద్రాదులే అలా కీర్తిస్తూ ఉంటే, ఇంద్రుడు ఇచ్చిన హారము ప్రభావం వల్ల వాలిని రాముడు వధించ లేడనడం నిర్హేతుకంగా కన్పిస్తోంది.

వాలిని అధర్మపరుడుగా రాముడు నిర్ణయించాడు. ధర్మాత్ముడైన సుగ్రీవునికి సహాయం చేయాలని, వాలిని వధించాలని భావించాడు. ఆలస్యం జరగకుండా తొందరగా ముగించాలని అభిలషించాడు.

త్వరగా చంపాలనుకున్నాడే గాని ఎదురుపడాలని అనుకోలేదు. దాగి కొట్టాలని తలచలేదు. అధర్మపరుణ్ణి చంపడంలో పద్ధతులు, ప్రక్రియలు అవసరమని రాముడు భావించలేదు. వాలితో యుద్ధం చేయడానికి రాముడు రాలేదు. అధర్మపరుడైన వాలిని



చంపాలనే వచ్చాడు. వచ్చిన పని పూర్తి చేశాడు. రాముడు చెట్టు చాటున దాగి కనుక వాలిని బాణంతో కొట్టి ఉంటే, నాకు తోచిన మరొక వాదాన్ని గూర్చి కూడా నేను మీకు వినిపించి ఉండేవాణ్ణి. కానీ రాముడు చెట్టు మాటున దాగి కొట్టినట్లు ఆధారాలు లేవు.

మొదటిసారి కిష్కింధకు వచ్చినపుడు, సుగ్రీవుడు వాలి చేతుల్లో దెబ్బలు తిని పారిపోయినపుడు రాముడు చెట్టుమాటున నిలబడి వాలి పరాక్రమాన్ని చూసింది నిజమే. రెండవసారి వచ్చినపుడు రాముడు చెట్టుమాటున దాగినట్లు లేదు.

వాల్మీకంలో పదమూడవ సర్గ ప్రారంభంలో రామసుగ్రీవులు కిష్కింధకు రెండవసారి బయలుదేరుతారు. పదహారవ సర్గ చివరలో ముప్పై ఐదవ శ్లోకంలో వాలిపై రాముడు బాణాన్ని వదిలాడు. అంటే, రామసుగ్రీవులు వనం నుండి బయలుదేరినది మొదలు కిష్కింధలో రాముడు వాలిపై బాణప్రయోగం చేసే వరకు మధ్యలో 118 శ్లోకాలు నడిచాయి. ఈ నూట పద్దెనిమిది శ్లోకాల్లో రాముడు చెట్టుమాటున దాగినట్లు ఎక్కడా చెప్పలేదు.

రాముడు వాలిపై బాణప్రయోగం చేశాడు. చెట్టుమాటున నిలిచి మాత్రం కాదు. రాముడు వింటి నారిని లాగినపుడు ఆ శబ్దానికి మృగాలు, పక్షులు కూడా భయపడి చెల్లా చెదరైనట్లు చెప్పాడు వాల్మీకి.

మేఘగర్జనంలా ధ్వనించిన ఆ శబ్దం వాలికి వినిపించలేదా! రాముడు విడిచిన బాణం వక్షస్థలాన్ని ఛేదించినట్లు వాల్మీకి చెబుతాడు. "నేను మరొకవైపు తిరిగి ఉంటే నన్ను కొట్టావు" అంటాడు వాలి. మరొకవైపు తిరిగి ఉంటే బాణం వక్షస్థలాన్ని ఎలా తాకింది?

సుగ్రీవునితో పోరాడడములో వాలి గుర్తించకపోవచ్చు కానీ రాముడు మాత్రం ప్రచ్ఛన్నంగా ఉండి మాత్రం కొట్టలేదు. వాలిపై రాముడు బాణాన్ని సంధించడాన్ని వాలి గమనించలేదు. అంతే.

కనుక వాలి వధ విషయంలో రాముడు అనుసరించిన పద్ధతి అధర్మమని గాని, అయుక్తమని గాని చెప్పేందుకు వీలులేదు. ఈ సత్యాన్ని వాలికూడా గ్రహించాడు కనుకనే, తన తప్పిదానికి క్షమించమని రాముని వేడుకున్నాడు. శరణాగత వత్సలుడైన రాముడు కరుణించాడు. ఈవిధంగా, మహావీరుడైన వాలి భూలోకంనుండి అంతర్హితు డయ్యేందుకు సిద్ధంగా ఉన్నాడు. మాట, చూపు సన్నగిల్లుతున్నాయి. మనసేదోలా అయిపోతోంది.

## తారా విలాపము

రామబాణం వాలిని కూల్చేసింది అనే వార్త అంతఃపురంలో తారకు తెలిసింది. దారుణమైన ఈ వార్త ఆమె హృదయాన్ని ముక్కలు చేసింది. ఆమె సంశయించినట్లే జరిగింది. వెళ్ళవద్దని భర్తను ఎంతగానో ప్రాధేయపడింది. వినాశం ప్రాప్తించే కాలంలో ముందుగా మూతపడేవి వీనులే అంటారు. వాలి విషయంలో అదే సత్యమైంది.

తార ఏడుస్తూ బయటకు వచ్చింది. ధనుర్ధారి యైన రాముని చూసి వానరులంతా భయపడి అటూ ఇటూ పరుగెత్తడం తార చూసింది. వారితో ఇలా భాషించింది.

"ఓ వానరులారా! ఇంతకాలం శ్రేష్ఠపురుషుడైన ఏ వాలిని ఆశ్రయించుకొని జీవించేవారో అట్టి ప్రభువును వదలి ఎందుకు భయంతో పారిపోతున్నారు?

"రాజ్యము కోసం సుగ్రీవుడు రాముని ద్వారా వాలిని బాణంతో కొట్టించాడు. మీరెందుకు పారిపోతారు? మీ కేరాజ్యా లున్నాయని భీతి చెందుతున్నారు?" అని ప్రశ్నించింది తార.

దారుణమైన వార్త విని తీవ్రంగా కలత చెంది యున్న సమయంలో కూడా, చూశారా, తార ఎంత సంయమనంతో వ్యవహరించిందో! ఎంత సమయస్ఫూర్తితో ప్రసంగించిందో!

తార మాటలు వినివ వానరులు సమయానుకూలంగా విచిత్ర భాషణం చేశారు. లోకం పోకడకు అద్దం పట్టారు.

"మహారాణీ! నువ్వు ముందుకెళ్ళకు. మా మాట విను. యముడు రాముని రూపంలో వచ్చి నీ భర్త వాలిని తీసికొని పోతున్నాడు. నువ్వు ముందు నీ కొడుకు అంగదుణ్ణి రక్షించుకో.

**క్షిప్తాన్ వృక్షాన్ సమావిధ్య విపులాశ్చ తథా శిలాః**
**వాలీ వజ్రసమై ర్బాణై ర్వజ్రేణేవ నిపాతితః**

"రాణీ! వాలిమహారాజు రాముడి మీద పెద్ద పెద్ద వృక్షాలు విసిరి కొట్టాడు. పెద్దపెద్ద బండల్ని విసిరేశాడు. రాముడు వజ్రసమాన మైన బాణాలతో వాటిని పడగొట్టి చివరగా రాజుగారిని కూల్చేశాడు."

చూశారా! ఇలా ఉంటాయి గాలిపుకార్లు! రాముడి మీద వాలి పెద్దపెద్ద వృక్షాలు విసిరి వేశాడట. పెద్ద బండల్ని విసిరి కొట్టాడట. రాముడు వాటి నన్నిటిని బాణాలతో పడగొట్టాడట. నిజానికి ఇవన్నీ జరిగే ఉంటే రాముడు వాలితో యుద్ధం చేసినట్లే కదూ!

ఎద్దు ఈనింది అంటే దూడను కట్టేయమని చెప్పినట్లు, వాస్తవాలకన్నా చపలచిత్తు లుండే సమాజంలో అవాస్తవాలే చలామణి అవుతుంటాయి అని చెప్పడానికే వాల్మీకి ఈ కోతుల విపరీత వాక్కుల్ని ఉటంకించాడు.

"రాజుగారు రాలిపోగానే మన వీరులంతా వాలములు ముడిచేసి పారిపోయారు. ఇక నువ్వు ఎలా కాపాడుతావో! శూరుల్ని కాపలా పెట్టు. అంగదుణ్ణి రాజును చేసేయ్. మేమంతా అంగదుణ్ణి సేవిస్తాం.

"ఎందుకైనా మంచిది. నువ్వు పారిపో. ఇక్కడుంటే ప్రమాదమే. సుగ్రీవుడు ఊరుకుంటాడా! సైన్యంతో వచ్చి కోటలో పాగా వేస్తాడు. సుగ్రీవుని ప్రక్క నున్నారే, వాళ్ళకంతా మనవల్ల ముందు కష్టమైంది కదా! ఇప్పుడు, ఇక వాళ్ళు ఊరుకోరు;" అని అప్రస్తుత ప్రసంగా న్నంతా సాగించారు వానరులు. వాళ్ళ జాతివి మరొకరు సందేహించకుండా మాట్లాడారు. సంభాషణంతా వైరుధ్యమే. వైపరీత్యమే.

తార వానరుల అయోమయ ప్రలాపాలు విని చాలా భావగర్భితంగా మాట్లాడింది.

"వానరులారా! మహానుభావుడు, కపిసింహుడు అయిన నా భర్తే లేనపుడు పుత్రుని అవసరం నాకేముంది? రాజ్యము యొక్క అవసర మేముంది? నా ప్రాణాల యొక్క అవసర మేముంది? నా భర్త పాదాలే నాకు గమ్యము. నేను అక్కడికే వెళ్తాను;" అంటూ ధైర్యంగా ముందుకు నడిచింది.



రాముణ్ణి చూసి వానరవీరులంతా పరిగెత్తుతూ ఉంటే తార నిర్భయంగా ముందుకు నడిచింది. వీరుడైన వాలికి తగిన భార్య అనిపించుకుంది. పుత్రుడు గాని, రాజ్యం గాని, చివరికి ప్రాణాలు గాని భర్తకన్నా ఎక్కువేమీ కాదని చాటిన మహాపతివ్రత తార.

వాలి నేలపై పడి ఉన్నాడు. తార ఏడుస్తూ, తలను, గుండెను బాదుకుంటూ అక్కడికి చేరింది. కురిసి వెలిసిన మేఘం లాగా పడి ఉన్న భర్తను చూసి బిగ్గరగా రోదించింది. "ఆర్యపుత్రా!" అంటూ శోకాక్రాంతురాలై విరిగిన చెట్టు లాగా నేలపై పడింది.

అంగదుడు కూడా దుఃఖిస్తూ తండ్రి వద్దకు వచ్చాడు. గోరువంక లాగా తార రోదిస్తోంది. వారిద్దరిని చూసి సుగ్రీవుడు కూడా దుఃఖించాడు.

తార భర్తను సమీపించింది. వాలి శరీరాన్ని కౌగలించుకుంది. దుఃఖార్తురాలై విలపించింది.

"కపివీరా! నిన్ను ఎప్పుడైనా నేను బాధించానా! మరి నాతో మాట్లాడ వెందుకని? మహారాజా! నీవు గొప్ప వీరుడవు కదా! రాజువు కదా! రాజులు ఇలా మట్టిలో పడుకోవచ్చా! లే. మంచి శయ్యమీద పడుకుందువు గాని!

"వానరశ్రేష్ఠుడా! మాకు తెలియకుండా స్వర్గంలో అందమైన మేడను నిర్మించావా? ఇక మీదట అక్కడ శయనిస్తావు కదూ! లేకపోతే, మమ్మల్ని విడిచి ఎందుకు వెళ్తున్నావు?

"నాథా! నా హృదయం ఇంత కఠినమైంది అని ఇంతవరకూ నాకు తెలీదు. నువ్వు నేలమీద పడి ఉండడం చూసి కూడా అది ముక్కలు కావడం లేదు. ఎంత విచిత్రం!

"చూశావా! సుగ్రీవుని భార్య రుమను అపహరించి, రాజ్యం నుండి సుగ్రీవుని వెళ్ళ గొట్టిన ఫలితం ఎంత భయంకరంగా ఉందో! నేను ఎన్నోసార్లు చెప్పాను. నా మాట విన్నావా!

"సుందరా! ఇంతకాలం మా మనసుల్ని దోచుకున్నావు. ఇక మీదట అప్సరస్త్రీల హృదయాలను వశం చేసుకుంటావు. ఎవరికీ తలవంచని వాడివి. ఈనాడు కాలానికి తలవంచావా!

"నీ ఆశ్రయంలో దైన్య మేమిటో, దుఃఖ మేమిటో మాకు తెలియదు. ఈరోజు ఏమైందో చూశావా! దుఃఖమంతా నాదే. దైన్యమంతా నాదే. ఇక అనాథగా నేను జీవించాలి. వైధవ్యంతో బతకాలి.

"అంగదా! ఇలా దగ్గరికి రా! నాయనా! ఇలా రా! మీ నాన్నను బాగా చూడు. ఇక కనిపించడు నాయనా! దర్శనం చేసుకో!

"నాథా! రాముడు సుగ్రీవునికి ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నాడు. ఋణం తీర్చుకున్నాడు. గొప్ప కార్యాన్ని సాధించాడు.

"సుగ్రీవా! ఈనాడు నీ కోర్కె ఫలించింది. రుమ నీకు లభిస్తుంది. ఇక హాయిగా రాజ్యాన్ని అనుభవించు.

"నాథా! ఇంతగా నేను దుఃఖిస్తున్నా పలక వెందుకని? అంగదుణ్ణి విడిచి వెళ్ళడానికి నీ మనసు ఎలా ఒప్పుకున్నది? నేను నీకు ఏమి అపకారం చేశాను? పసివాడైన అంగదుడు చేసిన అపరాధ మేమి?

"తెలియక మేము చేసిన తప్పు లేవైనా ఉంటే క్షమించు. ఇదిగో నా తలను నీ పాదాల వద్ద ఉంచాను. ఒక్కసారి చూడు;" అని ఏడుస్తూ వాలితో పాటే దేహత్యాగము చేయడానికి సంసిద్ధమైంది తార.

భర్త మరణాన్ని భార్య భరించలేదు. అట్టి దుర్భర సమయంలో భర్తను, భర్త చర్యలను, ప్రేమను స్మరించుకుంటూ, పైకి చెప్పుకుంటూ భార్యలు దుఃఖించడం మనం చూస్తూనే ఉంటాం. తార కూడా అలాగే విలపించింది.

కానీ, గుండెల్ని పిండుతున్న దుఃఖంలో తార మాట్లాడిన మాటలు ఆమె మానసిక స్థాయికి అద్దం పడుతాయి.

సుగ్రీవుణ్ణి తార నిందించలేదు. నిర్దోషి అయిన సుగ్రీవునికి సంతోషం కలిగేలా రుమను స్వీకరించి, రాజ్యాన్ని పాలించమని చెప్పింది. తన భర్త సుగ్రీవుని విషయంలో అధర్మంగా ప్రవర్తించాడని తారకు తెలుసు.

సుగ్రీవుని కొరకు వాలిని వధించిన రాముణ్ణి కూడా తార ఒక్కమాట అనలేదు. ఆర్తజన రక్షకుడుగా, అధర్మపరులను శిక్షించు ధర్మమూర్తిగా రాముని శ్లాఘించింది. భర్త మరణానికి కారణమైన వ్యక్తిలోని ఔన్నత్యాన్ని, ముఖ్యంగా దుఃఖాక్రాంతులై ఉన్నప్పుడు ఎవరు చూడగలరు? అక్కడే తారావధము మన మనసులో మెదుల్తుంది.

వ్యక్తిగతంగా తన జీవితానికి జరిగిన అన్యాయానికి దుఃఖిస్తోంది. అలాగని భర్త యొక్క అధర్మ ప్రవర్తనను సమర్థించడం లేదు. న్యాయబద్ధంగా వ్యవహరించి తన భర్తను వధించిన వారిని నిందించే స్థితికి దిగజారలేదు. ఈ ధర్మదృష్టి, సత్యమార్గములే ఆమెకు మహాసాధ్వీమ తల్లులైన సీత, ద్రౌపది, అహల్య, మండోదరీల మధ్య సముచిత స్థానాన్ని కల్పించాయి.

ఆమె ధర్మబద్ధంగా ప్రవర్తించిందే గాని భర్తను న్యూనత పరచలేదు. రాజ్యం కన్నా, అంగదుని కన్నా, చివరికి తన ప్రాణాల కన్నా వాలి పాదాలే మహోన్నతములని భావించింది. భర్తతో పాటు ప్రపంచాన్ని వదలడానికి నిర్ణయించుకుంది. ప్రాయోపవేశానికి సిద్ధపడింది.

నేలపైబడి దుఃఖిస్తున్న తారను చూసి, ఆమెకు ఓదార్పును కల్పిస్తూ ఆంజనేయుడు ఇలా భాషించాడు.

"ఈ ప్రపంచంలో చావుపుట్టుకలు అస్థిరములని నీకు తెలియనిది కాదు. అనివార్యమైన మృత్యువును గూర్చి విచారించకుండా, శుభకరమైనది ఏదో దానిని గూర్చి ఆలోచించాలి.

"స్వర్గానికి వెళ్ళిన వాలిని గూర్చి గాక, ఇంతవరకు వాలిని ఆశ్రయించుకొని జీవిస్తున్న వారిని గూర్చి నీవు ఆలోచించాలి. వానర భల్లూక రాజ్యానికంతా ఇపుడు నీవే రక్షకురాలవు.

"అంగదసుగ్రీవులు తీవ్ర దుఃఖంతో కుమిలిపోతున్నారు. వారిని కార్యోన్ముఖుల్ని చేయాల్సిన బాధ్యత నీదే. నీ పర్యవేక్షణలో అంగదుడు రాజ్యాన్ని పాలించాలి. కుమారుని చేత తండ్రికి ప్రేతకార్యం జరిపించు.

"వాలికి అంతిమసంస్కారము, అంగదునికి రాజ్యాభిషేకము-ఈ రెండే నీ ముందున్న ప్రధాన విషయాలు. దుఃఖాన్ని మరచిపో. రాజైన అంగదుని చూసుకొని తృప్తి పడేందుకు మనసును సిద్ధం చేసుకో" అన్నాడు ఆంజనేయుడు.



"హనుమా! భర్తను పోగొట్టుకొనిన తరువాత వందమంది పుత్రులు ఉండి మాత్రం ఏం ప్రయోజనం? మరణించినా, స్త్రీకి భర్త నీడయే వాంఛనీయము.

"రాజ్యము విషయమునందు గాని, అంగదుని విషయమునందు గాని నేను అసమర్థురాలను. అవన్నీ చూసుకోవలసిన వాడు అంగదుని పినతండ్రి సుగ్రీవుడే. నా ముందున్న కర్తవ్యము ఒక్కటే. భర్త మరణించిన చోటే భర్తతో పాటు మరణించడం. అంతే;" అన్నది తార హనుమంతునితో.

## వాలి ప్రాణాలు గాలిలో

కొనఊపిరితో కొట్టుమిట్టాడుతున్నాడు కపివీరుడైన వాలి. శ్వాసలు చాలా మెల్లగా నడుస్తున్నాయి. ప్రాణాలు శక్తిహీన మయ్యాయి. తనకు ఎదురుగా ఉన్న సుగ్రీవుని చూశాడు వాలి.

"సుగ్రీవా! నా దోషాన్ని మనసులో పెట్టుకోకు. రానున్న కర్మఫలాలు నా బుద్ధిని వక్రమార్గంలో నడిపాయి. నాయనా! ఒకే కాలంలో మనిద్దరము సుఖపడేటట్లు లేదు మన నొసటి రాత.

"నేను పోతున్నాను ఒంటరిగా. అంగదుడు ఒంటరివాడు కాకుండా చూడు. అలా చూడు. అంగదుడు భూమిపై పడి ఎలా దుఃఖిస్తున్నాడో! అంగదుడు నాకు ప్రాణతుల్యుడు. అంతకంటే మిన్నయైన వాడు. అంగదునికి ఏ లోపం రాకుండా, లేకుండా చూసుకో.

"తార సూక్ష్మబుద్ధి కలది. సముచిత సలహాలు ఇవ్వగలదు. ఆమె చెప్పిన విషయాన్ని నిస్సంశయంగా చేయవచ్చు" అన్నాడు వాలి.

చేయి కాలిన తరువాత దేనిని పట్టుకొని మాత్రం సాధించే దేముంటుంది? తార సలహాను పాటించమని సుగ్రీవునికి చెప్తున్నాడు వాలి. ఆ పని తాను చేసుంటే ఈ దురవస్థ ప్రాప్తించేదేనా? సకాలంలో జరిగిన కార్యాలే సత్ఫలితా లిస్తాయి.

వాలి చెప్తున్నాడు. "సుగ్రీవా! రామకార్యంలో సంశయం లేకుండా వర్తించు. లేదా, అధర్మ మవుతుంది. అధర్మాన్ని రాముడు సహించడు. నీవు అధర్మంగా ప్రవర్తిస్తే, రాముడు నీ ప్రాణాలు కూడా తోడేస్తాడు" అన్నాడు వాలి. రాముడు తనను ధర్మం కొరకే వధించాడని వాలి విశ్వసిస్తున్నాడు.

"సుగ్రీవా! ఇలా రా! ఇంద్రుడు ప్రసాదించిన ఈ దివ్య సువర్ణమాలను తీసికో. దీనిని నీవు ధరించుకో. నేను మరణిస్తే ఇది కాంతిహీన మవుతుంది," అని పలికి ఆ మాలను సుగ్రీవుని కిచ్చాడు వాలి.

"అంగదా! ఇలా రా నాయనా! నీవు ఎలా ప్రవర్తించినా నేను ఎప్పుడూ ప్రశ్నించలేదు నీ మీదున్న ప్రేమతో. రేపు సుగ్రీవుడు అలా అంగీకరించక పోవచ్చు. సుగ్రీవునికి అనుగుణంగా జీవించు. సుగ్రీవుని శత్రువులు నీకు కూడా శత్రువులే.

"నాయనా! అతిశయించిన రాగద్వేషాలు సుఖాన్నివ్వవు. మధ్యమార్గానువర్తివై జీవించి సుఖించు;" - అంతే, కళ్లు తేలిపోతున్నాయి. అప్రయత్నంగా నోరు తెరచుకుంది. దంతాలు

ముందుకొచ్చాయి. వాలి వాలిపోయాడు. ప్రాణాలు లేచి గాలిలో కలిసిపోయాయి. ధూళిలో రాలిపోయాడు వాలి.

వానరులంతా పెద్దగా రోదించారు. పూర్వము గోలభుడు అనే గంధర్వునితో పదహారు సంవత్సరాలు యుద్ధం చేసి విజయాన్ని సాధించాడు వాలి. ఎందరో వీరులను కూల్చాడు. ఈనాడు తానే కూలిపోయాడు.

సింహముచే చంపబడి నేలపడియున్న ఆబోతు ప్రక్కన, లేగదూడతో కలిసిన ఆవు ఉన్నట్లు, రామునిచే చంపబడి నేల రాలియున్న వాలి ప్రక్కన అంగదునితో కూడి తార రోదిస్తూ ఉండిపోయింది.

తారాంగదులను చూపి తల్లడిల్లిపోయాడు ధర్మాత్ముడైన సుగ్రీవుడు. కన్నీరు కార్చుకుంటూ రాముని సమీపించాడు.

"రామా! నీవు మాట నిలబెట్టుకున్నావు. కానీ నా బంధువుల దుఃఖము నా హృదయాన్ని భగ్నం చేసింది. రాజ్యము మీద, భోగాల మీద నాకు ఆసక్తి లేకుండా చేసింది. నన్ను హింసించిన వాలి వధింపబడితే చూడాలని అప్పుడు భావించాను. వాలి మరణాన్ని చూడలేక ఇప్పుడు వ్యథ చెందుతున్నాను.

"రామా! వాలి నన్ను కొట్టి తరిమేవాడే గాని ఎప్పుడూ చంపే ప్రయత్నం చేయలేదు. ఆ పని నేనే చేశాను. నా విషయంలో వాలి ఉదారంగా, ఉదాత్తంగా వర్తించాడు. నేనే నీచంగా, హీనంగా ప్రవర్తించాను.

"రామా! నేను కూడా వాలితో పాటు అగ్నిలో ప్రవేశిస్తాను. వానరవీరులు సీతాన్వేషణలో నీకు సహకరిస్తారు. కులనాశానికి పాల్పడిన నేను హాయిగా జీవించలేను. మరణించి సుఖిస్తాను;" అని బిగ్గరగా రోదించాడు సుగ్రీవుడు.

భర్త దేహంపై పడి రోదిస్తున్న తార సుగ్రీవుని మాటలు విని నిద్రనుండి లేచిన దానివలె తల పైకి ఎత్తింది. ఎదురుగా రాముడు కనిపించాడు. ఇంద్ర సమానుడై, అసమాన పరాక్రమశాలియై విలబడియున్న పుణ్యపురుషుడగు రాముని చూచింది. లేచి రాముని సమీపించి ఇలా భాషించింది.

**త్వమప్రమేయశ్చ దురాసదశ్చ జితేన్ద్రియ శ్చోత్తమ ధర్మకశ్చ**
**అక్షీణ కీర్తిశ్చ విచక్షణశ్చ క్షితి క్షమావాన్ క్షతజోపమాక్షః**

"నరేంద్రా! నువ్వు అప్రమేయుడవు. దురాసదుడవు. జితేంద్రియుడవు. ఉత్తమ ధర్మమూర్తివి. అక్షయ కీర్తిమంతుడవు. విచక్షణుడవు. సహనశీలుడవు. సమర్థుడవు.

"వీరుడా! నా భర్తను ఏ బాణంతో చంపావో అదే బాణంతో నన్ను కూడా చంపు. నన్ను నా భర్త వద్దకు పంపించు. నేను లేకపోతే అక్కడ నా భర్తను ఎవరు చూస్తారు?

"రాజకుమారా! సీత లేదని నీవు దుఃఖిస్తున్నావు కదా! నేను లేకపోతే నా భర్త దుఃఖించడా! నా మాట విని నన్ను చంపేయి. నీకు స్త్రీహత్యాపాతకము సంభవిస్తుందని సంశయించకు. నేను వాలి శరీరములో భాగమే కదా! వాలి అర్ధాంగినే కదా! అలా భావించి నన్ను చంపేయి;" అంటూ విలపిస్తోంది తార. ఆమెను చూసి రాముడు ఇలా పలికాడు.



"వీరపత్నీ! ఇదంతా భగవంతుని సృష్టి. పరమాత్మ కర్మఫలాలను అందిస్తూ ఉంటాడు. నీవు అనవసరమైన ఆలోచనల్ని చేయకు. వీరవనితలు వగచకూడదు. శూరసతులు శోకించకూడదు;" అని రాముడు చెప్పగానే తార దుఃఖాన్ని నిగ్రహించుకుంది.

రాముడు తారను ఓదార్చాడు. కానీ తారాంగదసుగ్రీవుల దుఃఖంతో సమానమైన దుఃఖాన్ని రాముడు మనసులో అనుభవిస్తున్నాడు. కాని బైటికి కనిపించడం లేదు. అదే రాముని ప్రత్యేకత.

రాముడు కూడా మనలాగే కష్టాల్లో కుమిలిపోతాడు. మనము బయట పడతాము. రాముడు బయట పడడు. మనసులోనే ధరించి భరిస్తాడు. వనవాసం వెళ్ళేటప్పుడు కౌసల్యతో రాముడు అదే చెప్తాడు. ఆ విషయాన్ని మరచిపోవద్దని అక్కడ నేను మీకు చెప్పాను.* ఈ సందర్భములో దానిని సమన్వయం చేసుకోండి.

"మీరంతా ఇక్కడ ఏడుస్తూ కూర్చుంటే పరలోకంలో వాలికి సద్గతి లభించదు. తక్షణ కర్తవ్యాన్ని ఆలోచించండి. కాలపరిణామం అనివార్య మైంది. ఆ విషయంలో వగచి సాధించేదంటూ ఉండదు. వాలి ఉత్తమగతిని పొందుతున్నాడు. మీరు చెయ్యవలసిన కార్యాల్ని త్వరగా చెయ్యండి" అన్నాడు రాముడు.

పల్లకీ తెప్పించారు. వాలిని అందులో ఉంచి, ఒక సెలయేటి వద్దకు తీసుకెళ్ళి, ఆ ప్రక్కనే ఇసుక మీద చితి పేర్చారు. సుగ్రీవాంగదులు వాలి దేహాన్ని చితిపై ఉంచారు. అంగదుడు అగ్నిసంస్కారం చేశాడు. తరువాత నదికి వెళ్ళి జలతర్పణం చేశారు.

## కాలమహిమ

కాలము విచిత్రమైనది. విడ్డూరమైనది కూడా. కాలానికి ఆది లేదు. అంత ముండదు. అదొక సజీవప్రవాహం. తానెప్పుడూ విరామంలోనే ఉంటుంది. కానీ ఎవ్వరినీ విశ్రాంతి తీసుకోనివ్వదు.

కాలాన్ని అందరూ అన్వేషించేవాళ్ళే. అనుసరించేవాళ్ళే. ఇంతవరకు కాలముయొక్క అడుగుజాడల్ని గుర్తించిన వాళ్ళు లేరు. రెండు సంఘటనల మధ్య విరామమని బాహ్య విజ్ఞాన సందేశము. రెండు అనుభవాల మధ్య విరామమని ఆంతరంగిక విజ్ఞాన దృక్పథము.

దేనిని పోగొట్టుకున్నా తిరిగి పొందవచ్చు. తిరిగి పొందలేనిది, తిరిగి రానిది కాల మొక్కటే. గడిచింది గతించినట్లే. కాల విలువ తెలియనివాడు జీవిత విలువను తెలియనివాడే.

**I waste time and now doth time wastes me**

"కాలాన్ని వృథా చేయువాడు కాలంలో వృథా అవుతాడు" అంటాడు షేక్స్పియర్. కాల మహిమను కనుగొన్నవాడు జీవిత రహస్యాలను దర్శిస్తాడు. కాలము భగవంతుని విభూతి.

**కాలోఽస్మి లోకక్షయ కృత్ప్రవృద్ధో లోకాన్ సమాహర్తు మిహ ప్రవృత్తః**

---

* చైతన్య రామాయణము - ప్రథమ భాగము - 186వ పుట

"నేను కాలాన్ని. లోకాన్ని క్షయింపచేసేది నేనే. నేను పురాతనుడను. లోకాలను క్షయం చేయడమే నా కార్యము" అని శ్రీకృష్ణపరమాత్మ భగవద్గీతలో తెలుపుతాడు.

వాలిని అదృశ్యం చేసిన కాలమే సుగ్రీవుని అందల మెక్కించింది. రాజ్యాభిషిక్తుడై, భోగా లనుభవిస్తూ ధర్మయుతంగా పాలించమని రాముడు సుగ్రీవునికి చెప్పాడు. అంగదునికి యౌవరాజ్యాభిషేకము చేయుమని రాముడు చెప్పాడు. అలాగే చేశాడు సుగ్రీవుడు. కిష్కింధ పున: దివ్యశోభతో విరాజిల్లింది.

కిష్కింధకు రమ్మని ఆంజనేయుడు కూడా రాముని బ్రతిమాలాడు. రాముడు అంగీకరించలేదు. తండ్రికి ఇచ్చిన మాట ప్రకారం అరణ్యాలలో ఉండడమే శ్రేయమని భావించాడు.

"సుగ్రీవా! వర్షాకాలము ప్రారంభమైంది. పైగా ఇది శ్రావణమాసము. ఈ మాసంలో వర్షాలు మరీ ఎక్కువగా ఉంటాయి. ఈ నాలుగు మాసాలు సీతాన్వేషణమునకు అనువైన సమయము కాదు.

"నీవు కిష్కింధకు వెళ్ళి హాయిగా జీవించు. మేము అదిగో ఆ పర్వతము మీద ఉంటాము. కార్తికమాసము రాగానే నీవు రావణసంహారానికి ప్రయత్నాలు చెయ్యి. సరేనా!" అని పలికాడు రాముడు.

సరేనని పలికి సుగ్రీవుడు కిష్కింధకు వెళ్ళాడు. రాముడు లక్ష్మణునితో కలిసి ప్రస్రవణ పర్వతం చేరాడు. సుగ్రీవుడు సింహాసనాన్ని అధిష్ఠించాడు. రాముడు కొండగుహలో ప్రవేశించాడు.

ప్రస్రవణ పర్వతం చాలా మనోహర మైంది. రాముడు వసించే పర్వతగుహ కూడా చాలా విశాలమైంది. దాని దగ్గరే చల్లని, తియ్యని నీరు గల పద్మసరస్సు ఉంది. దానిచుట్టు వివిధములైన వృక్షాలు ఎంతో అందంగా శోభిస్తున్నాయి. అందులో కొన్ని పూసి ఉన్నాయి. మరికొన్ని కాపి ఉన్నాయి.

ప్రస్రవణ పర్వతానికి కిష్కింధ దగ్గరలోనే ఉంది. కిష్కింధ నుండి వానరుల అరుపులు, మృదంగ శబ్దాలు ఇక్కడికి విన్పిస్తూనే ఉంటాయి. ఆ ప్రాంతము ఎంతో ప్రసన్నంగా ఉన్నా అది రామునిలో ప్రశాంతతను, ఆనందాన్ని నింపలేక పోయింది.

సీతమ్మ రాముని మనసులో కదుల్తూనే ఉంది. రాత్రులందు శయనించినా నిద్ర వచ్చేది కాదు. లక్ష్మణుడు అన్నను ఓదార్చుతూ ధైర్యం చెప్పుండేవాడు. ఎలాగైనా వర్షాకాలం పోవాలి. నదుల పొంగు తగ్గాలి. అప్పుడు సుగ్రీవుని సహాయంతో సీతాన్వేషణము ప్రారంభించాలి. ఇలా మాట్లాడుకొనిన రామలక్ష్మణులు శరదృతువు కొరకు నిరీక్షిస్తున్నారు.

అది మంచి వర్షాకాలము. సూర్యుని కిరణాల ద్వారా సాగరజలాన్ని పానం చేసిన ఆకాశము, తొమ్మిది మాసాలు గర్భం ధరించినట్లు తనలో ఉంచుకొని ఇపుడు గర్భస్థ జలాన్ని వర్షిస్తోంది.

గ్రీష్మంలో మండుటెండలకు మరిగి, తొలకరి జల్లులకు తడిసిన భూమి విడిచే బాష్పము సీతమ్మ కార్చే కన్నీటిని గుర్తుచేస్తున్నది రామునికి. మేఘమాల నుండి బయలుదేరి కలువపువ్వుల చల్లదనాన్ని, మొగలిపువ్వుల పరిమళాన్ని తోడుచేసుకొని వీచే పిల్లగాలులు



దోసిళ్ళతో త్రాగడానికి అనువుగా ఉన్నట్లు అన్పిస్తోంది. ఈ దివ్యమైన వర్షఋతువు ప్రదర్శించే మనోహర దృశ్యాలు రామునిలో మదనోద్రేకాన్ని రెచ్చగొడుతున్నాయి.

ఈలోగా నీలమేఘం తళుక్కున మెరిసింది. కదిలిన ఆ మెరుపురేఖలు రాముని క్రుంగదీశాయి. రావణుని ఒడిలో అటూ ఇటూ తల్లడిల్లుచున్న సీతమ్మలా ఆ మెరుపులు అనిపించాయి రామునికి.



దానికి తోడు అప్పుడే చక్కని సంగీతం వినిపించింది. తుమ్మెదల శబ్దాలు వీణానాదములు కాగా మండూక శబ్దాలు తాళములుగా, మేఘ గర్జనలు మృదంగధ్వనులుగా తెలుస్తున్నాయి.

వర్షాలు జోరుగా కురవడం ప్రారంభించాయి. గాలులు తీవ్రంగా వీస్తున్నాయి. తీవ్రమైన నదీప్రవాహాలు గట్లను తొలిచేస్తూ క్రొత్త మార్గాలను ఎన్నుకొని ప్రవహిస్తున్నాయి. అవి తన జీవనరీతిని గుర్తు చేస్తున్నట్లు రాముడు చింతాక్రాంతు డయ్యాడు.

"భరతుడు పనులన్నీ పూర్తి చేసుకొని ఉంటాడు. వస్తువుల నన్నిటినీ సమకూర్చుకొని ఆషాఢపూర్ణిమ కొరకు నిరీక్షిస్తూ ఉంటాడు.

"నేను ఏ ఊరికైనా వెళ్ళి తిరిగి అయోధ్యకు వచ్చినపుడు అయోధ్యావాసులు చేయు కోలాహలం లాగా సరయూనది శబ్దం చేస్తూ ప్రవహిస్తూ ఉంటుంది.

"లక్ష్మణా! శత్రుసంహారము జరుగుట వలన సంతసించిన సుగ్రీవుడు ఈ వర్షాకాలంలో భార్యలతో కూడి సుఖిస్తుంటాడు. హాయిగా జీవిస్తూ ఉంటాడు.

**అహం తు హృతదారశ్చ రాజ్యాచ్చ మహతశ్చ్యుతః**
**నదీ కూల మివ క్లిన్న మవసీదామి లక్ష్మణ**

"లక్ష్మణా! శుభకరమైన ఈ వర్షఋతువులో అందరూ అలా సుఖిస్తూ ఉండగా నేను రాజ్యభ్రష్టుడనై, భార్యావియోగినై, తడిసిన నదీతీరము లాగా నశించిపోతున్నాను.

"నా దు:ఖము దుర్భరంగా ఉంది. కాలము ప్రయాణానికి అనుకూలంగా లేదు. శత్రువు గొప్ప బలవంతుడు. ఈ మూడు విషయాలు నన్ను కృంగదీస్తున్నాయి.

"లక్ష్మణా! లేకలేక చాలా కాలానికి సుగ్రీవుడు భార్యకు దగ్గరయ్యాడు. వెంటనే నా కార్యాన్ని నెరవేర్చుమని చెప్పడానికి నాకు నోరు రాలేదు. పైగా కాలం కూడా అనుకూలం కాదు గదా!

"తమ్ముడూ! సుగ్రీవుణ్ణి సుఖించనీ. నేను తనకు చేసిన ఉపకారాన్ని ఎలా మరువగలడు? సమయాన్ని గుర్తించి అతడే కార్యోన్ముఖు డవుతాడు. నదీవేగము తగ్గాలని,

సుగ్రీవుని మార్గము మారాలని నేను ఎదురు చూస్తున్నాను," అని పలికాడు రాముడు లక్ష్మణునితో.

కాలం ఎప్పుడూ మారేదే కదూ! ఒకేలా ఎలా ఉంటుంది? చూస్తుండగనే వర్షాకాలము గడచి పోయింది. మేఘాలన్నీ చెల్లాచెద రయ్యాయి. ఆకాశం నిర్మలంగా ఉంది. శరదృతువు ప్రవేశించింది. శరద్రాత్రి వెన్నెలతో పూయబడి ఉంది. సారస పక్షుల, బెగ్గురు పక్షుల శబ్దాలు విన్పిస్తున్నాయి.

"ఈ సారస పక్షుల ధ్వనులు వినపడగానే పూర్వం సీత మేలుకొనేది. చక్రవాక పక్షుల కూతలు ఆనాడు నా కెంతో ఆనందాన్ని అందించేవి. ఈనాడు నా జీవన వక్రగతిని గాంచి పరిహసిస్తున్నట్లు ఉన్నాయి.

"అనుకూలమైన శరత్కాలం వచ్చేసరికి దారీ తెన్నూ తెలియకుండా మదనుడు విజృంభిస్తున్నాడు. లక్ష్మణా! శరద్రాత్రిని చూశావా! తెల్లని వస్త్రము ధరించిన స్త్రీ లాగా ఎలా శోభిస్తోందో!

"ఉదయ చంద్రుడు చక్కని మొగములా తెలుస్తున్నాడు. పెద్దపెద్ద నక్షత్రాలు కోమలములైన నేత్రాల వలె ప్రకాశిస్తున్నాయి. వెన్నెల చీర కట్టినట్లున్నది కదూ!

"సౌమిత్రీ! శరత్కాల సౌందర్యము చూడు. తెల్లని పట్టుచీర లాగా శోభించే రెల్లులతో, పువ్వులనే నవ్వులతో నదీతీరాలు ఎంత ఆహ్లాదంగా ఉన్నాయో!

"క్రౌంచపక్షుల తియ్యని పలుకులతో కూడి శబ్దము చేసే నదీజలము, పండిన వరిచేను, చల్లని గాలి, నిర్మలమైన చంద్రబింబము - లక్ష్మణా! ఇవన్నీ వర్షాకాలం వెళ్ళినట్లు చెప్తున్నాయి కదూ!

"లక్ష్మణా! పరస్పర కలహాలు గల రాజులు మరల యుద్ధానికి ఉద్యమించే కాలం సమీపించింది. ఎందుకో! సుగ్రీవుడు ఆ ప్రయత్నంలో లేనట్లు కన్పిస్తోంది.

"వర్షాకాలంలో గడిచిన ఈ నాలుగు నెలలు సీతావియోగంలో క్రుంగుతున్న నాకు వంద సంవత్సరా లైనట్లుంది. లక్ష్మణా! రాజ్యభ్రష్టుడనైన నేను భార్యావిహీనుడనై, శోకార్తుణ్ణై ఉన్నాను. అయినా, ఎందుకో సుగ్రీవునికి నాపై దయ రాలేదు.

"లక్ష్మణా! ఈ రాముడు గతి లేనివాడు. రాజ్యభ్రష్టుడు. రావణుడు భార్య నపహరించగా దీనుడై ఉన్నాడు. నాకు శరణాగతుడై ఉన్నాడు అనుకుంటూ వానరరాజైన ఈ సుగ్రీవుడు నన్ను అవమానిస్తున్నాడు.

"చేసుకున్న బాసలన్నీ ఆడియాస లయ్యాయి. తన కార్యం సిద్ధించింది కదూ! మనల్ని పూర్తిగా మరచిపోయాడు. స్త్రీలోలుడై ధర్మాన్ని విస్మరించాడు. లక్ష్మణా! నీవు వెళ్ళి ఆ సుగ్రీవుని మందలించు.

"ఉపకారాన్ని పొంది, ఇచ్చిన మాటను విస్మరించువాడు నీచుడు అని చెప్పు. మాట నిలబెట్టుకొనువాడే ఉత్తముడు అని చెప్పు. మిత్రులకు అపకారం చేసినవాడి దేహాన్ని చచ్చిన తరువాత కుక్కలు కూడా ముట్టవని చెప్పు.



"లక్ష్మణా! ఈ సుగ్రీవుడు సహకరించనంత మాత్రాన మన పని ఆగిపోతుందా! నీవు తోడు ఉండగా నాకు దుర్లభ మంటూ ఉండదు. నాయనా! ఎందుకైనా మంచిది. నాకు కోపం వస్తే ఎలా ఉంటుందో నీవు వెళ్ళి ఒక్కసారి సుగ్రీవునికి చెప్పు.

**న చ సంకుచితః పన్థా యేన వాలీ హతో గతః**
**సమయే తిష్ఠ సుగ్రీవ మా వాలి పథ మన్వగాః**

"సుగ్రీవా! చూసి నడవడం నేర్చుకో. వాలి వెళ్ళిన మార్గము ఇంకా తెరిచే ఉంది. ఆ దారిని ఎన్నుకోకు.

"యుద్ధంలో నేను వాలిని ఒంటరిగానే చంపాను. పంపాను. నిన్ను అలా కాదు. బంధుమిత్ర సపరివార సమేతంగా సాగనంపుతాను.

"లక్ష్మణా! ఈవిధంగా చెప్పి రా! మన పని వెంటనే చూస్తాడో, లేక వాలిని చూస్తాడో సూటిగా అడుగు;" అన్నాడు రాముడు. ఉద్రేకపూరితమైన రాముని మాటలు లక్ష్మణుని ఆవేశాన్ని వృద్ధి చేశాయి.

## రామన్న కార్యంలో హనుమన్న

వర్షాకాలం నాలుగు మాసాలు గడచిపోయాయి. సుగ్రీవుడు ధర్మార్థములను, పాలనా కార్యాలను పూర్తిగా విస్మరించాడు. కామజీవనంలో కలుషితమై పోయాడు.

ఎవరికీ కనిపించేవాడు కాడు. రహస్యప్రదేశాలలో స్త్రీలతో క్రీడిస్తుండేవాడు. రాజ్య భారాన్నంతా మంత్రులకు వదిలేశాడు. వారికి కూడా సంప్రదించుటకు అవకాశ మివ్వడం లేదు.

హనుమంతుడు మాత్రం చింతాక్రాంతుడై ఉన్నాడు. సమయం చూసి సుగ్రీవునికి రామకార్యాన్ని జ్ఞాపకం చేయాలని ఆలోచిస్తున్నాడు. ఒకరోజు సుగ్రీవుని సమీపించాడు హనుమంతుడు.

"సుగ్రీవుడా! నీ రాజ్యము నీకు లభించింది. భోగాలు ప్రాప్తించాయి. నీవు సుఖంగా ఉన్నావు. నీవు నెరవేర్చవలసిన మిత్రకార్యము మిగిలుంది. దానిని ఆచరించు.

"చేసిన ప్రతిజ్ఞను నిలబెట్టుకో. మిత్రుని కార్యాన్ని అలక్ష్యము చేయువాడు ఆపదల నెదుర్కోక తప్పదు. ఇప్పటికే చాలా ఆలస్య మైంది. రామకార్యంలో నీవు మనసును లగ్నం చేయాలి. సీతాన్వేషణమునకు తొందరపడాలి.

"వానరశ్రేష్ఠుడా! రాముడు సుగుణవంతుడు. ధర్మాత్ముడు. పూర్వము నీకు ఎనలేని మేలు చేసినవాడు. ఇప్పుడు నీవు రాముని కార్యాన్ని ఆచరించాలి. నా మాట విను. వానరులను ఆజ్ఞాపించు.

"నీవు పరోపకార బుద్ధి కలిగిన వాడవు. నీకు సహాయం చేసిన రాముని విషయంలో జాప్యం చేయడం మంచిది కాదు. ఇంతకీ నీవు ఎందుకు ఆలస్యం చేస్తున్నావు? రాముడు అడగక ముందే మనం చేయాలి. అప్పుడే ఆ పనికి సార్థకత.

"రాముడు సర్వశక్తి సంపన్నుడు. తన కార్యాన్ని తానే సాధించుకో గలడు. నీవు చేసిన శపథానికి కట్టుబడి ఉన్నాడు. మన అధీనంలో కోటిమంది వానరు లున్నారు. వారు చేయవలసిన కార్యా లేమిటో ఆజ్ఞాపించు;" అన్నాడు హనుమంతుడు.

హనుమంతుని వాక్యాలు సుగ్రీవునిలో ఉత్సాహాన్ని రేకెత్తించాయి. కళ్ళు తెరిపించాయి. వెంటనే సుగ్రీవుడు సేనానాయకుడైన నీలుని పిలిపించాడు. వానరుల నంతా సమీకరించ మన్నాడు. పదిహేను రోజుల్లో సమీపించని వానరునికి మరణదండన విధించమన్నాడు. అంగదుని కూడా పంపాడు.

ఈ విషయం ప్రస్రవణ పర్వతగుహలో ఉన్న రామలక్ష్మణులకు తెలియదు. ఒడంబడికను మరచిన సుగ్రీవుని విషయంలో రాముడు ఎప్పుడు క్రుద్ధుడయ్యాడో ఇక లక్ష్మణుని ఆవేశం కట్టలు త్రెంచుకుంది.

"అన్నా! సుగ్రీవుడు ముందుచూపు లేని మందభాగ్యుడుగా తెలుస్తున్నాడు. చేసిన మేలు మరచి మగువల మధ్య సుఖిస్తున్నాడు. ఇలాంటి దుష్టుడికి రాజ్యం ఇచ్చి మనమే తప్పు చేశాము.

"ఇక వీణ్ణి క్షమించ కూడదు. నాకు కోపం అణగడం లేదు. మాట తప్పిన సుగ్రీవుని మరణాన్ని ఇప్పుడే చూస్తాను. సీతాన్వేషణ కార్యంలో వానరులతో కూడి అంగదుడు మనకు సహకరిస్తాడు;" అని ఆవేశంతో పలికాడు లక్ష్మణుడు.

ధనుర్బాణాలు ధరించి పయనిస్తున్న లక్ష్మణుని సమీపించి రాముడు ఇలా పలికాడు. "సౌమిత్రీ! తొందరపడకు. వధించుట అనే పాపకార్యాన్ని మరచిపో. కోపాన్ని ఎవరైనా ప్రదర్శించగలరు. దానిని నిగ్రహించువాడే శ్రేష్ఠుడు.

"లక్ష్మణా! సుగ్రీవునితో పూర్వం లాగే స్నేహంతో వర్తించు. ఆవేశాన్ని ప్రదర్శించకు. కాలం మించిపోయిందని సున్నితంగానే చెప్పు" అని పలికిన రాముని మాటలు విని లక్ష్మణుడు కిష్కింధకు బయలుదేరాడు.

## కిష్కింధలో లక్ష్మణుడు

లక్ష్మణుని యొక్క కోపస్వభావం రామునికి తెలుసు. అందుచేత లక్ష్మణుని శాంతింపజేశాడు. చెప్పవలసిన మాటల్ని జాగర్తగా చెప్పి పంపాడు. లక్ష్మణుడు రాముని మాట దాటడు. తాను సుగ్రీవునితో ప్రస్తావించాల్సిన విషయము, సుగ్రీవుని ప్రశ్నలకు చెప్పవలసిన సమాధానమును మననం చేసుకుంటూ లక్ష్మణుడు కిష్కింధకు బయలుదేరాడు.

అయినా, రాముని దుఃఖాన్ని, క్రోధాన్ని చూసి కలతచెంది యున్నందున ప్రళయకాల యమునిలా గోచరిస్తున్న లక్ష్మణుడు మందరపర్వతం లాగా కన్పించాడు. కాలిబాట దూరమని భావించి, బాట సరిగా లేకపోయినా చెట్లమధ్య ప్రయాణం చేశాడు.

అడ్డం వచ్చిన మద్దిచెట్లను, తాళవృక్షాలను ఖండిస్తూ, రాళ్ళు రప్పలను కాలితో తన్నుతూ వేగంగా పయనించాడు లక్ష్మణుడు. కిష్కింధను సమీపించాడు. దుర్గమమైన ఆ కిష్కింధానగరము చుట్టూ భయంకరులైన వానరులు కాపలా ఉన్నారు.



ప్రళయ ప్రభంజనంలా గోచరించే లక్ష్మణుని చూసి వానరులు నలుదిక్కుల పారిపోయారు. కొందరు సుగ్రీవుని వద్దకు వెళ్ళి లక్ష్మణుడు కోపంతో వచ్చియున్నాడని తెలిపారు.

లక్ష్మణుని సమీపించడానికి వానరులకు ధైర్యం చాలలేదు. ప్రళయకాలాగ్ని వలె గోచరిస్తున్న లక్ష్మణుని వద్దకు అంగదుడు భయపడుతూ సమీపించాడు.

అంగదుడు చాలా తెలివైనవాడు. లక్ష్మణుని వద్దకు వానరు లెవ్వరూ వెళ్ళలేక పోయారు. అంగదుడు ఆలోచించాడు. తాను తండ్రి లేనివాడు కనుక తనను చూసి లక్ష్మణుడు శాంతిస్తాడని భావించాడు.

వాలి మరణిస్తూ అంగదుని బాధ్యతను రామునికి అప్పగించాడు. కనుక లక్ష్మణుని వలన తనకు అపాయమేదీ ఉండదని అంగదుడు భావించాడు.

"కుమారా! నీవు వెళ్ళి నేను వచ్చియున్నానని సుగ్రీవునికి చెప్పు" అన్నాడు లక్ష్మణుడు.

"మహారాజా! సత్యసంధులైన రామలక్ష్మణులు నీకు రాజ్యాన్ని అనుగ్రహించారు. నీకు మిత్రులైనారు. లక్ష్మణుడు ధనుర్బాణములు ధరించి ద్వారము వద్ద క్రుద్ధుడై నిలబడియున్నాడు. అతనికి భయపడి వానరులు వణకిపోతున్నారు.

**స ఏష రాఘవ భ్రాతా లక్ష్మణో వాక్యసారథిః**
**వ్యవసాయ రథః ప్రాప్తస్తస్య రామస్య శాసనాత్**

"రామకార్యమనే రథములో ఎక్కి, రామవాక్యములు అనే సారథి తీసికొని రాగా రాముని సోదరుడైన లక్ష్మణుడు వచ్చియున్నాడు.

"వానరేశ్వరా! నీవు వెళ్ళి లక్ష్మణుని శాంతింపచేయుట మంచిది. అంతేకాదు. నీవు ఏర్పరచుకొనిన ఒడంబడికను సఫలం చేయడానికి ప్రయత్నించు. రాముని మాటను మీరకు" అని అంగదుడు, అతనితో పాటు సుగ్రీవుని వద్దకు వచ్చిన ప్లక్షుడు, ప్రభావుడు అనే మంత్రులు చెప్పారు.

సుగ్రీవుడు లేచి నిలబడ్డాడు. యుక్తాయుక్తములను అంతరేక్షణ చేసుకున్నాడు. మంత్రులతో ఇలా పలికాడు.

"నేను ఏ దోషమూ చేయలేదు. ఏ దోషవాక్కూ పలకలేదు. లక్ష్మణుని కోపానికి కారణ మేమిటా అని ఆలోచిస్తున్నాను. ఇది ఎవరో శత్రువులు పన్నిన పన్నాగమై ఉంటుంది.

"రామలక్ష్మణుల నుండి నేను ఏ భయాన్నీ ఊహించడం లేదు. కానీ అకారణంగా స్నేహితుడు కోపించినా డంటే ఎవరికైనా బాధ తప్పదుకదా! స్నేహ మనేది చాలా పవిత్ర మైనది.

**సర్వథా సుకరం మిత్రం దుష్కరం ప్రతిపాలనమ్**
**అనిత్యత్వాత్తు చిత్తానాం ప్రీతిరల్పేఽపి భిద్యతే ॥**

"స్నేహం చేసుకోవడం సులభమే. కానీ దానిని రక్షించుకోవడం కష్టం. మనస్సులు స్థిరంగా ఉండవు. స్వల్ప విషయానికి కూడా స్నేహాలు చెడిపోతూ వుంటాయి.

"ఇదే నా భయానికి కారణము. రాముడు నాకు చేసిన మేలును నేనెన్నటికీ తీర్చుకోలేను;" అని సుగ్రీవుడు పలికిన మాటలు విని హనుమంతుడు ఇలా అన్నాడు.

"వానరోత్తమా! రాముడు చేసిన ఉపకారాన్ని నీవు మరచిపోలే దనడంలో గొప్పతన మేమీ లేదు. నీకు మేలు చేయాలని ఇంద్రుని వంటి వాలిని రాముడు నిర్భయుడై వధించాడు.

"రాముడికి ఇప్పటికీ నీపై ప్రేమ అలాగే ఉంది. దాని వృద్ధిని కాంక్షించే లక్ష్మణుని నీ వద్దకు పంపాడు. చూడు. నీవు మత్తులో పడి కాలాన్ని గుర్తించ లేకున్నావు. శరత్కాలము ప్రారంభమైంది. నీవు కర్తవ్యాన్ని మరచావనే కారణం వల్లనే లక్ష్మణుడు ఇక్కడికి వచ్చినట్లు స్పష్టమౌతూ ఉంది.

"రాముడు కష్టాల్లో ఉన్నాడు. లక్ష్మణుని ద్వారా అతడు చెప్పి పంపిన విషయాన్ని ఆలకించి, దానికి అనుగుణంగా జీవించడము యుక్తమని నా అభిప్రాయము.

**కృతాపరాధస్య హి తే నాన్య త్పశ్యా మ్యహం క్షమమ్**
**అన్తరేణాంజలిం బద్ధ్వా లక్ష్మణస్య ప్రసాదనాత్ ।**

"వానరరాజా! నీవు అపరాధము చేశావు. నీవు చేతులు జోడించి లక్ష్మణుని ప్రార్థనా పూర్వకంగా ప్రసన్నం చేసికోవాలి. మరోమార్గం నాకు గోచరించడం లేదు.

"మంచి కోరే మంత్రులు రాజుకు హితమైనా, అహితమైనా సత్యమే పలకాలి. అందుకే నేను ఈ విషయాలన్నీ నీతో నిర్భయంగా చెప్పాను. రాముడు ధనుస్సును ఎక్కుపెడితే ఎదురుగా నిలిచేవారు ముల్లోకాల్లోనూ లేరు.

"నీకు రాముడు చేసిన ఉపకారము సామాన్యమైనది కాదు. అట్టి రామునికి కోపం తెప్పించడం మంచిది కాదు. బంధుమిత్రాదులతో కలిసి నీవు అతనిని శరణు వేడు;" అని పలికాడు.

అంగదాదులు వెళ్ళి లక్ష్మణుని లోనికి ఆహ్వానించారు. ద్వారముల వద్ద యేనుగు వంటి దేహములు కలిగిన వానరులు కాపలా ఉన్నారు. వారంతా లక్ష్మణునికి చేతులెత్తి నమస్కరించారు.

క్రోధావిష్టుడై వున్న లక్ష్మణుడు లోనికి వెళ్ళగానే దిక్కులు పిక్కటిల్లేలా టంకారధ్వని చేశాడు. ఆ ధనుష్టంకారము సుగ్రీవునికి వినిపించింది. అది లక్ష్మణుడు చేసిన ధ్వనియే నని సుగ్రీవుడు గ్రహించాడు. వెంటనే చివుక్కున ఆసనం నుండి లేచి నిలబడ్డాడు. సుగ్రీవునికి నోటిలో తడి ఆరిపోయింది. సుగ్రీవుడు తారతో ఇలా పలికాడు.

"తారా! లక్ష్మణుడు కోపావిష్టుడై వచ్చియున్నట్లు, మంత్రుల మాటల ద్వారా, ఈ టంకార ధ్వని ద్వారా స్పష్టమౌతూ వుంది. కారణం లేకుండా లక్ష్మణుడు కోపించడు కదా! ఆ కారణము ఏమిటో నేను ఊహించలేకపోతున్నాను.

"ఎందుకైనా మంచిది. నీవు తొందరగా వెళ్ళి లక్ష్మణునితో మాట్లాడు. నిన్ను చూసి లక్ష్మణుడు శాంతించవచ్చు. ఆ తరువాత నేను లక్ష్మణుని వీక్షిస్తాను" అన్నాడు సుగ్రీవుడు.

తారయొక్క భర్త వాలిని రాముడు సంహరించాడు కనుక తార విషయంలో లక్ష్మణుడు సానుభూతితో వ్యవహరించి శాంతించునని సుగ్రీవుడు భావించాడు. వాక్చాతుర్యము, సమయస్ఫూర్తితో భాషణము చేయగల తార లక్ష్మణుని ప్రసన్నుని చేయగలదని భావించుట చేత సుగ్రీవుడు తారను పంపాడు.

"రాజకుమారా! నీ రోషావేశాలకు కారణమేమి? మీ మాటను తిరస్కరించిన వారెవరు? ఎండిపోయిన చెట్లున్న అరణ్యంలో లేచిన దావానలం దగ్గరికి ఎవడు నిర్భయంగా వెళ్ళగలడు?" అన్నది తార.



"ఓ తారా! నీ భర్త కామలోలుడై ధర్మార్థములను త్యజించి జీవించడాన్ని నీవు గ్రహింపలేక పోయావా! సుగ్రీవుడు రాచకార్యాలు విస్మరించాడు. మమ్మల్ని స్మరించడమే మానేశాడు. భోగాల మధ్య కాలం గడుపుతున్నాడే గాని బాధ్యతలను గుర్తించే పరిస్థితిలో లేడు.

"ఈ నాలుగు మాసాలుగా తాగి పడివున్నాడు తప్ప చేయదగిన మరొక కార్యాన్ని చేసినట్లు లేదు. పురుషార్థఫలాలు కోరువాడు ప్రవర్తించవలసిన తీరు ఇది కాదు.

"ఉపకారికి ప్రత్యుపకారము చేయకపోవడం అధర్మము. మిత్రుని పోగొట్టుకోవడం కంటే హాని మరొకటి ఉండదు. అందులోను సత్యధర్మ పరాయణుడైన మిత్రుని పోగొట్టుకోవడం మరీ దారుణం.

"నీ భర్తకు ధర్మము నందు ప్రీతి నశించింది. ధర్మము నశించినా ఫరవాలేదు అని భావించి సుగ్రీవుడు మమ్మల్ని విస్మరించాడు. ఈ పరిస్థితుల్లో మేము ఏమి చేయాలో నీవే చెప్పు" అని తారను ప్రశ్నించాడు లక్ష్మణుడు.

లక్ష్మణునికి సందర్భోచితంగా సమాధానం చెప్పడానికి తార ఉపక్రమించింది. తార యొక్క వ్యక్తిత్వాన్ని, ఔన్నత్యాన్ని మనం తారాపథములో చూసి యున్నాము. ఈ సందర్భంలో తార మరొక్కసారి తళుక్కున మెరుస్తుంది.

వాలి వధానంతరము వాలితో పాటు తానూ మరణించాలని భావించింది తార. కానీ రాముని హితవచనాలు ఆలకించిన తరువాత మనోస్థైర్యాన్ని పొంది ఆ ప్రయత్నాన్ని విరమించుకుంది.

అర్థకామాల కన్నా ధర్మమే వాంఛనీయమని గ్రహించింది. ఆమె ఆంతర్యంలో గణనీయమైన మార్పు వచ్చింది. రాజు అవసరాలు తీర్చడానికి, రాజ్యాన్ని క్రమమార్గంలో ధర్మబద్ధంగా నడపడానికి సహకరించే వ్యక్తిగా మారిపోయింది.

వాలికి సముచిత సలహాల నొసగి సహకరించు తార ఇప్పుడు సుగ్రీవునికి సలహాదారై సహకరిస్తోంది. లక్ష్మణుని శాంతింపచేసే కార్యభారాన్ని సుగ్రీవుడు తారకు అప్పగించడం లోనే ఆమె మానసికపరిణతి ఎలా వుందో మనకు అర్థమౌతూ వుంది.

ఆమె మానసిక ప్రసన్నత ముఖం లోనే వ్యక్తమౌతూ వుంది. ఆగ్రహావిష్టుడై వున్న లక్ష్మణుడు తారను చూడగానే క్రోధాన్ని విడిచి ఉదాసీనతను పాటించినట్లు వాల్మీకియే చెప్పాడు.

**సతాం సమీక్ష్యైవ హరీశ పత్నీం తస్థావుదాసీన తయా మహాత్మా**

"మహాత్ముడైన లక్ష్మణుడు హరీశపత్ని యైన తారను చూడగానే ఉదాసీనుడయ్యాడు"అని తార ప్రవేశించినపుడే వాల్మీకి చెబుతాడు.

తారను హరీశపత్నిగా వాల్మీకి ఈ సందర్భములో వర్ణించడం చాలా సముచితంగా ఉంది. హరీశపత్ని అంటే వానరరాజు భార్య అని అర్థము. కానీ హరీశపత్ని మనము ఒక్కక్షణాన మనసులో ధరించి ఆలోచిస్తే ఆమె ప్రసన్నలక్ష్మిగా, పవిత్ర ఉమగా దర్శన మిస్తుంది. లక్ష్మణుని ఉదాసీనతకు కూడా ఈ దర్శనమే కారణమై ఉంటుంది. ఇంగితజ్ఞానంతో తార భాషించిన తీరును చూద్దాం.

"రాజకుమారా! ఇది కోపానికి అనువైన సమయం కాదు. పైగా సుగ్రీవుడు మీవాడు. మీలో ఒకడు. స్వజనంపై కోపగించుకోవడం మంచిది కాదు. సుగ్రీవుడు మీ మేలు కోరేవాడు. ఒకవేళ అతనిలో తెలియక పొరపాటు జరిగి ఉంటే, మీరు సహించకపోతే మరెవరు సహిస్తారు?

"లక్ష్మణా! అధికగుణ సంపన్నుడు అల్పగుణ సంపన్నుని విషయంలో కోపించకూడదు. అందులో ఉత్తముడైన నీలాంటివాడు క్షణికావేశానికి లోను కాకూడదు.

**జానామి కోపం హరివీరబన్ధో ర్జానామి కార్యస్య చ కాల సఙ్గమ్**

**జానామి కార్యం త్వయి యత్కృతం న స్తచ్చాపి జానామి యదత్ర కార్యమ్**

"సుగ్రీవుని మిత్రుడైన రాముని కోపం ఎలాంటిదో నాకు తెలుసు. చేయవలసిన కార్యము ఆలస్య మైందని కూడా నాకు తెలుసు. మా విషయంలో మీరేమి చేశారో నాకు తెలుసు. మీ విషయంలో ఇప్పుడు మేము ఏమి చెయ్యాలో కూడా నాకు తెలుసు.

"లక్ష్మణా! అంతేకాదు. మన్మథుని శక్తి ఎంత సహింపలేనిదో అది కూడా నాకు తెలుసు. కామలోలుడైన సుగ్రీవుడు ఏ స్త్రీవ్యామోహంలో మునిగి యున్నాడో ఆ స్త్రీల శక్తీ నాకు తెలుసు.

"నాయనా! అందరూ నీలాగా జితేంద్రియులు కాగలరా! కామాతురుడైన వాడు దేశకాలాలను, ధర్మార్థాలను చూస్తాడా! కామానికి ధర్మం తెలుసా! సుగ్రీవుడు కామవశుడై ఉన్నాడు. సిగ్గుకు దూరమయ్యాడు. ఏమయినా అతనెవరో కాదు. నీ సోదరుడే. నీవు అతణ్ణి క్షమించాలి.

"చూడు లక్ష్మణా! తపోధర్మాలే ఊపిరిగా కలిగిన మహర్షులు కూడా కామానికి లొంగిపోవడం మనకు తెలిసిందే. ఇక సుగ్రీవుడా కామాన్ని జయించగలవాడు! అతడు వానరుడు. చంచల మైనవాడు. కామలోలుడు కాకుంటే ఆశ్చర్యపడాలి;" అన్నది తార లక్ష్మణునితో.

విజ్ఞానవతి, అనుభవజ్ఞురాలు అయిన తార యొక్క మానసిక మూర్తిమత్వాన్ని ఈ సంభాషణలో మనం స్పష్టంగా చూడవచ్చు.

గుణసంపదలో రామలక్ష్మణులను అధికులుగా, సుగ్రీవుని అల్పునిగా వర్ణిస్తూ లక్ష్మణుని కోపము సముచితం కాదని సున్నితంగా హెచ్చరించింది. ఈ విషయాన్ని లక్ష్మణుడు కిష్కింధకు బయలుదేరే సమయంలో రాముడు కూడా చెప్పాడు. అయినా లక్ష్మణుడు వీరావేశానికి గురయ్యాడు. తార ఇప్పుడు చక్కగా సముదాయించ గలిగింది.

సుగ్రీవుడు కామాసక్తుడై ఉన్నాడు. ఈ విషయాన్ని తార దాచిపెట్టలేదు. అది వాస్తవమే నని అంగీకరించింది. చాలా కాలంగా, రాజ్యానికి, భోగాలకు దూరమైన సుగ్రీవునికి అలాంటి ఆసక్తి కలగడం సహజమే నని సమర్థించింది. అంతమాత్రాన రాముని విషయంలో ఆచరింప వలసిన కార్యాన్ని విస్మరించ లేదని పలికి లక్ష్మణుని క్షణంలో విస్మయ పరచింది.

సుగ్రీవుని కామాసక్తిని సమర్థిస్తూ తార పలికిన మాటలు సత్యస్వరూపాలు. మహర్షులే మన్మథుని మాయకు లోనయ్యే టప్పుడు వానరుడైన సుగ్రీవుని తప్పుపట్టడం న్యాయమేనా! అని ఒక విధంగా లక్ష్మణుని నిలదీసింది. అందరూ లక్ష్మణుని లాగా జితేంద్రియు లవుతారా! అని సౌమిత్రి హృదయాన్ని కరిగించింది.



తార యొక్క సంభాషణము లోని వాస్తవాలు, ధర్మనిర్ణయాలు, విశ్లేషణలు లక్ష్మణుని ఆవేశాన్ని బాగా సలచబడేలా చేశాయి. అది గమనించిన తార ఇక సుగ్రీవుని ఔన్నత్యాన్ని తేటపరచేందుకు ఉపక్రమించింది.

"లక్ష్మణా! సుగ్రీవుడు కామాసక్తుడైనా మీ కార్యంలో ఆలస్యం చేయలేదు. ఆ కార్యానికి సంబంధించిన ఆజ్ఞలు పూర్వమే ఇచ్చేశాడు. అనేక పర్వతాల మీద నివసించే కోటానుకోట్ల వానరులు సుగ్రీవుని ఆజ్ఞ మేరకు వచ్చి యున్నారు.

"లక్ష్మణా! ఇంకా అక్కడే నిలబడి ఉన్నావేమిటి? లోపలికి రా నాయనా!" అంది. అంతవరకు వీరావేశంలో ఉన్న లక్ష్మణుడు ప్రసన్నవదనుడై అంతఃపురము లోకి ప్రవేశించాడు. అది తారలో ప్రత్యేకత.

## లక్ష్మణ సుగ్రీవులు

రాముని బాధను చూడలేక కలత చెందియున్న లక్ష్మణుడు, స్త్రీల మధ్య విలాసవంతుడై కనిపించిన సుగ్రీవుని చూడగానే మళ్ళీ ఆవేశానికి గురయ్యాడు. లక్ష్మణుని ఆవేశాన్ని చూసి భీతి చెందిన సుగ్రీవుడు చివుక్కున లేచి నిలబడి చేతులు జోడించాడు.

"బలవంతుడు, బంధుజనప్రియుడు, జాలి కలవాడు, జితేంద్రియుడు, కృతజ్ఞుడు, సత్యవాది అయిన రాజే ఎన్నడైనా పూజార్హుడు. అధర్మపరుడు, ఉపకారం చేసిన మిత్రులకు ప్రత్యుపకారం చేస్తానని చెప్పి మోసం చేసిన రాజు కంటే క్రూరాత్ముడు మరొకడు ఉండడు.

"మిత్రుల నుండి ఉపకారాన్ని పొంది తిరిగి వారికి ఉపకారం చేస్తానని చెప్పి, చెయ్యని పాపాత్ముని బ్రతకనివ్వ కూడదు. కృతఘ్నుని గూర్చి పూర్వము బ్రహ్మదేవుడు ఒక శ్లోకం చెప్పాడు. దానిని మాననీయు లందరూ శిరోధార్యంగా భావిస్తారు. అదేమిటో చెబుతాను. విను.

**గోఘ్నే చైవ సురాపే చ చౌరే భగ్నవ్రతే తథా**

**నిష్కృతి ర్విహితా సద్భిః కృతఘ్నే నాస్తి నిష్కృతిః**

"గోవును చంపినవానికి, త్రాగుబోతుకి, చోరునికి, వ్రతభంగ మైనవానికి ప్రాయశ్చిత్త మున్నదని సాధువులు చెప్పినారు. కానీ కృతఘ్నునికి మాత్రం ప్రాయశ్చిత్తం లేదన్నారు.

"సుగ్రీవా! ముందుగా రాముని ద్వారా నీవు లబ్ధిని పొందావు. రామునికి ప్రత్యుపకారం చేయడానికి వెనుకంజ వేస్తున్నావు. నీవు దుర్మార్గుడివి. కృతఘ్నుడివి. అసత్యపరుడివి.

"రాముని ద్వారా నీ కార్యాన్ని సాధించుకున్నావు కదా! అలాంటప్పుడు రాముని కార్యంగా సీతాన్వేషణమును చేయవలసిన బాధ్యత నీకుందా! లేదా! ఇచ్చిన మాటను మరచిపోయి ఇంతుల మధ్య తైతక్క లాడుతున్నావు. నీవు కప్ప అరుపులు నేర్చిన పామువని రాముడు తెలుసుకోలేక పోయాడు. దుష్టుడైన నిన్ను వానరరాజ్యానికి ప్రభువును చేశాడు.

"సుగ్రీవా! ఇచ్చిన మాటను కాపాడుకో. వాలిని చూడాలని ముచ్చటపడకు. రాముని పూర్ణ పరాక్రమాన్ని పాపం నువ్వింకా చూడలేదు. అందుకే ఇంత హాయిగా, ప్రశాంతంగా జీవిస్తున్నావు;" అని ఆవేశంతో పలికాడు లక్ష్మణుడు.

సుగ్రీవుని పరిస్థితి అస్తవ్యస్తంగా తయారైంది. నోరు ఎండిపోయింది. ముఖం వెలవెల పోయింది. సుగ్రీవుని అయోమయ స్థితిని, లక్ష్మణుని ఆవేశాన్ని గుర్తించిన తార మళ్ళీ పరిస్థితిని చక్కబరచేందుకు ఉద్యమించింది.

"లక్ష్మణా! సుగ్రీవుని నువ్వు అలా మాట్లాడడం ఏమీ బాగులేదు. నిందలు పడడానికి, పరుషవాక్కులు వినడానికి సుగ్రీవుడు తగినవాడు కాడు. అందులో నీలాంటివాడు సుగ్రీవుని నిందించ కూడదు.

"సుగ్రీవుడు కృతఘ్నుడు కాడు. అపకారి కాడు. అసత్యము పలకడు. కుటిలుడు కాడు. ఎవ్వరూ చెయ్యని, చెయ్యలేని ఉపకారాన్ని రాముడు సుగ్రీవునికి చేశాడు. ఇందులో అతిశయోక్తి లేదు. కానీ దానిని సుగ్రీవుడు మరవలేదే!

"కేవలం రాముని దయ వల్లనే సుగ్రీవుడు రాజ్యాన్ని పొందగలిగాడు. నన్ను, రుమను, కీర్తిని సమస్తాన్నీ పొందాడు. ఇదంతా రాముడు చేసిందే. ఈ విషయంలో ఎవ్వరికీ మరొక ఆలోచన ఉండనవసరం లేదు.

"కానీ లక్ష్మణా! పూర్వము సుగ్రీవుడు ఎంతోకాలం ఋష్యమూకపర్వతము మీద దీనుడై జీవించాడు. సుఖాలకు దూరమై బ్రతికాడు. భోగాలను ఊహించలేక వ్యథ చెందాడు. కొండల్లో, బండల్లో, గుహల్లో, గూళ్ళల్లో నివసించాడు.

"బ్రతుకు కొడిగట్టిన దీపంలా తయారైంది. ఈలోగా రాముని దయవల్ల సుగ్రీవుడు వానరరాజ్యానికి ప్రభు వయ్యాడు. లేవనుకున్న సుఖాలు అతణ్ణి నిద్ర లేపాయి. రావనుకున్న భోగాలు కళ్ళముందు నిలిచి మనసును ఉసిగొల్పాయి.

"లేకలేక దొరికాయి కదూ! పూర్వము విశ్వామిత్రుడు మేనక విషయంలో పదివేల సంవత్సరాలను ఒక్కరోజుగా భావించి అనుభవించినట్లు, సుగ్రీవుడు కూడా సమయాన్ని మరచి ప్రవర్తించిన విషయం వాస్తవమే.

"విశ్వామిత్రుడు అంతటి మహర్షే అలా అయినపుడు ఇక సామాన్యుడైన సుగ్రీవుని విషయం చెప్పాలా! లక్ష్మణా! ఇది ఆలోచించి రాముడు సుగ్రీవుని క్షమించాలి. నాయనా! సామాన్యుల వలె నీవు ఆవేశానికి లోనుగాకు. నీలాంటి వారు తొందరపడ కూడదు.

"లక్ష్మణా! ధర్మాత్ముడా! సుగ్రీవుని విషయంలో నీవు ఆవేశాన్ని వీడడం మంచిది. అలా చేయమని నిన్ను నేను వేడుకుంటున్నాను.

**రుమాం మాం చాంగదం రాజ్యం ధనధాన్య వసూనిచ**
**రామ ప్రియార్థం సుగ్రీవ స్త్యజే దితి మతిర్మమ ।**

"లక్ష్మణా! రామునికి మేలు చేసే కార్యంలో రుమను, నన్ను, అంగదుని, రాజ్యాన్ని, ధనధాన్యాల్నీ, రత్నాల్నీ కూడా సుగ్రీవుడు త్యజిస్తాడు. ఇది నా వ్యక్తిగతమైన అభిప్రాయము.

"దుర్మార్గుడు, రాక్షసాధముడు అయిన రావణుణ్ణి వధించి, చంద్రుణ్ణి రోహిణితో చేర్చినట్లు, రాముని సీతతో చేర్చుతాడు.

"లంకలో రాక్షసులు కోట్ల సంఖ్యలో ఉన్నారని తెలిసింది. వాళ్ళందరినీ చంపకుండా రావణుణ్ణి చంపడం సాధ్యం కాదు. ఎవరి సహాయం లేకుండా వీరుడైన రాముడు కూడా



రావణుని చంపలేడు. సుగ్రీవుడు కూడా చంపలేడు. అందుచేతనే కోట్లకొలది వానరులను సుగ్రీవుడు సమీకరణం చేస్తున్నాడు.

"రావణుని బలాన్ని గూర్చి పూర్వము వాలి నాకు చెప్పాడు. రావణుడి విషయం వాలికి బాగా తెలుసు. అతను చెప్తే నాకు తెలిసింది. అంతకు మించి వివరాలు నాకూ తెలియవు.

"గొప్ప బలవంతులైన వానరులను తీసికొని వచ్చుటకు సుగ్రీవుడు పంపగా వానరులు వెళ్ళియున్నారు. వారి కోసం సుగ్రీవుడు నిరీక్షిస్తున్నాడు కూడాను. అందుకే వచ్చి రాముని చూడలేదు.

"సుగ్రీవుని ఆజ్ఞ మేరకు వీరులైన వానరులంతా ఈరోజే రావాలి. వస్తారు కూడా. నీవు దయచేసి కోపాన్ని విడిచిపెట్టు. లక్ష్మణా! రాముని వల్ల పూర్వము సుగ్రీవుని అన్నకు ఏమి జరిగిందో, లక్ష్మణుని వల్ల వాలి తమ్మునకు నేడు అదే జరగబోతుందేమో నని అంతఃపుర స్త్రీలు విచారం చెందుతున్నారు;" అని పలికింది తార.

తారయొక్క సంయమనాన్ని, సమయస్ఫూర్తిని, రాజనీతిజ్ఞతను ఇక్కడ మళ్ళీ మనం చూడవచ్చు.

సుగ్రీవుని భోగలాలసత తప్పు కాదని నిర్ణయించడం లోనే తారయొక్క ప్రజ్ఞ వ్యక్త మౌతోంది. అందుకు విశ్వామిత్రుని ఉదహరించడం అమోఘమైన సమయస్ఫూర్తి అని చెప్పుకోవాలి. రామలక్ష్మణులకు గురువైన విశ్వామిత్రుని ఎప్పుడైతే ఉదహరించిందో, సుగ్రీవుని తప్పుపట్టే అవకాశాన్ని లక్ష్మణునికి అప్పుడే దూరం చేసేసింది.

వానరుడైన సుగ్రీవుడు ఏదో తప్పు చేశాడని రఘుకులంలో జన్మించిన లక్ష్మణుడు ఉద్రేకపడడం సబబు కాదన్నది. అల్పగుణవంతుల్ని సరిదిద్ది ప్రోత్సహించడం అధికగుణ సంపన్నుల కర్తవ్యమని బాధ్యతను ఎరుక పరచింది.

యుద్ధం విషయంలో కూడా తన రాజనీతిజ్ఞతను ప్రదర్శించింది. శత్రుసైన్యాన్ని మదింపు వేయకుండా సమరానికి కాలుదువ్వి పరాజయం పాలుకావడం వీరుల లక్షణం కాదని, రావణుని బలపరాక్రమాలు తెలియబట్టే కోట్లాది వానరులకు ఇప్పటికే కబురు పంపడం జరిగిందని చెప్పింది.

సుగ్రీవుడు రాముని విషయాన్ని మరచాడు అనేదే లక్ష్మణుని అభియోగం. దానికి కారణం సుగ్రీవుడు వచ్చి రాముని చూడకపోవుటయే.

సుగ్రీవుడు రాముని కార్యాన్ని విస్మరించలేదు. ఆ కార్యక్రమ సన్నాహాల్లోనే ఉన్నాడు. ఆ పని పూర్తి కానిదే రాముని వచ్చి చూడ దలచుకోలేదు అనేది తార సమాధానం.

**తారయతి సందేహం తారః**

తార అనే పదానికి సందేహమును పోగొట్టునది అని కూడా అర్థము. లక్ష్మణుని యొక్క సంశయములను తొలగించి తార సార్థక నామధేయురాలైంది.

## మేఘం తొలగింది - మోదం కలిగింది

తార మాటలు లక్ష్మణునకు ధర్మయుతంగా కన్పించాయి. లక్ష్మణుడు ధర్మలక్షణ సంపన్నుడు. మృదువైన స్వభావము కలవాడు. తార వినయంగా చెప్పిన ఉత్తమ వచనాలకు మెత్తబడ్డాడు. అది చూసిన సుగ్రీవుడు భయాన్ని తడిసిన వస్త్రం లాగా త్యజించాడు.

"లక్ష్మణా! నేను భాగ్యవంతుణ్ణి. రామానుగ్రహానికి పాత్రుడైన వాణ్ణి. రాముడు నాకు చేసిన ఉపకారం సామాన్య మైనదా! దానికి ప్రత్యుపకారం చేయడం ఎవరికి సాధ్యం?

"రాముడు దుర్మార్గుడైన ఆ రావణుణ్ణి తప్పక వధిస్తాడు. సీతను తిరిగి పొందుతాడు. ఆయనకి ఒకరి సహాయం అవసరం లేదు. ఆయన ప్రభావమే సర్వకార్యాలను సాధిస్తుంది. మేమంతా నామమాత్రమే. రామకార్యంలో మేమంతా రాముని వెనుక ఉంటాం. అంతే.

**యది కించి దతిక్రాన్తం విశ్వాసా త్ప్రణయే నవా**
**ప్రేష్యస్య క్షమితవ్యం మే న కశ్చి న్నాపరాధ్యతి ॥**

"నాయనా! నేను మీకు దాసుణ్ణి. రాముని యందు విశ్వాసమున్న వాణ్ణి. ప్రేమ గలవాణ్ణి. వీటి కారణంగా నావల్ల ఏదైనా అపరాధం జరిగి ఉండవచ్చు. నన్ను మీరు క్షమించండి. అపరాధము లేనివాడు లోకంలో ఉండడు గదా! అని సుగ్రీవుడు పలకగానే లక్ష్మణుడు చాలా సంతోషించాడు. ప్రేమాస్పదు డయ్యాడు.

రాజ్యం లభించగానే సుగ్రీవుని మనసు భోగాల వైపు పరుగులిడింది. అనిత్యమైన సుఖాల కోసం ఆరాటపడింది. అవే శాశ్వతమని భావించిన సుగ్రీవుడు నాలుగు మాసాల్లో ఒక్కసారి కూడా రాముని చూడడానికి వెళ్ళలేదు.

రాజ్యం లేకముందు సుగ్రీవుడు కొండల్లో తిరుగుతూ, బండలపై పడుకుంటూ కాలం గడిపాడు. రాముని కృప వల్ల రాజ్యం లభించింది. రాజ్యసుఖాల్లో పడి రాముణ్ణే విస్మరించాడు సుగ్రీవుడు.

భగవంతుడు మనకు కూడా ఎన్నో ఇచ్చాడు. ఏం లాభం? కళ్ళిచ్చాడు. చూడకూడని వాటిని చూస్తున్నామే గాని చూపిచ్చిన వానిని చూడలేక పోతున్నాము. ప్రాపంచిక విషయ వాసనల్లో మునిగిపోయాం. వారానికి కనీసం ఒక్కరోజైనా దేవాలయానికి వెళ్ళి పరమాత్మను దర్శించలేక పోతున్నాం.

నాలుగు నెలలైనా సుగ్రీవుడు ప్రస్రవణ పర్వతం వద్దకు వెళ్ళి రాముని దర్శించలేదు. భక్తిజ్ఞానాలను సదా వర్షించే చోటే ప్రస్రవణ పర్వతం. విషయసుఖాల్లో మునిగినవారు భక్తిధామాన్ని, జ్ఞానధామాన్ని చేరలేరు.

కష్టాల్లో అందరికీ భగవంతుడు జ్ఞాపక మొస్తూనే ఉంటాడు. సుఖాల్లో కూడా పరమాత్మను స్మరించువాడే, దర్శించువాడే భక్తుడు. సుఖదుఃఖాలు మనోగతాలు. మనోగతులు కూడా. వాటి మధ్య సతమత మవుతూ జీవిత లక్ష్యాన్ని మరచిపోకూడదు. జీవనతీరానికి దూరం కాకూడదు.

జీవుడైన సుగ్రీవుడు పరమాత్మయైన రాముడు చేసిన ఉపకారాన్ని మరచిపోయాడు. కానీ పరమాత్మ ప్రేమమయుడు. జీవుడు మరచిన విషయాన్ని జ్ఞాపకం చేసే బాధ్యతను కూడా తానే స్వీకరిస్తాడు.

లక్ష్మణుని పంపి సుగ్రీవునికి కర్తవ్యాన్ని ఎరుకపరుస్తాడు రాముడు. లక్ష్మణుడు వివేకానికి సంకేతము. ఆంజనేయుడు సుగ్రీవునికి హితబోధ చేస్తాడు. పరమాత్మకు దూరమైనా వివేకాన్ని అనుసరించినట్లైతే మహాత్ముల బోధల ద్వారా మళ్ళీ పరమాత్మకు దగ్గర కావచ్చు.



తప్పు చేయడం సహజమే. చేసిన తప్పును అంగీకరించడం, మళ్ళీ అలాంటి తప్పును చేయకుండా ఉండడం అలవరచుకోవాలి. సుగ్రీవుడు తన తప్పును అంగీకరించాడు. క్షమాపణ వేడుకున్నాడు. ఈవిధంగా దోషాన్ని ప్రక్షాళనం చేసుకొని రామానుగ్రహానికి పాత్రుడయ్యాడు.

"వానరేశ్వరా! నీవు ప్రభువువు. గొప్ప వినయశీలుడవు. నీవు మాకు తోడుగా ఉండడం చేత మేము కొరత లేనివార మయ్యాము. సుగ్రీవా! నీలో ఎంత స్వచ్ఛత ఉంది! ఎంత ఋజుత్వము ఉంది! అందుకే నీవు కిష్కింధకు రాజయ్యావు.

"నీవు అండగా ఉండగా రాముడు శత్రువుల్ని సమరంలో సునాయాసంగా చంపేస్తాడు. ఈ విషయంలో ఆలోచింప పనిలేదు. సుగ్రీవా! నీ మాటలు చాలా ఉపపన్నంగా ఉన్నాయి.

"నీ తప్పిదాన్ని గుర్తించి నీవు పలికిన మాటలు చాలా ఉన్నతంగా ఉన్నాయి. గొప్పతన మున్నవారు అలా వినమ్రులై ఎవరైనా మాట్లాడగలరా! అది నీకు, మా అన్నకు మాత్రమే సాధ్యం.

"వీరుడా! భార్యావియోగంతో రాముడు తీవ్ర దుఃఖానికి గురై ఉన్నాడు. నీవు నాతో పాటు వచ్చి నీ స్నేహితుణ్ణి ఓదార్చు. మిత్రమా! చింతాక్రాంతుడై ఉన్న రాముణ్ణి చూసి, ఆయన మాటలు విని నేను చాలా దుఃఖపడ్డాను. ఆ బాధలో నిన్ను ఏదో ఏదో అనేసి కష్టపెట్టానేమో! నన్ను క్షమించు;" అన్నాడు లక్ష్మణుడు సుగ్రీవునితో.

లక్ష్మణుని స్నేహవచనాలు సుగ్రీవుని ఆనందంలో ముంచెత్తాయి. సుగ్రీవుడు ఆంజనేయుని వైపు తిరిగి వానరవీరుల సమీకరణకు మరల ఆజ్ఞ లిచ్చాడు. ఆంజనేయుడు సుగ్రీవుని ఉత్తర్వులను అమలు చేశాడు.

ఈలోగా కొందరు వానరవీరులు వచ్చి సుగ్రీవునికి నమస్కరించి కానుకలు సమర్పించారు. కోట్లకొలది వానరులు బయలుదేరి వస్తున్నట్లు వార్త నందించారు. సుగ్రీవుడు చాలా సంతోషించాడు.

అంతరంగికులైన వానరవీరులను పిలిచి పల్లకిని సిద్ధం చేయమన్నాడు సుగ్రీవుడు. లక్ష్మణుని పిలిచి పల్లకిని ఎక్కమన్నాడు. లక్ష్మణసుగ్రీవులు పల్లకి ఎక్కారు. వానరవీరులు దానిని మోయుచుండగా వందిమాగధులు స్తుతించడం ప్రారంభించారు. కొందరు శ్వేతచ్ఛత్రం పట్టుకున్నారు. కొందరు వింజామరలు పట్టుకొని వీస్తున్నారు. కొందరు భేరీలు మ్రోగించారు. కొందరు శంఖాలు పూరించారు. శస్త్రాస్త్రపాణులై అనేకమంది వెంట నడిచారు.

రాముడు వసిస్తున్న పర్వతగుహను సమీపించారు. లక్ష్మణసుగ్రీవులు పల్లకి దిగారు. సుగ్రీవుడు రాముని సమీపించి చేతులు కట్టుకొని నిలబడ్డాడు. సుగ్రీవుని చూసి వానరులంతా అలాగే చేశారు.

రాముడు సుగ్రీవుని వానరసైన్యాన్ని చూశాడు. ఆ సైన్యము తామరమొగ్గలతో, తామరపువ్వులతో నిండిన తటాకంలాగా కన్పించింది. రాముడు ప్రీతిపాత్రు డయ్యాడు.

సుగ్రీవుడు వెళ్ళి రాముని పాదాలపై బడి నమస్కరించాడు. రాముడు సుగ్రీవుణ్ణి లేవదీసి ప్రేమతో కౌగిలించుకున్నాడు. "సుగ్రీవా! ఇలా రా! కూర్చో!" అన్నాడు రాముడు.

"సుగ్రీవా! ధర్మార్థకామాలను రాజు కాలానుగుణంగా ఆచరించాలి. చెట్టు చివరి కొమ్మపై నిద్రించువాడు క్రింద పడినప్పుడే తన తప్పిదాన్ని తెలుసుకుంటాడు. ధర్మార్థములను విడిచిపెట్టి కామాన్ని మాత్రమే సేవించువాడు ఇక్కట్లలో చిక్కినపుడే తన దోషాన్ని తెలుసుకుంటాడు.

"రాజు మిత్రుల్ని పెంచుకుంటూ పోవాలి. అది మాత్రమే సరిపోదు. శత్రువుల్ని తగ్గించుకుంటూ ఉండాలి. సుగ్రీవా! మన కార్యానికి సమయం సమీపించింది. నీ మంత్రులతో కలిసి ఆలోచించావా!" అన్నాడు రాముడు.

"రామా! పోయిన రాజ్యాన్ని, సంపదను కేవలం నీవల్లనే నేను పొందగలిగాను. మీకు ప్రత్యుపకారము చేయకపోతే నన్ను మించిన అధర్మపరుడు మరొక డుండడు.

"రామా! ఇప్పటికే బలవంతులైన వానరవీరు లంతా వచ్చి ఉన్నారు. లక్షలాది మంది వానరవీరులు, భల్లూకవీరులు మార్గమధ్యంలో ఉన్నారు. కోట్ల సంఖ్యలో వీరులను సమీకరిస్తున్నాము. వారంతా వచ్చి నిన్ను దర్శిస్తారు. రావణుని, వాడి బంధువులను వధించి, సీతను తెచ్చి నీకు అప్పగిస్తారు;" అని పలికాడు సుగ్రీవుడు.

సుగ్రీవుని వచనాలు రామునికి దివ్యానందాన్ని కల్గించాయి. రాముని నేత్రాలు నల్లకలువల్లాగా వికసించాయి. రాముడు ప్రేమతో సుగ్రీవుని కౌగలించుకుని ఇలా పలికాడు.

"సుగ్రీవా! ఇంద్రుని వల్ల వర్షము, సూర్యుని వల్ల ప్రకాశము, చంద్రుని వల్ల చల్లని కాంతి ఎలా సహజములో నీవల్ల నీ స్నేహితులకు సంతోషము అలా సహజము.

"సుగ్రీవా! నీవు ప్రియభాషివి. సత్యవాదివి. ఈ విషయం నాకు బాగా తెలుసు. మంచి మనసుగల నీవంటి స్నేహితుడు నాకు లభించాడు. రాక్షసులను జయించడం ఇక పెద్ద విషయమేమీ కాదు;" అన్నాడు రాముడు.

ఈలోగా ఆకాశమంతా ధూళితో నిండి కాంతిహీన మైంది. పర్వతవాసులు, నదీతీరవాసులు, సాగరవాసులు, అరణ్యవాసులు అయిన వానరవీరులు వారివారి నాయకుల్ని ముందు పెట్టుకొని, వారి రాజ్యచిహ్నమైన ధ్వజమును చేతపట్టుకొని పెద్దపెద్ద సమూహాలుగా కదిలి వస్తున్నారు.

ఒకొక్క దండుకు నాయకత్వం వహించిన వారిలో మహావీరుడైన శతబలి, తార తండ్రి సుషేణుడు, రుమ యొక్క తండ్రి, హనుమంతుని తండ్రి కేసరి, గవాక్షుడు, శత్రుచ్ఛేదనుడైన ధూమ్రుడు, గొప్ప పరాక్రమవంతుడైన పనసుడు, పెద్ద శరీరము గల సేనానాయకుడు నీలుడు, వీరుడైన గవయుడు, దరీముఖుడు, గజుడు, భల్లూకరాజైన జాంబవంతుడు, రుమణుడు, గంధమాదనుడు, యువరాజైన అంగదుడు, అసమాన పరాక్రమవంతుడగు హనుమంతుడు ఉన్నారు. వీరంతా ఒకొక్కరు ఒక పెద్ద గుంపుకు నాయకత్వం వహిస్తూ కదలి వచ్చారు.

గొప్ప సముద్రంలా కన్పిస్తున్న ఈ వానర సమూహములో కొందరు దుముకుతూ రాగా కొందరు ఎగురుతూ వచ్చారు. కొందరు మేఘ గర్జనలు చేస్తూ రాగా, మరికొందరు విచిత్రంగా అరుస్తూ వచ్చారు. సుగ్రీవునికి నమస్కరించి విధేయులై నిలబడ్డారు.



## సీతాన్వేషణము

"రామా! ఈ వీరులంతా నా ఆజ్ఞకు లోబడి వచ్చారు. వీరంతా గొప్ప బలవంతులు. వీళ్ళు పరాక్రమంలో రాక్షసులకు తీసిపోరు. వీళ్ళు భూమి మీద, గిరుల మీదే కాక నీళ్ళలో కూడా సంచరిస్తారు.

"పూర్వము వీరంతా ఎన్నో ఘనకార్యాలు చేసి ఉన్నారు. వీరికి శ్రమ అర్థం కాదు. అలసట తెలిసిరాదు. ప్రభుకార్యాన్ని నిర్వహించడంలో ప్రాణాల్ని తృణప్రాయంగా చూస్తారు.

"రామా! ఇదంతా నీ బలగం. నీవు ఏది చెప్తే దానిని ఆచరించడానికి సంసిద్ధంగా ఉంది. ఆజ్ఞాపించు. ఈ కార్యములో చేయవలసిన కార్యాలు నాకు తెలియనివి కావు. ఐనా నీవు చెప్పినట్లే అందరూ ఆచరిస్తారు" అన్నాడు సుగ్రీవుడు.

రాముడు ఆనందాన్ని పట్టలేక సుగ్రీవుని కౌగిలించుకున్నాడు. "సుగ్రీవా! నా సీత ఇంతకీ ప్రాణాల్తో ఉందా! లేదా! అనేది మొదట తెలుసుకోవాలి. రావణుడు ఎక్కడున్నాడో తెలుసుకోవాలి. ఈ రెండు ముందుగా తెలియాలి. ఆ తరువాత ఏమి చేయాలి? అనేది నీతో సంప్రదించి నిర్ణయిస్తాను.

"సుగ్రీవా! ఈ అన్వేషణకార్యంలో నేను, లక్ష్మణుడు సమర్థులము కాము. ఆ సామర్థ్యము నీకే ఉంది. నీవల్లనే ఈ కార్యము సాధించబడుతుంది. సుగ్రీవా! ఏం చేయాలో నీవే చెప్పు.

**సుహృద్వినీతో విక్రాన్తః ప్రాజ్ఞః కాలవిశేష విత్**
**భవానస్మద్ధితే యుక్తః సుహృదాప్తోఽర్థ విత్తమః**

"సుగ్రీవా! నీవు సహృదయుడవు. వినీతుడవు. పరాక్రమవంతుడవు. ప్రాజ్ఞుడవు. కాల వైశిష్ట్యము ఎరిగినవాడవు. హితుడవు. ఆప్తుడవు. మిత్రుడవు. జ్ఞానశ్రేష్ఠుడవు;" అని పలికాడు రాముడు.

రాముని మాటలకు సంతసించిన సుగ్రీవుడు వానరవీరులకు ఆజ్ఞ లిచ్చాడు.

లక్షమంది వీరులను వెంటపెట్టుకొని తూర్పు దిక్కుగా వెళ్ళి అన్వేషించమని వానర సేనానాయకుడగు వినతునికి చెప్పాడు.

తార తండ్రి అయిన సుషేణుని సమీపించి అతనికి నమస్కరించాడు సుగ్రీవుడు. మరీచిపుత్రులతో కలిసి, వీరులైన రెండులక్షలమంది వానరవీరులను వెంటపెట్టుకొని పశ్చిమ దిక్కుకు వెళ్ళమన్నాడు.

మహావీరుడైన శతబలుని పిలిచి యమసమానులైన రెండులక్షలమంది వీరులను వెంటపెట్టుకొని, హిమవత్పర్వతము గల ఉత్తరదిక్కునకు వెళ్ళమని తెలిపాడు.

అంగదుని నాయకత్వంలో మహాబలు లైనవారిని దక్షిణదిక్కుగా వెళ్ళమన్నాడు. అంగదుని అనుసరించిన వారిలో హనుమంతుడు, నీలుడు, జాంబవంతుడు, గవయుడు, గవాక్షుడు మొదలైన వారున్నారు.

"వీరులారా! రాముడు నా మిత్రుడు. ప్రాణసమానుడు. నాకు మరువలేని, మరపురాని మహోపకారం చేశాడు. దానికి ప్రత్యుపకారం చేసే సమయం మనకు ఆసన్నమైంది. ఈ కార్యాన్ని మీరంతా పట్టుదలతో నిర్వహించాలి.

"సీతాన్వేషణము కంటే ప్రాణాలు నాకు ప్రియం కావు. ఎవడు సీతను చూసి వస్తాడో వాడు గతంలో చేసిన పాపాలన్నీ నేను విస్మరిస్తాను. వాడు నాకు ప్రియబంధువు అవుతాడు. ఎలాగైనా సీత జాడను మీరు తెలిసికొని రావాలి.

"నేను ఇప్పుడు మీకు చెప్పిన ప్రదేశాలన్నీ వెతకండి. నేను చెప్పినవి కాకుండా మరేవైనా గోచరిస్తే అవీ వెతకండి. మీకు గడువు ఒక్కమాసం మాత్రమే. ఈలోగా సీతమ్మ ఎక్కడుందో చూసి చెప్పాలి. ఈ కార్యములో సఫలీకృతు లైనవారు నాతో సమానంగా భోగాలను అనుభవిస్తారు. నెలరోజులు దాటిందా, నిర్దాక్షిణ్యంగా చంపేస్తాను. జాగర్త;" అని చెప్పి పంపాడు వానరరాజైన సుగ్రీవుడు.

ఇక్కడ ఒక విచిత్రం జరిగింది. వీరులను నాలుగు దిక్కులకు పంపేటప్పుడు, ఆయా దిక్కులలో వారు చూడవలసిన ప్రదేశాలను అద్భుతంగా వర్ణిస్తాడు సుగ్రీవుడు. భూగోళము వంతా సంపూర్ణంగా వర్ణిస్తాడు. అదీ విశేషం.

ఒకొక్క దిక్కును గూర్చి వర్ణించడానికి ఒకొక్క సర్గనే కేటాయించాడు వాల్మీకి. తూర్పు దిక్కును వలబైఐదు శ్లోకాల్లోను, దక్షిణ దిక్కును వలభై శ్లోకాల్లోను, పశ్చిమ దిక్కును వలభై ఐదు శ్లోకాల్లోను, ఉత్తర దిక్కును యాభై శ్లోకాలలోను వర్ణించడం జరిగింది.

సుమారు రెండువందల శ్లోకాలలో భూగోళములో ఆయా దిక్కులలో వచ్చే నదులను, పర్వతాలను, రాజ్యాలను, గనులను, సరస్సులను, పట్టణాలను, జనులను, వారి వేషభాషలతోపాటు ఆహారవ్యవహారములను, ఆయా ప్రాంతాలలోని ప్రయాణ సౌకర్యాలను, వనాలను, సముద్రాలను, గొప్ప వృక్షాలను, ఆశ్రమాలను, రాక్షసుల నివాసాలను, మరుభూములను, ఎడారి ప్రాంతాలను, మొగలి, తమాల, కొబ్బరి తోటలను, గంధర్వ నగరాలను, ఆయా ప్రాంతాలలో పాలించు రాజులను, నివసించు రాక్షసులను, పక్షి పర్వాదులను ఒకొక్క దిక్కులో స్థానవిశేషాలను వరుసగా వర్ణించడం మనకే కాదు, రామునికి కూడా ఆశ్చర్యాన్ని కల్గించింది.

అరణ్యకాండము చివర రామలక్ష్మణులు కబంధుని వధించినపుడు, కబంధుడు శాపవిముక్తుడై ఉత్తమలోకాలకు వెళ్ళే సమయంలో, ఈ ప్రపంచంలో సుగ్రీవునికి తెలియని ప్రదేశమంటూ లేదని చెప్పిన మాట ఈ సందర్భమున అక్షరాల సత్య మనిపిస్తుంది. కిష్కింధాకాండము ప్రారంభములో రామసుగ్రీవులు కలిసినపుడు రావణుని గూర్చి తనకు తెలియదని సుగ్రీవుడు చెప్పింది సత్యం కాదని నేను వ్యాఖ్యానించడానికి ఇది కూడా కారణము.*

* చైతన్య రామాయణము - ప్రథమభాగము - పుట 511



## రామదూత

వీరు లందరిని అన్ని దిక్కులకు పంపుతూ హనుమంతుని చూచి సుగ్రీవుడు ఇలా పలికాడు.

"వానరశ్రేష్ఠుడైన ఆంజనేయా! భూప్రపంచమున గాని, అంతరిక్షమున గాని, స్వర్గమున గాని నీ గమనానికి అడ్డు లేదు. అడ్డు ఉండదు. నీకు అన్ని లోకాలూ తెలుసు. బలపరాక్రమాల్లో గాని, వేగంలో గాని నీవు నీ తండ్రియైన వాయుదేవునకు సమానుడవు.

"ఇంతమందిని పంపుతున్నా. అన్ని దిక్కులకు పంపుతున్నా. అయినా ఈ కార్యము నీవల్లనే సాధించ బడుతుంది అని నా విశ్వాసము. ఆలోచించు. నీకు బలముంది. బుద్ధీ ఉంది. అన్నీ ఉన్నాయి. సీతమ్మ వార్త మా చెవిని పడడ మొక్కటే మిగిలుంది" అన్నాడు సుగ్రీవుడు.

సుగ్రీవుని మాటలు రాముని మనసును కదిలించాయి. సుగ్రీవునికి హనుమంతుని మీదే ఆశలున్నాయి. గతంలో అనేక కార్యాలు సాధించి ఉండడం చేతనే సుగ్రీవునికి హనుమంతుని మీద అంత నమ్మకం ఏర్పడి ఉంది. కనుక ఆంజనేయుడు తన కార్యాన్ని కూడా సాధించి తీరుతాడు అని భావించాడు రాముడు.

"హనుమా! నీ శక్తి, నీ ఉత్సాహము, సుగ్రీవుడు పలికిన విశ్వాసపూరిత వచనములను బట్టి చూస్తే నీ వల్లనే ఈ కార్యము సిద్ధిస్తుందని నా మనసు చెబుతోంది.

"ఇలారా నాయనా! ఇలా రా! ఈ ఉంగరాన్ని తీసుకో. నా పేరు చెక్కియున్న ఈ ఉంగరాన్ని చూస్తే చాలు. నీవు నావద్ద నుండి వచ్చావని సీత గ్రహిస్తుంది. నిర్భయంగా భాషిస్తుంది;" అన్నాడు రాముడు.



**స తద్గృహ్యా హరిశ్రేష్ఠః కృత్వా మూర్ధ్ని కృతాంజలిః**
**వన్దిత్వా చరణౌ చైవ ప్రస్థితః ప్లవ గర్షభః**

"వాయుపుత్రుడైన ఆంజనేయుడు ఆ ఉంగరాన్ని గ్రహించాడు. శిరస్సుపై ఉంచుకున్నాడు. చేతులు జోడించి నమస్కరిస్తూ సాష్టాంగ ప్రణామము చేశాడు."

"వాయుపుత్రా! నీ శక్తి మీదనే నాకు నమ్మకముంది. సీత దొరికేలా ఎలాగైనా ప్రయత్నించు నాయనా!" అని మళ్ళీ చెప్పాడు రాముడు.

నామాంకోపశోభితమైన ముద్రికను గ్రహించగనే హనుమంతుడు భక్తి పారవశ్యంలో మునిగిపోయాడు. రామనామ మున్న ఉంగరమును రాముడు హనుమంతునికి అనుగ్రహించాడు. ఈ క్షణం నుండి ఆంజనేయుడు నామయోగిగా మారిపోయాడు.

రామనామ మున్న ముద్రికను గ్రహించగనే హనుమంతుడు దానిని మొదట శిరస్సుపై ఉంచుకున్నాడు. ఇది స్మరణ భక్తి. మనసు సదా రామనామాన్ని, రామతత్త్వాన్ని స్మరిస్తూ ఉండాలి అని సూచించుటయే అలా శిరస్సుపై ధరించుటలోని విశేషాంశము.

**హరీ నా నామణోహో ఏక్ జియా ధారుచే**
**జీవన్ సంగ్రామణుహో ఏక్ జియా ధారుచే**

"హరినామమే జీవనాధారము. జీవిత సంగ్రామంలో మనల్ని ఉద్ధరించేది భగవన్నామమే" అంటాడు మహాభక్త శిఖామణి సంత్ సూరదాసు.

ముద్రికను తలపై ధరించిన తరువాత చేతులు జోడించి నమస్కరించాడు హనుమంతుడు. ఇక్కడ వందనభక్తి లభ్యమైందని భావము. భగవంతుని అనంత కళ్యాణ గుణాలను స్మరించడం మొదలు కావాలి. ఆ తరువాత కీర్తించడం, లేదా ఆచరించడం అలవడుతుంది.

చివరగా ఆంజనేయుడు సాష్టాంగ దండప్రణామము ఆచరించాడు. ఇది ఆత్మనివేదనా భక్తి. అంతా ప్రభుకార్యమే నని, అదికూడా ప్రభుకృప తోనే సాధ్యపడుతుందనే సంపూర్ణ శరణాగతి.

రాముడు ఇచ్చిన ముద్రికను నోటిలో ఉంచుకొని హనుమంతుడు సముద్రాన్ని లంఘించినట్లు హనుమాన్ చాలిసాలో వ్రాశాడు సంత్ తులసీదాస్

**ప్రభు ముద్రికా మేలి ముఖ మాహీ**
**జలధి లాంఘి గయే అచరజ నాహీ**


"రాముడిచ్చిన ఉంగరాన్ని నోట్లో పెట్టుకొని సాగరాన్ని సునాయాసంగా దాటావు. ఇందులో అతిశయోక్తి లేదు" అంటాడు తులసీదాస్.

నిజమే కదూ! నామమహిమ అలాంటిది. రామనామ మున్న ముద్రికను నోటిలో ధరించి హనుమంతుడు సాగరాన్ని దాటాడు. ఎవరు రామనామాన్ని నోటిలో సదా ఉంచుకుంటారో వాళ్ళు తప్పక భవసాగరాన్ని దాటగలుగుతారు.

హనుమంతుడు రాముడిచ్చిన ముద్రికను నోటిలో పెట్టుకొని వెళ్ళినట్లు హనుమాన్ చాలీసాలో తులసీదాసు చెప్పిన విషయంపై ధ్యానమగ్నులైన భక్తులు దాని కారణాన్ని అన్వేషించి పట్టుకున్నారు.

ముద్రికను నోటిలోనే ఎందుకు ధరించాడు ఆంజనేయుడు? తలమీదనే ఉంచుకుందామంటే పడిపోతుందేమో ననే భయము. వ్రేలికి అలంకరించుకుందా మనుకుంటే ప్రభువు ధరించిన ముద్రికను ధరించడం అపచారమని భావించాడట. ఎడమచేతితో పట్టుకోవడం అపరాధ మనుకుంటాడట. కుడిచేతిలో పట్టుకుందా మనుకుంటే శత్రువుల్ని ఎదుర్కోవడానికి గదను ధరించాలి. పోనీ వస్త్రంలో కట్టుకుందామని భావిస్తే లంగోటీ తప్ప దేహంపై మరొక వస్త్రము లేదు. మరి ఎలా?

అందరూ దేహాన్ని, దేహాంగాల్ని అనేక విధాలుగా అలంకరించుకుంటారు. ఒక్క వాలుకకే అలంకారము లేదు అని భావించి రాముడిచ్చిన నామము చెక్కిన ముద్రికను



నోటిలో నాలుకపై ఉంచుకున్నాడట. నిజమే కదూ! నాలుకకు అలంకారము నామమే. రామనామమే. రామనామామృతాన్ని పానం చేసేందుకు నాలుక అలవాటు పడితే ముక్తి ముంగిట నిలిచినట్లే.

**పిబరే రామరసమ్....రసనే ॥పిబరే॥**
**జనన మరణ భయ శోక విదూరం**
**సకల శాస్త్ర నిగమాగమ సారం ॥పిబరే॥**

"ఓ నాలుకా! రామ రసాన్ని పానం చెయ్యి. అది జననమరణముల వలన కలిగే భయశోకాదులను దూరం చేస్తుంది. వేదాగమాది సకలశాస్త్రముల సారభూతమైన రామరసాన్ని ఓ నాలుకా! గుటగుట తాగేయి" అంటారు సదాశివబ్రహ్మేంద్ర స్వాములవారు.

వానరులు సుగ్రీవుడు చెప్పిన విధంగా సీతాన్వేషణమునకు బయలుదేరారు. ఆ సమయంలో వానరులు తమ ప్రతాపాల్ని ప్రకటిస్తూ పలుపలు విధాల మాట్లాడారు.

"మా చేతుల్లో రావణుడు మిగలడు. వాడెక్కడున్నా వధిస్తాము. శిక్ష విధిస్తాము. వైదేహిని రామునికి అప్పగిస్తాము. అంతా మేమే చేసేస్తాము."

"అవసరం లేదు. మీరంతా ఇక్కడే ఉండిపొండి. నేనొక్కణ్ణే వాడ్ని వధిస్తాను."

"ఏమో! నీ విషయం నాకు తెలియదు. సీత పాతాళంలో ఉన్నా నేను వెతికి తీసికొని వస్తాను."

"నేనా! ఊరుకునేది! రావణుడు కంట బడనీ! చెట్టు విరిచి వాడి మీద పడేస్తాను."

"నేను భూమిని పగల గొట్టేస్తాను. అప్పుడు తెలుస్తుంది వాడికి నేనంటే ఏమిటో?"

"భూమిని నువ్వు చూసుకుంటావా! అయితే సముద్రం పని నేను పట్టేస్తా!"

"నేను నూరు యోజనాలు ఎగురుతాను."

"నువ్వు నూరుయోజనాలా! నే నంతకన్నా ఎక్కువే. కావాలంటే రా, ఇప్పుడే చూపిస్తా!'

"నేను ఎగిరానా, నాకు అడ్డుగా నేను రావలసిందే గాని, ఇంకొకడు రాలేడు. ఎవరైనా పందెం కట్టేవాళ్ళుంటే ముందుకు రండి".

ఇదీ వరుస. ఇలాగే మాట్లాడుకుంటూ అందరూ వెళ్ళారు.

"సుగ్రీవా! ఈ భూగోళం లోని సమస్త విషయాలను పూసగ్రుచ్చినట్లు చెప్పావు. ఇవన్నీ నీకు ఎలా తెలుసు?" అని ప్రశ్నించాడు రాముడు.

"రామా! పూర్వము నన్ను వధించడానికి వాలి నన్ను తరుముతూ వెంటబడినప్పుడు నేను భూమండలమంతా తిరిగాను. అప్పుడు హనుమంతు డిచ్చిన సలహా మేరకే నేను నిర్భయమైన మతంగవనాన్ని చేరాను." అన్నాడు సుగ్రీవుడు.

## ప్రయత్నాలు-ఫలితాలు

నెలరోజులు గడిచాయి. తూర్పుదిక్కుగా వెళ్ళిన వినతుడు సీతమ్మ జాడ తెలియలేదని నిరాశతో తిరిగి వచ్చాడు. ఉత్తరదిక్కుగా వెళ్ళిన శతబలుడు కూడా నిరాశతోనే తిరిగి వచ్చాడు. పశ్చిమదిక్కుగా వెళ్ళిన సుషేణుడు కూడా అలాగే వచ్చాడు.

"పర్వతాలు ఎక్కాము. వనాల్లో చరించాము. నదులు దాటాము. గ్రామాలు తిరిగాము. గుహల్లో దూరాము. పొదలను కదిలించాము. అన్ని చోట్ల అన్వేషించాము.

"వానరేశ్వరా! హనుమంతుడు గొప్ప బలవంతుడు. తేజోవంతుడు. పైగా సీత వెళ్ళిన దక్షిణ దిక్కుకే వెళ్ళియున్నాడు. సీతను గూర్చి ఆంజనేయుడు తప్పక తెలిసికొని వస్తాడు" అని పలికారు దిక్కులన్నీ గాలించి వచ్చిన కపివరులు. కపివీరులూ.

## సీతాన్వేషణలో అంగదాదులు

తారుడు, అంగదుడు, హనుమంతుడు కలిసి దక్షిణదిక్కుగా బయలుదేరారు. వింధ్యపర్వతాన్ని చేరారు. అక్కడ గుహలు, సరస్సులు, వనాలు అన్నీ వెదికారు. సీత కనిపించలేదు.

అక్కడ నుండి బయలుదేరి ఒక విచిత్రమైన వనసీమలో ప్రవేశించారు. ఆ ప్రదేశంలో చెట్లు చాలా ఉన్నాయి. కానీ వాటిలో ఏ ఒక్క చెట్టుకి కూడా ఆకులు లేవు. పూలు లేవు. పండ్లూ లేవు.

తటాకా లున్నాయి. నదీమార్గా లున్నాయి. కానీ నీరు లేదు. వన మెంతో ఉంది. కానీ వన్యమృగాలు లేవు. దీనికి కారణం కండుమహర్షి శాపం.

కండుమహర్షికి పది సంవత్సరముల బాలు డుండేవాడు. పది సంవత్సరాలకే ఆ బాలుడు మరణించాడు. కుమారుని బ్రతికించుకోవాలని కండుమహర్షి ఎంతగానో ప్రయత్నం చేశాడు. లాభం లేకపోయింది.

ఆయనకు చేదోడుగా ఎవ్వరూ సహకరించలేక పోయారు. బిడ్డను బ్రతికించు కోవడానికి ఆ వనంలో ఓషధు లేవీ ఉపకరించలేదు. మహర్షికి కోపం వచ్చింది.

"పరోపకారము లేని ప్రాణులు ఉండేకంటే లేకపోవడమే మంచిది" అని భావించాడు. ఆనాటి నుండి వనశోభ నశించింది. వన్యప్రాణులు గతించాయి. ఆనాటి నుండి ఆ వనం నిర్జన ప్రదేశంగా, శూన్యవనంగా మారిపోయింది.

భగవంతుడు మనకు ఎన్నో ఇస్తాడు. అవన్నీ భగవానుని కృపావిశేషాలే గాని మన కృషిఫలితాలు కావు. ఈ సత్యాన్ని గ్రహించి ఫలాసక్తి లేకుండా త్యాగబుద్ధితో జీవించువారు పరమాత్మ కృపకు పాత్రులై తరిస్తారు. లేదా, ఈ శూన్యవనం లాగా నిరుపయోగమై మిగుల్తారు.

వానరులు ఆ ప్రాంత మంతా అన్వేషించారు. సీత జాడ తెలియలేదు. ఈలోగా ఆ వనంలో రాక్షసు డొకడు కనిపించాడు వారికి. వాడే రావణుడని కొందరు వానరులు భావించారు. వెంటనే వాణ్ణి అంగదుడు పట్టుకొని కొట్టి చంపేశాడు.

అన్వేషించి అలసిపోయిన వానరులు నిరాశ చెంది ఒక చెట్టుక్రింద కూర్చున్నారు. అంగదుడు వారికి నూతనోత్సాహాన్ని కల్పిస్తూ ఇలా మాట్లాడాడు.

"కపివీరులారా! నిరాశ చెందకండి. సుగ్రీవుడు ఉగ్రశాసనుడు. మనం బయలుదేరి ఇప్పటికే చాలాకాల మైంది. సోమరితనాన్ని విడిచేయండి. నిద్రను మరచిపొండి. దుఃఖాన్ని త్యజించండి.



"కార్యసిద్ధికి దిగులు లేకుండుట, నేర్పు కలిగి వర్తించుట, మనస్సును ఉత్సాహముగా ఉంచుకొనుట అనునవి ప్రధాన విషయాలుగా చెబుతారు. మీరంతా ఉత్సాహంతో మళ్ళీ వెదకడం ప్రారంభించండి.

**అవశ్యం కుర్వతాం తస్య దృశ్యతే కర్మణః ఫలమ్**
**పరం నిర్వేద మాగమ్య న హి నో మీలనం క్షమమ్**

"పని చేసేవారికి ఫలితం ఎప్పుడైనా లభిస్తుంది. దిగులుపడి కూర్చుంటే కళ్ళుమూయడం కూడా సాధ్యం కాదు;" అన్నాడు.

అంగదుని మాటలు ఆలకించిన వానరులు మరల వింధ్యారణ్యమంతా గాలించారు. తిరిగి తిరిగి అలసిపోయారు. దప్పికతో బాధపడుతూ నీటికోసం చూస్తున్నారు.

ఈలోగా వారికి గుహ లాంటి బిలం కన్పించింది. క్రౌంచపక్షులు, సారసపక్షులు, చక్రవాకములు ఆ బిలం నుండి బయటికి రావడం చూశారు. లోపల నీరు నిండిన కూపము గాని, తటాకము గాని ఉంటుందని సందేహించారు. హనుమంతుని మాటను విని అందరూ నీటి కొరకు ఆ బిలంలో ప్రవేశించారు. చీకట్లు ముసిరి యున్న ఆ బిలంలోకి ప్రవేశించడమే చాలా కష్టంగా ఉంది. వానరులు ఒకరి నొకరు చేతులు పట్టుకొని ఆ బిలంలో ప్రవేశించారు.

## స్వయంప్రభ

పక్షులు బయటకు వచ్చిన దారినే వానరులు లోనికి ప్రవేశించారు. కొంత దూరము అలాగే చీకటిలో పయనించిన తరువాత వారు దివ్యప్రకాశంతో కూడిన ఒక ప్రదేశాన్ని చూశారు.

అక్కడ అగ్ని లాగా వెలిగిపోయే బంగారు వృక్షాలు కన్పించాయి. వాటిమీద చక్కని లతలు ప్రాకి ఉన్నాయి. అవి కూడా స్వర్ణలతలే. పూలు బాగా పూసి ఉన్నాయి. కాయలు కూడా కాసి ఉన్నాయి. అయితే అవి కూడా బంగారువే. ఆ చెట్లకు అందమైన అరుగు లున్నాయి. వైడూర్యములచే పొదిగి ఉన్నాయి.

ఆ ప్రదేశములో బంగారు గృహాలు, వెండి మేడలు ఉన్నాయి. కిటికీల వలలు ముత్యాలతో అమర్చబడి ఉన్నాయి. విచిత్రమైన ఈ వనశోభను వారు తిలకిస్తున్నారు. ఇంతలో అక్కడ వారికి ఒక స్త్రీ కనిపించింది.

చూడగానే ఆమె గొప్ప తపస్వినిగా కన్పించింది. నారబట్టలు కట్టుకోనుంది. జింకచర్మము చుట్టుకోనుంది.

హనుమంతుడు ఆమెను సమీపించాడు. చేతులు జోడించి నమస్కరించాడు. "నువ్వెవరు? ఈ బిలము ఎవరిది? భవనాలూ, రత్నరాశులు?" అంటూ ప్రశ్నించాడు.

"ఆకలి దప్పికలతో బాధపడుతూ మేము నీటికొరకై ఈ బిలంలో ప్రవేశించాము. ఇక్కడే ఆశ్చర్యాన్ని గొలిపే వస్తువుల్ని చూసి భ్రాంతి చెంది యున్నాము. బాలభానుని వలె ప్రకాశిస్తున్న ఈ బంగారు చెట్లు, బంగారు ఇళ్ళు, బంగారు విమానాలు, వెండి గృహాలు ఎవరివి? ఇదంతా మీ ప్రభావమా? లేక మరొకరి తపోబలమా? మాకు అన్నీ చెప్పు" అని హనుమంతుడు ఆ యోగినిని ప్రశ్నించాడు. ఆవిడ చెప్పడం ఆరంభించింది.

"వానరోత్తమా! పూర్వము మయు డనేవాడు ఉండేవాడు. అతనికి తెలియని మాయలు లేవు. మయుడు తన మాయ చేత ఈ పసిడివనాన్ని తయారు చేశాడు.

"మయుడు కొన్ని వేల సంవత్సరాలు తపస్సు చేశాడు. బ్రహ్మదేవుని నుండి వరాన్నే గాక, కుబేరుని సంపదను కూడా పొందినాడు. మయుడు ఈ విచిత్రవనంలో కొంతకాలం హాయిగా జీవించాడు.

"హేమ అనే అప్సరస్త్రీ ఉండేది.* ఆమె యందు మయునికి ఆసక్తి ఉండేది. అది తెలిసి దేవేంద్రుడు వజ్రాయుధముతో మయుని వధించాడు. ఉత్తమమైన ఈ వనాన్ని, స్వర్ణ భవనాలను బ్రహ్మదేవుడు హేమకు ఇచ్చాడు.

"వానరశ్రేష్ఠా! నేను మేరుసావర్ణి కుమార్తెను. నా పేరు స్వయంప్రభ. హేమ నా స్నేహితురాలు. ఆమె మాట ప్రకారము నేను ఈ భవనాన్ని రక్షిస్తూ ఉన్నాను.

"నాయనా! మీరు ఏ కార్యార్థమై వచ్చారు? ఈ అరణ్యాల్లో ఎందుకు తిరుగుతున్నారు? దుర్గమమైన ఈ ప్రదేశానికి ఎలా రాగలిగారు?

"సరే. తరువాత చెబుదురుగానీ. ముందు ఆ పండ్లు తినండి. తియ్యని ఆ నీరు త్రాగండి;" అన్నది స్వయంప్రభ.

వానరులు భుజించడం ప్రారంభించారు. తిననివ్వండి వాళ్ళను. చాలా అలసిపోయి ఉన్నారు కదా! వాళ్ళు పూర్తి చేసేలోగా మనం కొన్ని కబుర్లు కమనీయంగా చెప్పుకుందాం!

రామాయణంలో సీతారాములు, భరతలక్ష్మణులు, రావణకుంభకర్ణులు, సుగ్రీవాంజ నేయాదులు కథలో ప్రధాన పాత్రలుగా ధగధగమని మెరుస్తున్నా, అక్కడక్కడ మెరుపులా మెరిసి మళ్ళీ కనిపించకుండా అదృశ్యమయ్యే పాత్రలు చాలా ఉన్నాయి.

అందులో కొన్ని చిన్న పాత్రలు తమదైన ప్రత్యేక సందేశంతో ప్రకాశించి కనుమరు గవుతాయి. మరికొన్ని చిన్న పాత్రలు చెప్పకుండానే కథను మలుపు త్రిప్పుతూ పోతాయి.

ఇప్పటివరకు మనం చూపిన పాత్రలలో అహల్య, శబరి, శరభంగ, సుతీక్ష్ణాది పాత్రలు వాటివాటి ప్రత్యేకతను నిరూపించుకుంటూ పోయాయి. సమాజానికి ఏదో చెప్పుకుంటూ పోయాయి.

అలాగే మంథర, శూర్పణఖ, అనసూయ, విరాధ, అగస్త్య, జటాయువు, కబంధుడు, మారీచుడు, స్వయంప్రభ లాంటి చిన్న పాత్రలు చాలా వచ్చాయి. వీటిలో కొన్ని శిష్టపాత్రలు. కొన్ని దుష్టపాత్రలూను. ఏవైనప్పటికీ ఇవన్నీ మూలకథను ఏదో ఒక మూలకు త్రిప్పుతూనే నడిచాయి.

ఇప్పుడు స్వయంప్రభ మనముందు దివ్యంగా ప్రకాశిస్తుంది. ఈ పాత్ర తనకుతానుగా దివ్యమైన సందేశా న్నందిస్తూ ఉంది. అంతేకాదు. సీతాన్వేషణములో ఈ పాత్ర ప్రముఖ స్థానాన్ని ఆక్రమించిందని చెప్పాలి.

ఒకవిధంగా చూస్తే స్వయంప్రభకు, శబరికి చాలా దగ్గరి పోలిక లున్నట్లు రామాయణాన్ని చదివిన వారి కెవరికైనా తెలిసిపోతుంది.

* ఈ హేమ మయులకు పుట్టిన బిడ్డయే రావణుని ధర్మపత్ని మండోదరి.



శబరి లాగా స్వయంప్రభ కూడా ఒంటరిగ తపోజీవనంలో ఉంది. మహర్షులు చూడమని చెప్పి వెళ్ళిన మతంగవనాన్ని శబరి రక్షిస్తూ ఉండింది. హేమ చెప్పివెళ్ళిన ఈ విచిత్ర వనాన్ని స్వయంప్రభ కాపాడుతూ ఉంది.

శబరి, స్వయంప్రభ ఇద్దరూ తపస్వినులే. రామలక్ష్మణులకు శబరి ఆతిథ్య మిస్తే, అంగద హనుమదాదులకు స్వయంప్రభ ఆతిథ్య మిచ్చింది. మూలకథతో శబరికి సంబంధము లేదు. కానీ కథను ఒక చక్కని మలుపు తిప్పుతుంది స్వయంప్రభ.

శబరి నివసించిన వనాన్ని **"తద్వనం"** అని అద్భుతంగా వర్ణించిన వాల్మీకి స్వయంప్రభ వసించే ఈ వనాన్ని **"మహద్వనం"** అని, **"మహావనం"** అని, **"వనముత్తమమ్"** అని అమోఘంగా కీర్తించాడు. శబరి "తద్వనం" లాంటిదే స్వయంప్రభ "మహద్వనం" కూడా.

ఒక బిలం గుండా వెళ్ళినపుడే 'మహద్వనం' లోకి ప్రవేశించ గలుగుతారు. బిలం నుండి బయటికి వస్తున్న పక్షుల్ని చూచి అక్కడ నీరుంటుందని అనుమానించి లోనికెళ్ళారు హనుమదంగదాదులు.

అంతర్ముఖులై ఆనందాన్ని అనుభవించిన వారు బహిర్ముఖులై గోచరించినపుడే వారి అనుభవాలను ఆధారంగా తీసికొని ముముక్షువులు మోక్షసాధన మార్గంలో పయనిస్తారు.

లోనికి వెళ్ళే బిలం అంధకారమయంగా ఉంది. వానరులు చాలా కష్టపడి నడిచారు. ఒకర్ని మరొకరు పట్టుకొని మరీ నడిచారు. లోని కెళ్ళగానే దివ్యమైన ప్రకాశం గోచరించింది. అంతే కాదు. స్వయంప్రభ కూడా గోచరించింది.

ఆధ్యాత్మికసాధన లన్నీ ప్రారంభదశలో అంధకారబంధురం గానే ఉంటాయి. కష్టమైనా వానరులు ఎలా ప్రవేశించారో మనం కూడా అలాగే శ్రమించి చరించాలి. తరించాలి.

వానరులంతా చీకటిప్రదేశంలో ఒకర్ని మరొకరు పట్టుకొని నడిచారు. ఆధ్యాత్మిక మార్గంలో చరించే వారంతా ఒకరి కొకరు చేదోడుగా ఉండి చరించాలి. అదే సత్సంగము. సత్పురుష సాంగత్యము. చీకటిని దాటి వెలుగును దర్శించుటకు ఉపకరించేదే సత్సంగము.

బిలం ద్వారా వానరులు లోని కెళ్ళగానే అక్కడ స్వయంప్రభ కన్పించింది. 'స్వయంప్రభ' అనగా స్వీయమైన కాంతి. మరొక దానిపై ఆధారపడని ప్రకాశము. అదియే ఆత్మప్రకాశము. అదియే స్వయంప్రభ.

**అయమాత్మా నిత్యసిద్ధః ప్రమాణే సతి భాసతే**
**న దేశం నాపి వా కాలం న శుద్ధిం వాప్యపేక్షతే ॥**

"ఈ ఆత్మ నిత్యసిద్ధమైనది. సరైన ప్రమాణం లభించినపుడు ప్రమేయమైన ఆత్మ దివ్యంగా శోభిస్తుంది. అది దేశానికి, కాలానికి, ఆచారానికి పరిమితం కాదు" అని ఆదిశంకరులు తమ వివేకచూడామణి గ్రంథంలో వివరిస్తారు.

ఆత్మజ్ఞానము దివ్యానంద స్వరూపము. అక్కడ ఆకలిదప్పులనే దేహధర్మా లుండవు. సుఖదుఃఖాలనే మనోధర్మా లుండవు. జయాపజయాలనే బుద్ధిధర్మా లుండవు. అది ఓటమి నెరుగని విజయం. అది ఆనంద నిలయమే గాని అసంతృప్తికి ఆశ్రయం కాదు. అదే స్వయంప్రభ ఆతిథ్యం. స్వయంజ్యోతి ఆశ్రయం.

వానరులు ఫలములు భుజించారు. తియ్యని ఉదకాన్ని పానం చేశారు. సంతుష్టాంతరంగ చిత్తులై కన్పిస్తున్నారు. ఇప్పుడు స్వయంప్రభ మెల్లగా విషయాన్ని ప్రస్తావించింది.

"నాయనా! ఫలములు ఆరగించుట వలన మీ అలసట తీరిందా? మీ వృత్తాంతాన్ని నాకు చెప్పవచ్చు అని భావిస్తేనే చెప్పండి" అని సున్నితంగా అడిగింది స్వయంప్రభ.

హనుమంతుడు చెప్పడం ప్రారంభించి, రాముని అరణ్యవాసం, సీతాపహరణం, రామ సుగ్రీవ మైత్రి, సీతాన్వేషణము మొదలగు విషయాలన్నీ చక్కగా వివరించాడు.

"అమ్మా! ఆకలితో బాధపడుతున్న మాకు ఆతిథ్యాన్నిచ్చి కాపాడావు. నీకు ప్రత్యుపకారంగా మేము చేయగలిగింది ఏమిటో చెప్పు" అని అడిగాడు ఆంజనేయుడు.

హనుమంతుని మాటలు విని స్వయంప్రభ పలికిన సమాధానము ఆమె స్థాయికి అద్దం పడుతుంది. ఈ సందర్భములో స్వయంప్రభను "సర్వజ్ఞురాలు" అని వాల్మీకి ప్రస్తుతించడం జరిగింది.

**సర్వేషాం పరితుష్టాస్మి వానరాణాం తరస్వినామ్**
**చరన్త్యా మమ ధర్మేణ న కార్య మిహ కేన చిత్ ॥**

"నాయనా! మీ విషయమును ఆలకించి సంతోషించాను. ధర్మమే ముఖ్యంగా భావించి జీవించే నాకు కావలసింది ఏమీ లేదు".

స్వయంప్రభ ఎంతగా సంతృప్తి చెంది ఉందో, ఆప్తకామురాలై ఉందో పై వాక్యాన్ని బట్టి గ్రహించవచ్చు.

హనుమంతుడు ఆలోచించాడు. ఆమెను మరియొక కోరిక కోరడానికి మనసు సంశయిస్తున్నా, ధర్మజ్ఞురాలైన ఆ మహాసాధ్విని, మహాయోగినిని కోరడంలో తప్పు లేదని భావించాడు.

"అమ్మా! నీవు ధర్మస్వరూపిణివి. ధర్మాశ్రయురాలవు. మేము నిన్ను శరణు జొచ్చినాము. దిక్కు తెలియక ఈ బిలంలో పరిభ్రమించుట లోనే సుగ్రీవుడు పెట్టిన గడువు అయిపోయింది.

"మేము గొప్ప కార్యంలో, రాముని కార్యంలో నిమగ్నులై ఉన్నాము. మేము బయటకు వెళ్ళి సీతను అన్వేషించాలి. ఇక్కడనుండి ఎలా బయటకు వెళ్ళాలో మాకు తెలియడం లేదు" అన్నాడు హనుమంతుడు.

"నాయనలారా! ఈ బిలములో ప్రవేశించినవారు మళ్ళీ తిరిగి వెళ్ళలేరు" అన్నది స్వయంప్రభ.

**న తద్భాసయతే సూర్యో న శశాంకో న పావకః**
**యద్గత్వా న నివర్తన్తే తద్ధామ పరమం మమ ॥**

"దానిని సూర్యచంద్రాగ్నులు ప్రకాశింప చేయలేరు. దేనిని చేరిన పిదప తిరిగి రావడం అంటూ ఉండదో అదియే నా ధామము" అని శ్రీకృష్ణపరమాత్మ భగవద్గీత- పురుషోత్తమప్రాప్తి యోగంలో తెలుపుతారు.

సూర్యచంద్ర నక్షత్రాలు ప్రకాశించలేని వెలుగు కనుక అది ఆత్మప్రకాశము. అదియే స్వయంప్రభ. ఆ బిలమే హృదయగుహ. అక్కడ కలిగే ఆనందమే నిర్వికల్పము.



"వానరులారా! మిమ్మ ల్నందరిని దాట శక్యము గాని ఈ బిలాన్ని దాటిస్తాను. మీరంతా కళ్ళు మూసుకోండి" అన్నది స్వయంప్రభ. వానరులంతా కళ్ళు మూసుకున్నారు. అంతే. క్షణంలో వారు బయట ఉండేలా చేసింది స్వయంప్రభ.

"నాయనలారా! ఇది వింధ్యపర్వతము. అది ప్రస్రవణ పర్వతము. అదిగో. అదే మహాసముద్రము. మీకు శుభం కలుగుగాక! నేను నా స్థానానికి వెళ్తున్నాను" అని పలికి స్వయంప్రభ బిలంలో ప్రవేశించింది.

స్వయంప్రభ నివసించే గుహలో ఒకసారి ప్రవేశించిన వారు తిరిగి బయటకు రాలేరు. వానరులు రామకార్యంలో నిమగ్నులై ఉన్నందున లోకకళ్యాణాన్ని దృష్టిలో ఉంచుకొని స్వయంప్రభ వారిని వెలుపలికి చేర్చింది.

సదా అంతర్ముఖుడై, నిర్వికల్ప సమాధి కొరకు ప్రయత్నిస్తూ ఉండిన నరేంద్రుని, ఆ ప్రయత్నము నుండి మరలించి, బహిర్ముఖం చేసి, నీవు కోరినప్పుడు నిర్వికల్ప సమాధి నీ ద్వారం ముందు నిలబడుతుంది. నీవు వెళ్ళి లోకోద్ధరణ గావించు అనిన రామకృష్ణపరమహంస సంకల్పాన్ని, స్వయంప్రభ చేసిన సత్కార్యాన్ని విజ్ఞులు పోల్చుకోగలరు.

దైవకార్యానికి సిద్ధమైయున్న వానరశ్రేష్ఠులను బహిర్గతం చేసింది స్వయంప్రభ. లోకకళ్యాణానికి వివేకానందస్వామిని బహిర్ముఖం చేశారు పరమహంస.

స్వయంప్రభ సహకరించకుంటే హనుమదాదులు బయటకు రాలేరు. సీతాన్వేషణము జరుగదు. రావణవధ జరుగదు.

పరమహంస ప్రోత్సహించకుంటే హిందూధర్మ వైభవము చికాగో విశ్వమత మహాసభలో వినిపించేది కాదు.

మహాత్ములు వేసిన బాటను సుగమం చేయాల్సింది కూడా మహాత్ములే కదూ! అదే ఇదంతా. యుగాలు మారినా, తరాలు మారినా అదే మనకు తరగని ధనం. అరగని చైతన్యఘనం.

## అంగదుని ప్రాయోపవేశం

స్వయంప్రభ బిలంలోకి వెళ్ళిపోయింది. వానరులందరూ సముద్రం కేసి చూశారు. కల్లోల కెరటాలతో సముద్రం భయంకరంగా గర్జిస్తోంది. కపివరుల మనసులు కూడా కల్లోలంగా తయారయ్యాయి. సుగ్రీవుడు ఇచ్చిన గడువంతా బిలం లోనే ఖర్చయిపోయింది.

వింధ్యపర్వత పాదం వద్ద కూర్చున్నారు వానరులందరూ. అక్కడ లతలు, చెట్లు పుష్పించి ఉండడం చూశారు. వసంతం వచ్చేసిందని కలత చెందారు. ఇలా పరస్పరం చర్చించుకుంటూ ఉండగా అంగదుడు ఇలా పలికాడు.

"ఓ వానరోత్తములారా! సుగ్రీవుడు మనకు ఒక మాసం గడువు ఇచ్చాడు. బిలంలో ఉండగానే అది గడచిపోయింది. ఇప్పుడు మనం ఏమి చెయ్యాలి?

"సుగ్రీవుడు తీక్షణమైన స్వభావము కలవాడు. పైగా రాజు. కార్యాన్ని సాధించకుండా మనం తిరిగివెళ్తే తప్పక వధిస్తాడు. అక్కడ చిత్రవధను అనుభవించడం కన్నా ఇక్కడ మరణించడమే మంచిది.

"నన్ను సుగ్రీవుడు యువరాజును చేశాడని మీరు భ్రమిస్తున్నారేమో! అదంతా రాముడు చేసిందే. వాలి కుమారుణ్ణి అయినందువల్ల సుగ్రీవుడు నామీద కనిపించకుండా ద్వేషబుద్ధి కలిగియే ఉంటాడు. ఈ అవకాశాన్ని ఆసరాగా తీసికొని నన్ను చంపేస్తాడు. కనుక ఈ సముద్ర తీరమున మనము ప్రాయోపవేశము చేయుటయే మంచిది" అన్నాడు అంగదుడు.

అంగదుని అభిప్రాయంతో వానరులంతా ఏకీభవించారు. తారుడు ఇలా పలికాడు. "మీరు దుఃఖించకండి. మీరంతా ఇష్టపడితే మనం మళ్ళీ ఈ బిలంలోకి ప్రవేశించి అక్కడే ఉండిపోతాం. మనకు చక్కని, కమ్మని ఆహార పానీయాలు అక్కడ ఉన్నాయి.

"మయుడు నిర్మించిన ఆ మాయాబిలం లోకి సుగ్రీవుడు రాలేడు. ఇంద్రుడు రాలేడు. రాముడు కూడా రాలేడు;" అన్నాడు.

అంగదుని మాటలు ఆంజనేయునిలో సందేహాన్ని రేకెత్తించాయి. అంగదునికి రాజ్యకాంక్ష మొదలైందని గ్రహించాడు మారుతి. అంగదుని మనసును మార్చడానికి ప్రయత్నము ప్రారంభించాడు.

"అంగదా! నీవు నీ తండ్రి వలె గొప్ప వీరుడవు. ఆ విషయంలో సందేహం లేదు. వానరరాజుగా కూడా నీవు సమర్థుడవే. కానీ ఒక్కవిషయం ఆలోచించు. ఈ వానరులు స్థిరచిత్తులు కారు. పైగా భార్యాపిల్లలకు దూరంగా ఉన్నారు.

"వీరంతా నీకు కట్టుబడి ఉంటారనుకోవడం పొరపాటు. నీలుడు, జాంబవంతుడు, సుహోత్రుడు, నేను-అందరము సుగ్రీవునికి విశ్వాసపాత్రులమే. ఈ బిలంలో దాగితే ఎవ్వరేమి చేయలేరని తారుడు చెప్పిన మాటను నీవు నమ్ముతున్నావు. లక్ష్మణుని బాణాలు ఈ బిలాన్ని ఆకుదొప్పలా చీల్చేస్తాయి.

"అంగదా! ఈ బిలంలో నువ్వు ప్రవేశించగానే వానరులంతా నిన్ను విడిచిపెట్టి వెళ్తారు. నీవు ఏకాకిగా మిగిలిపోతావు. గడ్డిపరక కదలినా భీతి చెందే స్థితికి చేరుతావు. అనవసరంగా పిచ్చి ఊహలు చేయకు.

"సుగ్రీవుడు నీకు పినతండ్రి. ధర్మాత్ముడు. ప్రేమమయుడు. సత్యప్రతిజ్ఞ కలవాడు. నీకు అతడు అన్యాయం చేయడు. మీ తల్లి అంటే సుగ్రీవునికి ఎంతో ప్రేమ. పైగా అతనికి బిడ్డలు కూడా లేరు;" అన్నాడు హనుమంతుడు.

ఆంజనేయుని మాటలకు అంగదుడు ఆవేశపూరితు డయ్యాడు. "సుగ్రీవునిలో సాధుత్వము లేదు. ఋజుత్వము లేదు. ధైర్యం లేదు. పరాక్రమం లేదు. అన్న బ్రతికి ఉండగానే తల్లితో సమానమైన అన్న భార్యను అపహరించిన కాముకుడు. అన్న యుద్ధానికి వెళ్ళియుండగా బిలాన్ని మూసేసిన అధర్మపరుడు.

"ఈ సీతాన్వేషణ కార్యము కూడా సుగ్రీవుడు లక్ష్మణునకు భయపడి చేసిందే కాని రామునిపై ప్రేమ ఉండి కాదు. అతడు పాపి. కృతఘ్నుడు. చపలచిత్తుడు. నన్ను రహస్యంగానైనా వధిస్తాడు.



"నేను శపథం చేసి మరీ చెబుతున్నాను. నేను కిష్కింధకు రాను. ఇక్కడే ప్రాయోపవేశం చేస్తాను. నాకు మరణమే శ్రేయస్కరము;" అని పలికి అక్కడే దర్భలు పరచుకొని పడుకున్నాడు.

వానరు లందరూ అంగదుణ్ణి చూసి జాలిపడ్డారు. సుగ్రీవుని నిందించారు. వాలిని స్తుతించారు. వారు కూడా ప్రాయోపవేశానికి సంసిద్ధు లయ్యారు.

## సమయానికి సంపాతి సహాయం

అనుకున్నది అనుకున్నట్లు జరగనపుడు కొందరికి అప్రస్తుత, అనర్థ, అసందర్భపు టాలోచనలు వస్తుంటాయి. అంగదుని పరిస్థితీ అంతే. భయం వల్ల కలత చెందిన అంగదుడు అయోమయంగా తయారయ్యాడు. అంతే కాదు. అందరినీ కల్లోల పరచాడు. అందరూ ప్రాయోపవేశానికి కూర్చుంటున్నారు. వీరి బుద్ధిని మార్చడానికి ఆంజనేయుడు ప్రయత్నిస్తున్నాడు. ఈలోగా భయంకరమైన శబ్దం వినిపించింది.

వింధ్యపర్వత గుహలో నివసిస్తున్న గృధ్రరాజు సంపాతి ఆ వానరులను చూశాడు. సంతోషించి ఇలా పలికాడు.

"కర్మానుసారంగా ఎవరెవరికి ఏవి ఫలితా లివ్వాలో దైవం ఇస్తూనే ఉంటుంది. ఇంత కాలానికి ఆశించకుండా నాకీ ఆహారం లభిస్తోంది. ఈ వానరుల వరుసలో ఎవరెవరు మరణిస్తూ ఉంటే వారిని కమ్మగా భుజిస్తుంటాను;" అని పలికిన సంపాతి మాటలు వానరులకు విన్పించాయి.

సంపాతి మాటలు విని అంగదుడు కలత చెందాడు. దుఃఖిస్తూ హనుమంతునితో ఇలా పలికాడు.

"చూశావా! వానరులను సంహరించడానికి యముడే ఈ గ్రద్ద రూపంలో వచ్చా డనిపిస్తోంది. రాముని కార్యము ఎలాగూ చేయలేక పోయాం. పైగా ఈ ఆపదలో చిక్కుకున్నాం.

"రామకార్యంలో జటాయువు ప్రాణాలను సైతము లెక్క చేయలేదు. మనమూ అలాగే వచ్చాము. కానీ సీత జాడను తెలుసుకోలేక పోయాము. జటాయువు అదృష్టవంతుడు. రావణుని చేతిలో హతుడైనా రామకార్యాదురంధరు డైన జటాయువు ఉత్తమ లోకాలను పొందినాడు;" అని అంగదుడు పలికిన మాటల్ని సంపాతి వినడం జరిగింది.

"ఏమిటి? నా సోదరుడు జటాయువు మరణించాడా? ఇంతకాలానికి నా సోదరుని పేరు నాకు వినిపించింది. కానీ ఎంత దుర్వార్తను వినవలసి వచ్చింది! వానరశ్రేష్ఠులారా! నా సోదరుని మరణం ఎలా జరిగిందో చెప్పండి" అని అడిగాడు గృధ్రరాజు సంపాతి.

"పక్షిరాజా! ఇక్ష్వాకు వంశీయుడు దశరథుడు. ఆయన భూప్రపంచానికే రాజు. ఆయన కుమారుడు రాముడు. ధర్మాత్ముడు. తండ్రి మాటను పాలించుటకై భార్య సీతను, తమ్ముడైన లక్ష్మణుని వెంటబెట్టుకొని రాముడు అరణ్యానికి వచ్చాడు.

"జనస్థానంలో వారు నివసిస్తుండగా రాముని భార్యను రాక్షసుడైన రావణుడు అపహరించాడు. రాముని తండ్రి దశరథునికి జటాయువు మిత్రుడు. జటాయువు రావణుని ఎదుర్కొని అతని రథాన్ని విరగకొట్టాడు. కానీ వృద్ధాప్య కారణంగా అలసిపోయి రావణుని చేతిలో మరణించాడు.

"రాముడు జటాయువుకు అంతిమసంస్కారం చేశాడు. రాముడు సీతను అన్వేషిస్తూ వచ్చి మా పినతండ్రి సుగ్రీవునితో స్నేహం చేశాడు. సుగ్రీవునికి విరోధి అయిన మా తండ్రి వాలిని వధించి సుగ్రీవునకు రాజ్యాన్ని కట్టబెట్టాడు రాముడు.

"సుగ్రీవుడు మమ్మల్నందరినీ సీతాన్వేషణ కార్యంలో పంపించాడు. రాత్రిపూట సూర్యుని గాంచలేనట్లు మేము సీత జాడను తెలుసుకోలేక పోయాం. ఈలోగా మయుడు నిర్మించిన గుహలో చిక్కుకొని పోయాం. సుగ్రీవుడు పెట్టిన గడువు కాస్తా పూర్తయింది. సుగ్రీవునికి భయపడి మేము ప్రాయోపవేశం చేస్తున్నాము" అని అంగదుడు సంపాతితో చెప్పాడు.

అంగదుని మాటలు ఆలకించిన సంపాతి దుఃఖంతో కుమిలిపోతూ వానరులతో ఇలా పలికాడు.

"వానరులారా! రావణుని ఎదిరించి పోరాడి ప్రాణాలు విడిచాడని మీరు చెప్పుకుంటున్న జటాయువు ఎవరో కాదు. నా తమ్ముడే. నన్ను సంపాతి అంటారు. నేను బాగా వృద్ధాప్యంలో ఉన్నాను. పైగా రెక్కలు లేనివాణ్ణి. లేనిచో నా సోదరుడి మరణానికి కారణమైన రాక్షసుని అంతం చూసుండేవాణ్ణి.

"నాయనా! పూర్వము వృత్రాసురసంహారం జరిగిందే, అప్పటి మాట. నేను, నా తమ్ముడు జటాయువు పందెం కట్టుకొని మండుచున్న సూర్యుని చేరేందుకు ఎగిరాము. చాలా వేగంగా ప్రయాణం చేశాము.

"మధ్యాహ్న మయింది. సూర్యుని తీక్షణత పెరిగింది. అది భరించలేక జటాయువు వివశు డయ్యాడు. అది చూసిన నేను నా తమ్ముడైన జటాయువును ప్రేమతో దగ్గరికి తీసికొని నా రెక్కలతో కప్పాను. నా తమ్ముడు రక్షింపబడ్డాడు. నా రెక్కలు కాలిపోయాయి. నేను ఈ వింధ్య పర్వతము మీద పడ్డాను. ఆనాటి నుండి నా సోదరుని వృత్తాంతము నాకు తెలియ లేదు" అన్నాడు సంపాతి.

"ఓ గృధ్రరాజా! నీవు మహాత్ముడైన జటాయువు సోదరుడివా! అయితే, సీతను అపహరించిన రాక్షసుని గూర్చి నీకు తెలిసివుంటే మాకు చెప్పు;" అన్నాడు అంగదుడు.

"వానరులారా! రెక్కలు నశించిన నేను పరాక్రమవంతుణ్ణి కాను. రాముని కార్యానికి కనీసం మాటసహాయమైనా చేసి తృప్తి చెందుతాను.

"నాయనా! నేను ఇప్పటివాణ్ణి కాను. ఈనాటి వాణ్ణి కాను. దేవదానవ యుద్ధాన్ని, క్షీరసాగర మథనాన్ని నేను చూసి ఉన్నాను. నేను శక్తిహీనుడనై ఉన్నాను. లేనిచో రాముని కార్యాన్ని అవలీలగా చేసిపెట్టుండేవాణ్ణి.

"సర్వాభరణ భూషితయై, రూప సంపన్నురాలైన యువతిని రావణుడు తీసికొని పోవుటను నేను చూశాను. ఆమె ఆభరణాలను క్రిందికి విడిచిపెడుతూ వెళ్ళింది. "రామా-లక్ష్మణా" అని అరుస్తూ, ఏడుస్తూ, పాములాగా మెలికలు తిరుగుతూ వెళ్ళింది.



"రాముని పేరు ఉచ్చరించింది కనుక ఆమె సీతయే నని ఇప్పుడు భావిస్తున్నాను. నాయనా! నాకు దివ్యదృష్టి ఉంది. సీత ఎక్కడుందో చూసి చెప్తాను వినండి.

"వానరులారా! సీతను అపహరించిన రావణుడు విశ్రవసుని కుమారుడు. కుబేరుని సోదరుడు. వాడిప్పుడు లంకలో ఉన్నాడు. లంక ఇక్కడికి నూరు యోజనముల దూరాన ఉంది. సముద్రములో ఒక ద్వీపమునందు విశ్వకర్మ లంకానగరాన్ని అత్యంత రమణీయంగా నిర్మించాడు.

"సీత ఆ లంకాపట్టణంలో దీనురాలై ఉంది. పట్టువస్త్రాన్ని ధరించి ఉంది. ఆమె చుట్టూ రాక్షసస్త్రీలు కాపలా ఉన్నారు. అక్కడికి మీరు వెళ్ళగలిగితే రావణుణ్ణి చూడగలరు.

"సందేహించకండి. మీరు అక్కడికి వెళ్ళి తిరిగి రాగలరు. ఇదంతా నేను దివ్యదృష్టితో చూసి చెప్తున్నాను. నేను రావణుణ్ణి, సీతను ఇక్కడ నుండే చూస్తున్నాను. నాకు దూరదర్శన ముంది.

"నాయనా! నేను వృద్ధుడను. కదలలేని వాణ్ణి. నన్ను సముద్రము వద్దకు తీసికొని పొండి. నా సోదరుడైన జటాయువునకు తర్పణ మిస్తాను;" అన్నాడు సంపాతి.

కపివీరులు సంపాతిని సాగరము వద్దకు ఎత్తుకొని పోయారు. తర్పణము లిచ్చిన తరువాత మళ్ళీ తీసికొని వచ్చి యథాస్థానంలో ఉంచారు. వానరవీరు లందరూ సంపాతి చుట్టూ కూర్చున్నారు. అప్పుడు సంపాతి చాలా ఆసక్తికరమైన విషయాన్ని చెప్పడం జరిగింది.

"వానరులారా! నా రెక్కలు పోయిన తరువాత నేను కదలలేక ఇక్కడే ఉండేవాణ్ణి. నా కుమారుడైన సుపార్శ్వుడు నాకు ఆహారం తెచ్చిపెడుతూ ఉండేవాడు. రావణుడు సీతను అపహరించిన విషయాన్ని సుపార్శ్వుడు కూడా నాకు వివరించి చెప్పాడు.



"మీకు మరొక ఆసక్తికరమైన విషయం చెబుతాను. వింధ్యపర్వతము మీద నిశాకరుడు అనే మహర్షి ఉండేవాడు. ఆ మహాత్ముడు స్నానానికై నదికి వెళ్ళి తిరిగి వస్తూ ఉంటే ఆయనతోపాటు పెద్దపులులు, సింహాలు, సర్పాలు, ఎలుగుబంట్లు మిత్రులవలె కలిసి వస్తూ ఉండేవి.

"ఆయన ఆశ్రమంలోకి వెళ్ళగానే, రాజు అంతఃపురములో ప్రవేశించగానే మంత్రులు వెనుదిరిగి వెళ్ళినట్లు మృగ సర్పాదులు వెనుదిరిగి వెళ్తూవుండేవి. ఆయన ఆశ్రమ ప్రాంతంలో సుగంధయుతమైన గాలులు వీస్తూ ఉండేవి.

"ఆ మహాత్ముని దర్శనభాగ్యం నాకు లభించింది. "సంపాతీ! నీ ద్వారా గొప్ప కార్యము జరుగవలసి ఉంది. నీవు ఈ పర్వతము మీదనే ఉండు. సీతాన్వేషణ కార్యంలో రామదూతలు నీవద్దకు వస్తారు. రాముని భార్యను గూర్చి నీకు తెలిసింది వారికి చెప్పు.

"ఈ కార్యము కాగానే నీకు మళ్ళీ రెక్కలు వస్తాయి" అని చెప్పాడు. నేను ఇంతకాలము మీ రాక కొరకే ఎదురు చూస్తున్నాను;" అని సంపాతి పలుకుతూ ఉండగనే వానరుల ముందే సంపాతికి రెక్కలు మొలిచాయి.

ఎట్టని ఈకలతో, రెక్కలు మొలిచిన తన శరీరాన్ని చూసుకొని సంపాతి చాలా సంతోషించింది. సీతాన్వేషణమును దీక్షతో సాగించమని వానరులకు చెప్పి, తన ఎగిరే శక్తిని పరీక్షించి చూసుకొనుటకు ఆకాశాన ఎగిరిపోయింది.

అంతేకదూ మరి! రెక్కలొస్తే ఎవరు నిలుస్తారు?

## ఎవరు దాటుతారు?

సంపాతి చెప్పిన విషయాలను ఆల కించిన వానరులకు అధికానంద మైంది. ఎగురుతూ, దుముకుతూ గగ్గోలు పెట్టేశారు. సీతను తొందరగా దర్శించాలని అందరూ ఉత్సాహపడ్డారు. పరుగెత్తుకుంటూ సాగరతీరం చేరారు.

దక్షిణ సముద్రపు ఉత్తర తీరాన కూర్చు న్నారు వానరులందరూ. కెరటాలు భయంకరంగా విరిగి పడుతున్నాయి. సముద్రం ఒక చోట క్రీడిస్తున్నట్లు, మరొకచోట నిద్రిస్తున్నట్లు కన్పిస్తూ ఉంది. ఎటుచూచినా గగుర్పాటును కలిగించే ఆ సముద్రాన్ని చూసి వానరు లందరూ గుండె లదరి కూర్చున్నారు. ఏమి చెయ్యాలో వారికి బోధపడలేదు.

దిగులు చెంది యున్న వానరులను చూసి నాయకుడైన అంగదుడు వారికి ధైర్యాన్ని మారిపోపే ప్రయత్నం చేశాడు.

"వానరవీరులారా! ధైర్యాన్ని ప్రదర్శించాల్సిన సమయాల్లో దిగులు పడడం వీరుల లక్షణం కాదు. దైన్యాన్ని దూరం చేసుకోండి. ధైర్యాన్ని కూడ గట్టుకోండి.

**న విషాదే మనః కార్యం విషాదో దోషవత్తరః**

**విషాదో హన్తి పురుషం బాలం క్రుద్ధ ఇవోరగః**

"మనసులో విషాదాన్ని రానివ్వ కూడదు. విషాదము దోషవత్తర మైనది. పగపట్టిన పాము బాలుని కాటు వేయునట్లు విషాదము వ్యక్తిని హతమార్చుతుంది" అన్నాడు అంగదుడు.

సంపాతి సంసర్గము ఏర్పడక ముందు అంగదుని యొక్క పరిస్థితి కూడా అలాగే ఉండింది. భయంతో ప్రాయోపవేశానికే సిద్ధపడ్డాడు. సుగ్రీవుని అనరాని మాటలు అన్నాడు కూడా. భయాలు అలా ఉంటాయిమరి!

ఇప్పుడు అంగదునికి ధైర్యం ఏర్పడింది. సంపాతి వచనాలను విన్న తరువాత రామకార్యంలో ఉత్సాహం అధికమైంది. భయం నశించింది. ఆ రాత్రి అందరూ విశ్రమించారు.

మరునాడు ఉదయం అంగదుడు వానరవీరులను, వానరసైన్యాన్ని ఉద్దేశించి ఇలా పలికాడు: "మనలో ఈ సముద్రమును దాటగల ధీరు లెవ్వరు? సుగ్రీవుని మాటను నిలబెట్టే శూరు లెవ్వరు? సామర్థ్య మున్నవారు ఇప్పుడే మాతో చెప్పండి;" అన్నాడు అంగదుడు.



అందరూ నిశ్శబ్దాన్ని చక్కగా పాటించారు. ఒక్కరు కూడా నోరు విప్పలేదు. వానరసేనంతా నిస్తరంగ జలధిలాగా ఉండిపోయింది. అంగదుడు మళ్ళీమళ్ళీ అడిగాడు.

"నేను పది యోజనాల దూరం దాటగలను" అన్నాడు గజుడు.

"నేను ఇరవై యోజనాల దూరం దాటగలను" అన్నాడు గవాక్షుడు.

"నేను ముప్పై యోజనాలు దాటగలను" అన్నాడు శరభుడు.

"నా వరకు నేను నలభై" అని ఋషభుడు, "యాభై వరకు ఆలోచింప నవసరం లేదు"అని గంధమాదనుడు, "అరవై నాకు సులభమే" అని మైందుడు, "డెబ్బై వరకు నాపేరు రాసుకోవచ్చు" అని ద్వివిదుడు, "ఎనభై అయితే నేనున్నాను" అన్నాడు సుషేణుడు.

అందరూ అలా చెబుతూ ఉండగా విని జాంబవంతుడు ఇలా పలికాడు. "పూర్వము నాకూ ఎగురుటకు కొంత శక్తి ఉండేది. కాని ఇపుడు మేము చివరి రోజుల్లో ఉన్నాము.

"ఏది ఎలా ఉన్నా, రాముడు, సుగ్రీవుడు తలపెట్టిన కార్యాన్ని నిర్వహించడం మన తక్షణ కర్తవ్యం. నా విషయం నేను చెబుతున్నాను. నేను నిస్సందేహంగా తొంభై యోజనాలు ఎగురగలను.

"ఈనాటి నా పరిస్థితి అది. ఒకనాటి పరిస్థితి వేరుగా ఉండేది. బలిచక్రవర్తి యజ్ఞమునందు ముల్లోకములను ఆక్రమించిన వామనమూర్తికి నేను ప్రదక్షిణము చేశాను. నేడు నేను ముసలి వాణ్ణయ్యాను. ఈనాటి నా శక్తి మన కార్యసాధనకు సరిపోదు;" అన్నాడు జాంబవంతుడు.

"నేను నూరు యోజనముల దూరము ఎగురగలను. కానీ తిరిగి రాగలనా! అనేదే సందేహంగా ఉంది;" అన్నాడు అంగదుడు.

"అంగదా! నీ శక్తి నాకు తెలుసు. నీవు లక్ష యోజనముల దూరము కూడా ఎగురగలవు. దేనికైనా నీవు సమర్థుడవే. అయినా నీవు నాయకుడవు. ఆజ్ఞ లివ్వవలసిన వాడవు. నీవు వెళ్ళడం సముచితం కాదు" అన్నాడు జాంబవంతుడు.

"ఇది మరీ బావుంది. నేనూ వెళ్ళక, మరొక కపివీరుడు వెళ్ళక మనం ఏమి చెయ్యాలి? మళ్ళీ ప్రాయోపవేశమేనా!" అన్నాడు అంగదుడు.

"యువరాజా! మన కార్యానికి విఘ్నము లేదు. రాదు. ఈ కార్యాన్ని సాధించ గలవాణ్ణి నేను చూపిస్తానుగదా!" అని పలికి ఒంటరిగా కూర్చుని యున్న మహావీరుడు, వానరశ్రేష్ఠుడైన ఆంజనేయుని సమీపించాడు జాంబవంతుడు.

"హనుమంతా! ఏమిటిదంతా! నీవు వుండగా మాకేల ఈ చింత! నీవు ఇలా ఒంటరిగా కూర్చోవడమే గొప్ప వింత! విన్నావు కదా వాళ్ళు చెప్పేదంతా! నేనూ చెప్తా ఏదో కొంత! నాకు తోచినంత!" అంటూ ప్రారంభించాడు జాంబవంతుడు.

"హనుమా! నీవు అసమాన పరాక్రమవంతుడవు. సుగ్రీవ రామ లక్ష్మణులతో సమానుడవు. గరుడుని రెక్కల బలమెంతో నీ భుజాల బల మంత! ఈ కార్యానికి నీవు ఎందుకని సిద్ధపడుటలేదు? నిన్ను గూర్చి నీకే తెలియదు. హనుమా! నీ చరిత్ర చెబుతాను. విను." అంటూ ఆంజనేయుని జననవైభవాన్ని, బుద్ధిబలాలను వర్ణించాడు జాంబవంతుడు.

## హనుమద్వైభవము

అప్సరస్త్రీలలో పుంజకస్థల అను అప్సర అసమాన సౌందర్యవతి. శాపకారణంగా ఆమె కుంజరుడనే వానరశ్రేష్ఠునకు కుమార్తెగా జన్మించింది. ఆమె పేరే అంజన. కేసరి భార్య.

ఆమె కామరూపిణి. ఒకనాడు అందమైన ఆ అంజన మానవస్త్రీ రూపాన్ని ధరించింది. తెల్లని పట్టువస్త్రాన్ని కట్టుకొని, అందమైన పుష్పమాలలు ధరించి, పర్వతశిఖరముపై నిలబడి ఉంది. పచ్చని, ఎఱ్ఱని అంచులు గల తెల్లని పట్టుచీర ఆమె అందానికి నూతన వన్నె తెచ్చింది.

వాయువు మెల్లగా వీచగానే పలుచని ఆమె పట్టుచీర మెల్లగా ప్రక్కకు తొలగింది. అది చూసిన వాయుదేవుని మెడ ప్రక్కకు ఒరిగింది. కళ్ళు వరదాలు దించినట్లు మూతపడ్డాయి. పొడవైన తన బాహువులు చాచి ఆమెను కౌగలించుకున్నాడు వాయుదేవుడు.

"ఎవరది? నా పాతివ్రత్యాన్ని ముట్టుకుంటున్న వాడెవడు?" అన్నది అంజన. "భయపడకు! నిన్ను నేను హింపించను. నేను నా మనసుతోనే నీలో ప్రవేశించాను. నీకు వ్రతభంగం కాలేదు. నీకు వీరుడైన పుత్రుడు జన్మిస్తాడు.

"ధైర్యస్థైర్యములు, బలపరాక్రమములు గల నీ పుత్రుడు ఎగురుటలో, దుముకుటలో నాతో సమానుడై ఉంటాడు;" అన్నాడు వాయుదేవుడు.

వాయుదేవుని మాటలు అంజనకు ఆనందాన్ని కల్గించాయి. ఒక గుహలో అంజన బిడ్డను కన్నది. ఆంజనేయు డతడే.

బాలుడుగా ఉన్న ఆంజనేయుడు ఒకనాడు ఉదయభానుని చూచి ఫలమని భావించాడు. దాన్ని తెచ్చుకొని తినాలి అనుకొని ఆకాశంలో ఎగిరాడు. తెలియకుండానే మూడు వందల యోజనాల దూరము ఎగిరాడు బాలాంజనేయుడు. *

సూర్యుని వేడి తీవ్ర మవుతున్నా అంజనీపుత్రుడు బాధపడలేదు. తీవ్రవేగంతో ఆకాశంలో ఎగురుతున్న బాలుని చూసిన ఇంద్రుడు క్రుద్ధుడై వజ్రాయుధాన్ని బాలునిపై విసిరాడు.

అది తగలగానే ఆంజనేయుడు పర్వతశిఖరము మీద పడ్డాడు. ఎడమ గడ్డము విరిగిపోయింది. అందుచేతనే "హనుమంతుడు" అని పేరు వచ్చింది.

ఇది చూచి ఆంజనేయుని తండ్రి యగు వాయుదేవుడు కోపించాడు. చలించడం మానేశాడు. ఆ బాధను భరించలేక దేవత లందరూ వాయుదేవుని ప్రార్థించారు.

వాయుదేవుని శాంతింప చేయుటకు బ్రహ్మదేవుడు ఆంజనేయునకు అస్త్రముల చేతగాని, శస్త్రముల చేతగాని మరణము లేనట్లు వరమిచ్చాడు. వజ్రఘాతానికి కూడా జంకని ఆంజనేయుని పరాక్రమమునకు సంతసించిన దేవేంద్రుడు స్వచ్ఛంద మరణము వచ్చునట్లు వరమిచ్చాడు. ఈవిధంగా ఆంజనేయుడు కేసరికి క్షేత్రజపుత్రుడు. వాయుదేవునకు ఔరసపుత్రుడు.

---

* ఈనాడు లంకను చేరడానికి హనుమంతుడు దాటవలసిన సాగరము పొడవు వంద యోజనములే.



"హనుమా! ఇదీ నీ కథ! తెలిసిందా! దాటుటలో, ఎగురుటలో నీవు వాయుదేవునితో సమానుడవు. నీవే మమ్మల్ని రక్షించాలి.

"హనుమా! ఇంకా చూస్తావేం! విజృంభించు నాయనా! నీ పరాక్రమాన్ని తిలకించాలని వానరసైన్య మంతా ఉబలాట పడుతోంది.

"లే! ఆంజనేయా! లెమ్ము! వాయుపుత్రా! సాగరాన్ని లంఘించు;" అని జాంబవంతుడు పలకగా ఆంజనేయుడు శరీరాన్ని పర్వతంలా పెంచేశాడు.

## హనుమంతుని మహోత్సాహం

నూరు యోజనాల సాగరాన్ని దాటుటకు నిశ్చయించుకొని బలం పుంజుకుంటూ దేహాన్ని పెంచుకుంటున్న హనుమంతుని చూచి వానరులందరూ తమ దిగులుతో దిష్టి తీసేశారు.

ఆనందంతో వానరులు సింహగర్జనలు చేశారు. నోటికొచ్చినట్లు పొగిడారు. ఒళ్ళు తెలియకుండా ఆడారు. అది చూచి హనుమంతుడు ఆనందంతో ఇంకా బలాన్ని పెంచుకున్నాడు. తోకను గట్టిగా జాడించాడు.

ఆంజనేయుడు దివ్యమైన ఆకారంతో శోభిస్తున్నాడు. శ్రేష్ఠులు, జ్యేష్ఠులు అయిన వానరుల కందరికీ నమస్కరించి, అందరికీ హృదయానందం కలిగేలా భాషించాడు.

"వాయుదేవుడు అగ్నిదేవునికి మిత్రుడు * **(హుతాశనసఖః)**. వాయుదేవుడు బలశాలి. గమనశీలుడు. గగనవిహారి. పర్వతాల్ని ఎగురవేయగల పరాక్రమశాలి. నేను ఆయన ఔరసపుత్రుడను. ఎగురుటలో వాయుదేవునితో సమానుడను.

"నా బాహువేగంతో సముద్రాల్ని దొర్లించి గిరులను, నదులను, తటాకాలను, యావత్ప్రపంచాన్ని ముంచెయ్యగలను. నేను వేగంగా ఆకాశాన విహరిస్తుంటే నా తొడల వేగానికి సముద్రము పొంగి నింగి నంటుకుంటుంది.

"గగనవిహారు లెవ్వరైనా నాకు ముందుగా చరించలేరు. అవసరమైతే సముద్రాల్ని ఎండింప చేస్తాను. భూమిని బ్రద్దలు కొట్టేస్తాను.

"ఇప్పుడు నేను ఎగురుతాను కదా! మీరంతా చూస్తూ ఉండండి. వికసించిన లతలు, పూసిన పూలు, కాసిన చెట్లూ నా వెంట వస్తాయి. మేరుపర్వతంతో సమానమైన నా దేహము ఆకాశంలో ఎగురుతూ ఉంటే ఆకాశాన్ని అమాంతం మ్రింగేసినట్లే ఉంటుంది.

"ఆకాశంలో నేను సంచరిస్తుంటే నాతో పాటు వేగంగా చరించగలవారు ఇద్దరే. వాయుదేవుడు ఒకడైతే గరుత్మంతుడు మరొకడు.

**బుద్ధ్యాచాహం ప్రపశ్యామి మనశ్చేష్టా చ మే తథా**
**అహం ద్రక్ష్యామి వైదేహీం ప్రమోదధ్వం ప్లవంగమాః**

---

* అగ్నివాయువుల సఖ్యాన్ని హనుమంతుడు ఎందుకు ప్రస్తావించినట్లు? పవిత్రాత్ములు జరగబోయే విషయాలను అప్రయత్నంగా అనేస్తుంటారు. అగ్ని ప్రస్తావన లంకాదహనానికేనా!



"నా బుద్ధితో నేను చక్కగా వీక్షిస్తున్నాను. నా మనస్సు కూడా అదే చెబుతూ ఉంది. నేను సీతమ్మను చూడగలను. మీరంతా సంతోషించండి.

"వంద యోజనా లేమిటి? పదివేల యోజనముల దూరం కూడా నేను ఎగురగలను. లంకా పట్టణాన్నే పెకలించి తేగలను;' అని వీరాంజనేయుడు గర్జించాడు. వానరులంతా రెప్ప వేయకుండా హనుమంతుని చూస్తున్నారు.

"వీరుడా! కేసరిపుత్రా! వేగవంతుడా! వాయునందనా! నాయనా! మిత్రులందరి దుఃఖాన్ని దూరం చేశావు. మేమంతా నీకు శుభాన్ని కాంక్షిస్తున్నాము. నీకు ఋషుల అనుగ్రహముంది. పెద్దల ఆశీస్సు లున్నాయి. గురువుల దయ ఉంది. సముద్రాన్ని దాటేయ్;" అన్నాడు జాంబవంతుడు.

"నేను ఎగిరే సమయంలో నా వేగాన్ని ఎవరూ తట్టుకోలేరు.* ఈ మహేంద్రపర్వత శిఖరాలు చాలా గట్టివి. పెద్దవి కూడా. నా వేగాన్ని ఆ శిఖరం మీదనుండి చూపిస్తాను;" అని పలికి పవనసుతుడు మహేంద్ర పర్వతాన్ని ఎక్కాడు.

ఆ మహేంద్రపర్వతంపై హనుమంతుడు అటూ ఇటూ తిరిగాడు. ఆ తాకిడికి సింహం కొట్టిన దెబ్బకు మదగజము ఘీంకరించినట్లు మహేంద్రపర్వతము ధ్వని చేసింది.

పర్వతగుట్టలపై ఉన్న రాళ్ళు చెల్లాచెదరయ్యాయి. లేళ్ళు, ఏనుగులు, పులులు, సింహాలు బేజారెత్తి పరుగెత్తాయి. చెట్లు ఊగిపోయాయి. పక్షు లెగిరిపోయాయి. గుడ్డను పిండినట్లు మహేంద్రపర్వతం జలాన్ని స్రవించింది.

భయంకరమైన సర్పాలు సగం శరీరముతో పైకి లేచాయి. అప్పుడు అవి మహేంద్రగిరిపై జెండాలవలె శోభించాయి. విజయపతాకాలు ఎగురవేసినట్లు అగుపించాయి.

పర్వతశిఖరంపై పవనసుతుడు పర్వతరూపుడై నిలబడి ప్రయాణానికి సిద్ధంగా ఉన్నాడు.

**జై జై పవనసుత హనుమాన్ కీ!**

**కిష్కింధాకాండము సమాప్తము.**

* గాలిలో ఎగిరే విమానం యొక్క టేకాఫ్ (take-off) దశ ఇది.

# సుందరకాండము

